
'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 283

బుధవారం 3-1-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సమం చేస్తారా.. అప్పగిస్తారా!

కేప్‌టౌన్‌లో నేటి నుంచి దక్షిణాఫ్రికాతో భారత జట్టు రెండో టెస్టు. -12లో



రూ.70 వేలకు పుత్తడి

ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కారణం -13లో



రెండు రోజుల్లో 155 ప్రకంపనలు

జపాన్ ఇషికావ ప్రిఫెక్చర్‌లో భూకంప సంబంధిత ప్రమాద ఘటనల్లో 50 మందికి పైగా చనిపోయారు.

- వివరాలు 6లో



రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం అనేది కేంద్రం విశ్వసించే విధానమని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.

- వివరాలు 6లో



మణిపూర్‌లో కాల్పులు

మణిపూర్‌లోని మొరెహ్‌లో భద్రతా బలగాలు, మిలిటెంట్లకు మధ్య మరోసారి కాల్పులు చోటుచేసుకున్నాయి.

- వివరాలు 6లో



వలసలను అడ్డుకున్నాం

దేశంలోకి ఆశ్రయం కోసం వచ్చే వారి దరఖాస్తులను పరిష్కరించాలన్న లక్ష్యాన్ని చేరుకున్నట్లు బ్రిటన్ ప్రధాని రిషి చెప్పారు.

- వివరాలు 6లో



హైదరాబాద్ నాంపల్లిలోని ఎంజే మార్కెట్ వద్ద పెట్రోల్ బంక్ వద్ద బారులుతీరిన వాహనదారులు



హైదరాబాద్‌లో ట్రాఫిక్‌జాం

ట్యాంకర్ డ్రైవర్ల సమ్మెతో

పెట్రోల్ కటకట!

బంకులకు పోటెత్తిన వాహనదారులు

మధ్యాహ్నానికల్లా నిండుకున్న నిల్వలు.. చాలాచోట్ల నో స్టాక్ బోర్డులు

- సాయంత్రానికి అదుపు తప్పిన పరిస్థితి.. పలుచోట్ల ఘర్షణలు
- రోడ్లపై వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ జామ్.. హైదరాబాద్‌లో వాహనదారుల నరకయాతన
- రాష్ట్రవ్యాప్తంగా 3 వేల బంకులు మూత
- ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో పౌరసరఫరాల కమిషనర్ సమావేశం
- ప్రజలకు ఇబ్బందిలేకుండా చూడాలని సూచన.. సమ్మె విరమణతో నేడు సాధారణ పరిస్థితి నెలకొనే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంగళవారం పెట్రోల్, డీజిల్ కొరత ప్రజలకు చుక్కలు చూపించింది. ప్రధానంగా హైదరాబాద్, ఇతర నగరాలు, పట్టణాల్లోని బంకులకు వాహనాలు పోటెత్తడం, ప్రధాన రహదారుల పక్కన కూడా బారులు తీరడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. మధ్యాహ్నానికల్లా చాలావరకు బంకులు మూతపడటం, తెరిచి ఉన్న బంకులను ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఫోర్ వీలర్లు చుట్టు ముట్టడంతో ఒక దశలో పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది. పలుచోట్ల బంకుల సిబ్బంది, వాహనదారుల మధ్య ఘర్షణలు జరగడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. సాయంత్రానికి పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. బంకుల వద్ద ట్రాఫిక్ స్తంభన ప్రభావం ప్రధాన కూడళ్లు, రహదారులపై పడింది. ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్‌తో వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి ఏర్పడింది. పనుల మీద బయటకొచ్చిన వారు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక పెట్రోల్, డీజిల్ అయిపోయిన వాహనదారుల పరిస్థితి

మిగతా 10వ పేజీలో ▶

రోజంతా అల్లాడించి.. రోడ్డెక్కిన ట్రక్కులు

వివరాలు 6లో

- పెట్రోలు బంకులకు పోటెత్తిన జనం
- దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా క్యూలే
- నిత్యావసరాల సరఫరాకు తీవ్ర అంతరాయం
- చివరికి కేంద్రం హామీతో సమ్మె విరమణ

సమాఖ్య స్ఫూర్తితో సాగుదాం

ప్రజా సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కలిసి పనిచేయాలి

రాష్ట్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ నిర్ణయం

సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టితో నీతి ఆయోగ్ బృందం భేటీ

16వ ఆర్థిక సంఘం కేటాయింపులు, వెనుకబడిన ప్రాంతాల గ్రాంట్లు ఇప్పించాలని కోరిన ముఖ్యమంత్రి



నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్‌కుమార్‌తో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజల సంక్షేమం, సమగ్రాభివృద్ధి లక్ష్యంగా సమాఖ్య స్ఫూర్తితో కలిసి పనిచేయాలని తెలంగాణ ప్రభుత్వం, నీతి ఆయోగ్ నిర్ణయించాయి. సమర్థవంత పాలన కోసం సహకార సమాఖ్య వ్యవస్థను కొనసాగించేందుకు అంగీకరించాయి. మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతో నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్‌కుమార్ బేరీ బృందం సమావేశమైంది. సుదీర్ఘంగా జరిగిన ఈ భేటీలో నీతి ఆయోగ్ పక్షాన సభ్యులు డాక్టర్ విజయ్‌కుమార్ సారస్వత్, అభివృద్ధి పర్యవేక్షణ, మూల్యాంకన కార్యాలయ డైరెక్టర్ జనరల్ సంజయ్‌కుమార్,

మిగతా 3వ పేజీలో ▶

హైదరాబాద్ చుట్టూ మెట్రో

5 కారిడార్‌లలో మెట్రో రైల్ రెండో దశ విస్తరణకు సమగ్ర ప్రణాళికలు

ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



- ప్రధాన ప్రాంతాలకు, అత్యధిక జనాభాకు మెట్రో సేవలు ఉండేలా ప్రతిపాదనల రూపకల్పనకు సూచన
- ఎంజీబీఎస్ నుంచి పాతబస్తీ మీదుగా ఎయిర్‌పోర్టుకు మెట్రో ఖరారు
- మూడో దశలో జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు విస్తరణ ప్రతిపాదన
- మూసీ రివర్‌ఫ్రంట్ ఈస్ట్–వెస్ట్ కారిడార్‌ను మెట్రో ప్రాజెక్టులో చేర్చాలని సూచన

14లో

న్యూస్‌రీల్

ఏప్రిల్‌లో టెట్!



ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహణకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. విద్యాశాఖపై సీఎం సమీక్షలో ఈ అంశం చర్చకు వచ్చింది. ప్రభుత్వ టీచర్లకు పదోన్నతి కల్పించడానికి టెట్ అనివార్యమని అధికారులు సీఎంకు తెలిపారు. దీంతో త్వరగా టెట్ నిర్వహించాలని సీఎం ఆదేశించినట్టు అధికారులు చెబుతున్నారు.

- వివరాలు 3లో

జపాన్‌లో మరో విషాదాంతం



జపాన్‌లో భూకంప బాధితుల కోసం సహాయక సామగ్రిని చేరవేయాల్సిన విమానం ప్రమాదంలో చిక్కుకొని ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. విమానాశ్రయం రన్‌వేపై ల్యాండ్ అవుతున్న విమానం మరో విమానాన్ని ఢీకొట్టింది. మొదటి విమానంలో ఉన్న 379 మంది క్షేమంగా ప్రాణాలతో బయటపడ్డారు.

- వివరాలు 6లో

సింగరేణికి కొత్త బాస్



సింగరేణి బొగ్గు గనుల సంస్థ సీఎండీగా తొమ్మిదేళ్ల పాటు పనిచేసిన ఎన్. శ్రీధర్ పదవీ కాలం గతేడాది డిసెంబర్ 31తో ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో సింగరేణి ఫైనాన్స్ విభాగం డైరెక్టర్ ఎన్.బలరామ్‌కు సీఎండీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది.

- వివరాలు 14లో

ఆధునిక మగ్గాలు ఆగాయి



ఒకవైపు మార్కెట్‌లో బట్టకు సరైన ధర లేదు... మరోవైపు వస్త్రోత్పత్తి నిల్వలు పేరుకుపోయాయి. దీంతో సిరిసిల్లలోని టెక్స్‌టైల్‌పార్క్ పరిశ్రమలను యజమానులు మంగళవారం మూసివేశారు. దీంతో నేత కార్మికులకు ఉపాధి కరువైంది. టెక్స్‌టైల్ పార్క్‌లో మాంద్యం కారణంగా వస్త్రోత్పత్తి గిట్టుబాటు కావడం లేదని వస్త్రోత్పత్తిదారులు పేర్కొంటున్నారు.

- వివరాలు 5లో

సన్నాలు పైపైకి

భారీగా పెరుగుతున్న బియ్యం ధరలు

క్వింటాల్ రూ.7,800కి చేరిన జై శ్రీరామ్.. తర్వాత రూ. 200 తగ్గింపు

- అదే దారిలో హెచ్‌ఎంటీ ధర రూ.7,000 పైనే..
- బీపీటీ, ఆర్‌ఎన్‌ఆర్, తెలంగాణ సోనా రూ. 5,500 నుంచి రూ. 6,500 వరకు
- వానాకాలంలో సన్నాల దిగుబడి తగ్గడమే ప్రధాన కారణం

సాక్షి, హైదరాబాద్: సన్న బియ్యం సామాన్యులు కొనలేని పరిస్థితి దాపురించింది. దిగుబడి తగ్గడం ఒక కారణమైతే... మిల్లర్లే ఎక్కువగా కొనుగోలు చేయడం మరో కారణం. రిటైల్ మార్కెట్‌లో నాణ్యతను బట్టి పాత సన్న బియ్యం ధర క్వింటాల్‌కు రూ.6 వేల నుంచి 8వేల వరకు ఉండడం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. కొత్తగా వచ్చిన వానాకాలం బియ్యాన్ని కూడా రూ.6వేలకు క్వింటాల్ చొప్పున విక్రయిస్తున్నారు. హైపర్ మార్కెట్లు, సూపర్ బజార్లలో సైతం బియ్యం ధరలు సామాన్య, మధ్య తరగతి వర్గాలను బెంబేలెత్తిస్తున్నాయి.

జై శ్రీరామ్ క్వింటాల్‌కు రూ.7,800 వరకు

సన్నబియ్యంలో అగ్రగామిగా చెప్పుకునే జైశ్రీరాం రకం పాత బియ్యం ధర నాలుగు రోజుల క్రితం క్వింటాల్‌కు రూ. 7,800 వరకు రిటైల్ మార్కెట్‌లో పలికింది. తర్వాత రూ. 200 వరకు తగ్గినా, మళ్లీ ధర పెరిగింది. మంగళవారం రూ. 7,500 నుంచి రూ. 7,800 వరకు రిటైల్ మార్కెట్‌లో అమ్మినట్టు సమాచారం. హెచ్‌ఎంటీ రకం బియ్యం(పాతవి)



రూ.7,200 వరకు, కొత్తవి రూ.6,500 నుంచి 7,000 వరకు రిటైల్ మార్కెట్‌లో అమ్ముతున్నారు. బీపీటీ, ఆర్‌ఎన్‌ఆర్, తెలంగాణ సోనాలను రూ. 5,500 నుంచి 6,500 వరకు అమ్ముతున్నారు.

దొడ్డు బియ్యం అంతంతే

దొడ్డు బియ్యం ధర క్వింటాల్ రూ.4,500 నుంచి ఉన్నా, వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. హైదరాబాద్

మిగతా 5వ పేజీలో ▶

బడ్జెట్‌లో భారీ అంచనాలొద్దు

మారిన ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని అంచనాలు రూపొందించండి

- ప్రస్తుతం అమల్లో ఉన్న పథకాలు కొనసాగించాలా వద్దా పరిశీలించండి
- 2024–25 బడ్జెట్ అంచనాలపై ప్రభుత్వ శాఖలకు ఆర్థిక శాఖ ఆదేశాలు

3లో





కాళేశ్వరంపై సీబీఐ విచారణ కోరండి

- 48 గంటల్లో కేంద్రం నుంచి అనుమతి తీసుకొస్తా
- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్
- మార్చి తొలి వారంలోగా లోక్‌సభ షెడ్యూల్ వెలువడే అవకాశాలు
- జనసేనతో పొత్తు ఉండదని వెల్లడి

2లో

కేసీఆర్‌ను రక్షించేందుకే సీబీఐ విచారణా?

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై మంత్రి పొన్నం ఫైర్
- ప్రజాపాలన దరఖాస్తులకు ఈనెల 6 వరకే గడువని స్పష్టీకరణ
- లారీ డ్రైవర్ల ఆందోళనపై కేంద్రం స్పందించాలని డిమాండ్

2లో





కాళేశ్వరంలో కేంద్రానికి వాటాలు!

- వారంలోగా న్యాయవిచారణకు ఆదేశిస్తాం
- 10 ఏళ్లలో సీబీఐ, ఈడీ విచారణ ఎందుకు వేయలేదు?
- ఇప్పుడు ఎందుకు సీబీఐ, ఈడీ విచారణ అడుగుతున్నారు?
- కిషన్‌రెడ్డి ఆరోపణలపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఫైర్

2లో

ఇదండీ సంగతి



ష్! కనీసం డిపాజిట్లన్న సంపాదించుకుని ఉండాల్సింది!

క్లుప్తంగా...

నాకు ఎస్కార్ట్ వద్దు .. ప్రజలకు రక్షణ ఇవ్వండి

డీఐజీ, ఎస్పీకి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి లేఖ



డీఐజీకి లేఖ అందజేస్తున్న అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: 'నాకు మీరు రక్షణగా పంపుతున్న పోలీస్ ఎస్కార్ట్ వద్దు.. నాకు బందోబస్తుగా పంపుతున్న పోలీస్ సిబ్బంది సేవలను ప్రజా సమస్యల పరిష్కారానికి, శాంతిభద్రతల పరిరక్షణకు వినియోగించండి' అని కోరుతూ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మంగళవారం జోగుళాంబ జోన్ డీఐజీ ఎస్‌కే చౌహాన్, ఎస్పీ హర్షవర్ధన్‌కు లేఖ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో తాను పర్యటిస్తున్న సమయంలో పోలీసు అధికారులు ఓ ఎస్కార్ట్ వాహనాన్ని తనకు రక్షణగా పంపుతున్నారని, దీంతో పోలీసుల సేవలు సకాలంలో ప్రజలకు అందని పరిస్థితి నెలకొందన్నారు. తాను మండలాల్లో పర్యటించినప్పుడల్లా పోలీసులు తన కోసం గంటల తరబడి వేచి ఉండడంతో విలువైన సమయం వృథా అవుతోందన్నారు. తన రక్షణ కోసం ప్రభుత్వం సెక్యూరిటీని కేటాయించిందని, ఇది చాలని ఎమ్మెల్యే చెప్పారు. ఈ మేరకు ఆయన రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం

వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల



వేంపల్లె: కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల తెలిపారు. తల్లి విజయమ్మ, కుమారుడు రాజారెడ్డి, కుమార్తె అంజలి, కాబోయే కోడలు అట్లూరి ప్రియ, వియ్యంకులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆమె మంగళవారం వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్సార్ సమాధికి నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సమాధి వద్ద తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రిక ఉంచి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వైఎస్.షర్మిల విలేకరులతో మాట్లాడుతూ తన కుమారుడు రాజారెడ్డికి అట్లూరి ప్రియతో ఫిబ్రవరి 17న వివాహం జరగబోతున్న నేపథ్యంలో దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి ఆశీస్సులు పొందేందుకు వచ్చినట్లు చెప్పారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించడంలో వైఎస్సార్‌టీపీ కీలక పాత్ర పోషించిందన్నారు. వైఎస్సార్‌టీపీ చేసిన త్యాగానికి విలువనిచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆహ్వానించారని తెలిపారు. అంతకు ముందు హైదరాబాద్‌లో లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె ముఖ్య నేతలతో సమావేశమయ్యారు.కాగా గురువారం ఢిల్లీలో ఏఐసీసీ నేతల సమక్షంలో కాంగ్రెస్‌లో పార్టీ విలీన ప్రక్రియ ఉంటుందని,పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపించింది హిందువులే

బీజేపీకి విజయశాంతి చురకలు



సాక్షి, హైదరాబాద్: అయోధ్యలో జరుగుతున్న రాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం ఏ రాజకీయ పార్టీకో సంబంధించింది కాదని కాంగ్రెస్ నాయకురాలు, మాజీ ఎంపీ విజయశాంతి అభిప్రాయపడ్డారు. ఆ కార్యక్రమంలో పాల్గొనని వారు హిందూ వ్యతిరేకులనే రీతిలో రాజకీయ పరంగా ఎత్తి చూపే వారు చేస్తున్న ప్రయత్నం సరైంది కాదని మంగళవారం ఒక ప్రకటనలో ఆమె తెలిపారు. అలాంటి రాజకీయం చేసే వారిదే తప్పు కానీ, పాల్గొనలేని భక్తులు, వ్యక్తులు, పార్టీల తప్పు ఏ మాత్రం కాదని విజయశాంతి స్పష్టంచేశారు. కాంగ్రెస్ పార్టీని హిందూ వ్యతిరేక పార్టీగా చూపెట్టే ప్రయత్నం హాస్యాస్పదమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని తిరుగులేని విశ్వాసంతో హిందువులే గెలిపించుకున్నారన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

మహిళలు దూరమవుతున్నారని ఆటోడ్రైవర్లను రెచ్చగొడుతున్నారు

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం తెలంగాణ మహిళాలోకానికి సౌకర్యవంతంగా ఉందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.సునీతారావు చెప్పారు. ఆ పథకాన్ని విద్యార్థులు, చిరు వ్యాపారాలు చేసుకునే వారు, అన్ని వర్గాలకు చెందిన మహిళలు మనస్ఫూర్తిగా ఉపయోగించుకుంటున్నారన్నారు. ఈ పథకం ద్వారా మహిళలు తమకు దూరమవుతున్నారనే భావనతో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటై ఆటో డ్రైవర్లను ఉసిగొల్పుతున్నారని ఆమె ఆరోపించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ఆటో, క్యాబ్ డ్రైవర్ల గోడు వినేందుకు ఆ పార్టీలో మంత్రులుగా పనిచేసేవారు ముందుకు రాలేదని విమర్శించారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం చేస్తామని తాము ఎన్నికల మేనిఫెస్టోలోనే పెట్టామని గుర్తుచేశారు.

నేటి నుంచి బీఆర్ఎస్ సమావేశాలు

లోక్‌సభకు సన్నద్ధత షురూ

- తొలిరోజు ఆదిలాబాద్ సెగ్మెంట్ నేతలతో భేటీ



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా బుధవారం నుంచి సన్నాహక సమావేశాలు నిర్వహించేందుకు భారత్ రాష్ట్ర సమితి ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు రెండు విడతలుగా రోజుకో లోక్‌సభ నియోజకవర్గం చొప్పున భేటీలు జరుగుతాయి. తొలి రోజు బుధవారం ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని పార్టీ నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణ భవన్‌లో ఉదయం 10.30 కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభమవుతుంది. ఆదిలాబాద్ మాజీ ఎంపీ గోడెం నగేశ్‌తో పాటు ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, మాజీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు సుమారు 500 మంది పాల్గొంటారు.

సీనియర్ నేతలకు సమన్వయ బాధ్యతలు

సన్నాహక సమావేశాలను కేటీఆర్‌తో పాటు పార్టీ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు, మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్ రెడ్డి, మధుసూదనాచారి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, నిరంజన్ రెడ్డి తదితరులు సమన్వయం చేస్తారు. ఒక్కొక్కరికి ఒక్కో లోక్‌సభ నియోజకవర్గ సమన్వయ బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. కాగా ఈ సన్నాహక సమావేశాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తారు.

కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ

లోక్‌సభ సన్నాహక సమావేశాల ప్రారంభం నేపథ్యంలో కేటీఆర్ మంగళవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ముఖ్య నేతలకు దిశా నిర్దేశం చేయాల్సిన అంశాలను కేసీఆర్ వివరించారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి నేపథ్యంలో తొలిసారిగా పార్టీ కీలక నేతలందరూ హాజరవుతుండటంతో ఈ సన్నాహక సమావేశాలపై పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది.

నేడు టీపీసీసీ విస్తృత భేటీ

రాష్ట్ర ఇన్‌చార్జ్ హోదాలో తొలిసారి హైదరాబాద్‌కు వచ్చిన దీపాదాస్ మున్షీ

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీతోపాటు ఏఐసీసీ ఇన్‌చార్జ్ కార్యదర్శులు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, పీఏసీ, పీఈసీ సభ్యులు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డీసీసీ అధ్యక్షులు, అన్ని అనుబంధ సంఘాల చైర్మన్లు, అధికార ప్రతినిధులు పాల్గొననున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా జరుగుతుండడంతో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ బలోపేతంపై రేవంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఆయన స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా నియమితురాలైన తర్వాత మంగళవారం తొలిసారి రాష్ట్రానికి వచ్చిన దీపాదాస్ మున్షీకి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరు సతీశ్ తదితరులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు.



సీఎం రేవంత్‌రెడ్డితో దీపాదాస్ మున్షీ

సీఎంను కలిసిన దీపాదాస్ మున్షీ

రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ హోదాలో దీపాదాస్ మున్షీ జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ నివాసానికి వెళ్లారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌ను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై కాసేపు ఆయనతో చర్చించారు. అంతకు ముందు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోనూ మున్షీ భేటీ అయ్యారు.

రేపు ఢిల్లీకి రేవంత్

సీఎం రేవంత్ గురువారం ఢిల్లీ వెళ్లనున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకుగాను అన్ని రాష్ట్రాల సీఎల్పీ నేతలు, పీసీసీ అధ్యక్షులతో ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశానికి హాజరయ్యేందుకు ఆయన ఢిల్లీ వెళ్లనున్నట్టు సీఎంఓ వర్గాల ద్వారా తెలిసింది.

ఒక ఎంపీ సీటివ్వండి

ఒప్పందం ప్రకారం రెండు ఎమ్మెల్సీలు కూడా ఇవ్వాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ బృందం వినతి
- అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అన్న సీఎం?

సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమకు ఒక స్థానం కేటాయించాలని సీపీఐ బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీఎంతో సీపీఐ ప్రతినిధి బృందం మంగళవారం మర్యాదపూర్వకంగా సమావేశమైంది. సచివాలయంలో సుమారు గంట పాటు జరిగిన భేటీలో వర్తమాన అంశాలపై చర్చ జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, పశ్యపద్మ తదితరులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ అవగాహన సత్ఫలితాలను ఇచ్చిందని ఈ సందర్భంగా సీపీఐ నేతలు పేర్కొన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇండియా కూటమి భాగస్వాములుగా ఉన్న కాంగ్రెస్, సీపీఐలు తెలంగాణలో అవగాహనతో పోటీ చేసేందుకు పరస్పరం సహకరించుకోవాలన్నారు. కాగా, ఖమ్మం లేదా నల్లగొండ స్థానాల్లో ఏదో ఒకటి ఇవ్వాలని రేవంత్‌ను కోరినట్లు సమాచారం. అయితే అధిష్టానం నిర్ణయం మేరకు తమ నిర్ణయం ఉంటుందని సీఎం అన్నట్లు తెలిసింది. కాగా, గత ఎన్నికల సందర్భంగా చేసుకున్న ఒప్పందం ప్రకారం రెండు ఎమ్మెల్సీ స్థానాలు తమకు కేటాయించాలని కూడా సీపీఐ నేతలు సీఎంకు గుర్తుచేశారని సమాచారం. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని సీఎం అన్నట్లు తెలిసింది.



సీఎం రేవంత్‌రెడ్డితో కూనంనేని, చాడ వెంకటరెడ్డి, నారాయణ, అజీజ్‌పాషా

న్యాయవిచారణ పరిధిలో సింగరేణిని చేర్చాలి

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడడంతో పాటు, పటిష్టపరచాలని సీఎంకు సీపీఐ ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. సింగరేణి కాలరీస్‌లో జరిగిన అవినీతి, అక్రమాలను న్యాయవిచారణ పరిధిలోకి తీసుకురావాలని కూనంనేని సాంబశివరావు కోరారు. అలాగే సమ్మె నోటీసు ఇచ్చిన జెన్ కో కార్మికులు, ఇతర ఉద్యోగులపై గత ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని, సుమారు 400 మంది ఫోర్ మెన్ ఆర్టిజన్లను వివిధ కారణాలతో పనిచేసిన చోటు నుంచి బైటకు పంపడమో, తొలగించడమో జరిగిందని, ఎస్ఈలను డీఈలు, డీఈ, ఏడీఈలుగా డిమోట్ చేయడం వంటి చర్యలకు పాల్పడిందని, వీటిని సరిచేయాలని సీఎంను కోరారు.

సాయంత్రం 4 నుంచి 5 వరకు అందుబాటులో ఉంటా: సీఎం

కొత్తగా వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉన్నట్లుగా ప్రజలలో భావన నెలకొందని, సీఎం, మంత్రులు కూడా అందుబా టులో ఉంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతున్న దని సీపీఐ నేతలు తెలిపారు. వివిధ ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేలు, ప్రజా సంఘాలు, పార్టీల నేతల ను కలిసేందుకు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు తాను అందుబాటులో ఉంటానని సీఎం చెప్పినట్లు సీపీఐ నేతలు వెల్లడించారు.

ఈ సచివాలయం మీ కోసమే కేసీఆర్ కట్టించారు: నారాయణ

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త సచివాలయాన్ని రేవంత్‌రెడ్డి కోసమే కట్టించారని నారాయణ సరదాగా వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం వివిధ సంస్థలు, శాఖల్లో రిటైర్డ్ అధికారులను నియమించి ఏళ్ళ తరబడి కొనసాగించిందని, కొత్త ప్రభుత్వంలో ఆ సంప్రదాయానికి స్వస్తి పలకాలని నారాయ ణ సూచించారు. రిటైర్డ్ ఐఏఎస్‌లను ప్రభుత్వంలోకి తీసుకోవద్దని కోరారు.

విద్యుత్ షట్‌డౌన్ అయ్యేలా కుట్ర

- బీఆర్ఎస్ కుట్రను గుర్తించి అంతరాయం లేకుండా చేశాం
- మేడిగడ్డ నిర్మాణమంతా లోపభూయిష్టమే
- జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తాం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మంగళగూడెం ప్రజాపాలన సభలో దరఖాస్తులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిసి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ షట్‌డౌన్ అయ్యేలా కుట్ర పన్నిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. అధికారంలోకి రాగానే దీన్ని గమనించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు వెంటనే సమీక్షించి ఎట్టి పరిస్థితుల్లోనూ సరఫరాలో అంతరాయం కలగకూడదని విద్యుత్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంగళవారం జరిగిన ప్రజాపాలన సభల్లో పాల్గొన్న మంత్రి ఆ తర్వాత ఖమ్మంలో మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలన మొత్తం అస్తవ్యస్తమని ధ్వజమెత్తిన పొంగులేటి ఇటీవల మేడిగడ్డను మంత్రుల బృందం పరిశీలించి ప్రాజెక్టు డొల్లతనాన్ని బయటపెట్టిందని గుర్తు చేశారు.

అప్పులు చేసి ప్రగతి భవన్ కట్టారు..

నాటి ముఖ్యమంత్రులు వైఎస్.రాజశేఖరరెడ్డి, రోశయ్య నివసించిన, పాలన చేసిన ఇళ్లు, సచివాలయాలను కాదని.. అప్పులు చేసి మరీ కేసీఆర్ ప్యాలెస్ లాంటి ప్రగతిభవనం కట్టించుకున్నారని మంత్రి పొంగులేటి విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సంక్షేమ పథకాలు అందించకుండా రూ.6.71 లక్షల కోట్ల అప్పు చేసి సంపదను సృష్టించామని అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులు అహంకారపూరితంగా మాట్లాడడాన్ని ప్రజలంతా గమనించారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని పొంగులేటి ఈ సందర్భంగా వెల్లడించారు.

కాళేశ్వరంలో కేంద్రానికి వాటాలు!

ప్రాజెక్టులో అవినీతికి కేంద్రం మద్దతిచ్చింది

- వారంలోగా న్యాయవిచారణకు ఆదేశిస్తాం
- పదేళ్లలో సీబీఐ, ఈడీ విచారణ ఎందుకు వేయలేదు?
- ఇప్పుడు ఎందుకు సీబీఐ, ఈడీ విచారణ అడుగుతున్నారు?
- మేడిగడ్డపై కేసీఆర్ మౌనాన్ని ఎందుకు ప్రశ్నించరు
- కిషన్ రెడ్డి ఆరోపణలపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఫైర్



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కాళేశ్వరం ప్రాజెక్టుకు, ప్రాజెక్టులో జరిగిన అవినీతికి మద్దతిచ్చిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. 'మీరు దోచుకోండి.. మా వాటా మాకు ఇవ్వండి' అనే ధోరణిలో గత పదేళ్లుగా కేంద్రం వ్యవహరించిందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర శాసనసభలో ప్రకటించినట్లుగా వారంలోగా కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణకు ఆదేశిస్తామని వెల్లడించారు. మంగళవారం ఆయన రాష్ట్ర సచివాలయం మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి చేసిన ఆరోపణలను ఖండించారు. 'రూ.లక్ష కోట్లు మింగారని మీరే అంటున్నారు. మనీ ల్యాండరింగ్ తప్పకుండా జరిగి ఉంటుంది. అలాంటప్పుడు గత 10 ఏళ్లలో సీబీఐ, ఈడీ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలతో విచారణ ఎందుకు జరిపించలేదు' అని ప్రశ్నించారు.

నిబంధనలను మార్చి కాళేశ్వరానికి రుణాలు..

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన పీఎఫ్‌సీ, ఆర్ఈసీలు గతంలో కేవలం విద్యుత్ రంగ ప్రాజెక్టులకే రుణాలు ఇచ్చేవని, కానీ ఈ సంస్థలు మెమోరాండం ఆఫ్ ఆర్టికల్స్(రాజ్యాంగాల)ను సవరించి కాళేశ్వరం ప్రాజెక్టుకు రుణాలు ఇచ్చాయని ఉత్తమ్‌కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు పీఎఫ్‌సీ రూ.1.27లక్షల కోట్ల రుణాలను మంజూరు చేసి సింహభాగం విడుదల చేసిందన్నారు. ఆర్ఈసీ సైతం మరో రూ.60వేల కోట్ల రుణాలను నీటిపారుదల ప్రాజెక్టులకు ఇచ్చిందన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఆర్ఈసీ, పీఎఫ్‌సీలు అంతకు ముందు నీటిపారుదల ప్రాజెక్టులకు రుణాలు ఇవ్వలేదన్నారు. ఇంత అవినీతి జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం రుణాలకు ఎలా అనుమతిచ్చిందని ప్రశ్నించారు. రూ.80వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతిచ్చిందని, ఆ తర్వాత ప్రాజెక్టు వ్యయాన్ని రూ.1.27లక్షల కోట్లకు పెంచేందుకు ఎలా అనుమతి ఇచ్చారని నిలదీశారు.

కేసీఆర్‌పై ఎందుకు కేసులు పెట్టలేదు

కేసీఆర్, నీటిపారుదల శాఖపై ఎందుకు కేసులు పెట్టలేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్‌కు ఏటీఎం వంటిదని..రాష్ట్రానికి వచ్చిన ప్రతిసారీ ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోపిస్తున్నారని, కానీ విచారణ ఎందుకు జరిపించలేదని నిలదీశారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కల్వకుంట్ల కవిత పాత్రపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీబీఐకి అనుమతి నిరాకరిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై తన వద్ద సమాచారం లేదన్నారు.

కేసీఆర్ మౌనాన్ని ఎందుకు ప్రశ్నించరు?

కేంద్ర సంస్థలు రుణ సహాయం చేసిన మేడిగడ్డ బ్యారేజీ గత అక్టోబర్ 21న కుంగిపోగా, ఇప్పటి వరకు కిషన్ రెడ్డి ఎందుకు సందర్శించలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఈ ఘటనపై గత సీఎం కేసీఆర్ మౌనాన్ని బీజేపీ ఎందుకు ప్రశ్నించడం లేదని అడిగారు. గత ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీకి విలేకరులను అనుమతించకపోతే ఎందుకు మాట్లాడలేదు అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం గత ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించలేదన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోని సమస్యలు పరిష్కారమయ్యే వరకు బిల్లుల చెల్లింపులు ఉండవని మంత్రి ఉత్తమ్ తేల్చి చెప్పారు.

ప్రభుత్వ సలహా మండలిలో లేను

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



కాగజ్‌నగర్ టౌన్: ప్రొఫెసర్ నాగేశ్వర్, ప్రొఫెసర్ హరగోపాల్‌తో కూడిన ఒక సలహా మండలిలో తన పేరు కూడా ఉన్నట్లుగా కొన్ని చానళ్లలో వార్తలు వస్తున్నట్లుగా తనకు తెలిసిందని, అవి అవాస్తవమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. సాధారణంగా ఇలాంటి కమిటీల్లోకి ఎవరిని ఎంపిక చేయాలన్నది ఆయా వ్యక్తులను సంప్రదించిన తర్వాతే నిర్ణయిస్తారని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో తనను ఎవరూ సంప్రదించలేదని ప్రవీణ్ అన్నారు. ఒకవేళ సంప్రదించినా తాను ప్రతిపక్షంలో ఉన్న జాతీయ పార్టీ (బీఎస్పీ)కి రాష్ట్రంలో నేతృత్వం వహిస్తూ, బహుజన ఉద్యమ, సామాజిక న్యాయ పితామహులైన పూలే, అంబేద్కర్, కాన్షీరాం ఆలోచనలను జనంలోకి తీసుకెళ్లే ఉద్యమంలో తలమునకలై ఉండటంతో ఎలాంటి ప్రభుత్వ సలహా కమిటీల్లో ఉండే పరిస్థితి లేదని వివరించారు. అధికారంలో లేని రాజకీయ పార్టీలు ఎప్పుడూ ప్రజల గొంతుకలా ఉండాలే తప్ప.. ప్రభుత్వ కమిటీల్లో ఉండకూడదని ప్రవీణ్ తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీ తోడుదొంగలు

అసెంబ్లీ ఎన్నికలు స్పీడ్ బ్రేకర్‌లాంటివి పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతాం: హరీశ్‌రావు



దుబ్బాక టౌన్: కాంగ్రెస్, బీజేపీ తోడు దొంగలు.. ఆ పార్టీలు కేంద్రంలో అధికారంలోకి వచ్చేందుకు దొంగనాటకాలు ఆడుతున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు బీఆర్ఎస్‌కు స్పీడ్ బ్రేకర్ లాంటివని, మళ్లీ కారు వేగం అందుకొని అధికారంలోకి వస్తుందన్నారు. తాము ముళ్లబాటలు.. పూల బాటలు చూశామని, అధికారంలోకి రాకున్నా ప్రజల తరఫున ఉండి కొట్లాడతామని తెలిపారు. ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ పాలన తేడాను గుర్తిస్తున్నారని చెప్పారు. కేవలం 2శాతంలోపు ఓట్ల తేడాతోనే అధికారం కోల్పోయామని దీనిపై లోతుగా సమీక్షించుకొని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ సత్తా చాటుతామని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామరక్ష అని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. అధికారంలోకి వస్తే డిసెంబర్ 9వ తేదీనే 2 లక్షల రుణమాఫీ చేస్తామని మాట తప్పిందని కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలన్నీ అమలు చేయకుంటే నిలదీస్తామని హెచ్చరించారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణ కోరండి

48 గంటల్లో కేంద్రం నుంచి అనుమతి తీసుకొస్తా

- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్
- ఎంఐఎం మధ్యవర్తిత్వంతో సీఎం, మాజీ సీఎంల మధ్య అవగాహన
- మార్చి తొలి వారంలోగా లోక్‌సభ షెడ్యూల్ వెలువడే అవకాశాలు
- జనసేనతో పొత్తు ఉండదని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై సీబీఐ విచారణ కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాయాలని, 48 గంటల్లో తాను కేంద్రం నుంచి అనుమతి తెస్తానని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సవాల్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి తన చిత్తశుద్ధి చాటుకోవాలని, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య దోస్తీ లేదని నిరూపించుకోవాలని అన్నారు. న్యాయ విచారణతో పాటు సీబీఐ దర్యాప్తుతో ఫలితాలు వేగంగా వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. విపక్షంలో ఉన్నపుడు సీబీఐ విచారణకు డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు కేవలం న్యాయవిచారణ జరిపిస్తామనడం అనేక అనుమానాలకు తావిస్తోందని మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన వ్యాఖ్యానించారు.

ఎందుకు తాత్సారం?

బీఆర్ఎస్ సర్కార్ అతిపెద్ద అవినీతి స్కాం కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తునకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అంగీకరించడం లేదని, ఎందుకు తాత్సారం చేస్తున్నారని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉండగా కాళేశ్వరం విషయంలో కేంద్రంతో పాటు ప్రధాని మోదీపై, తనపై కాంగ్రెస్ నేతలు ఇష్టం వచ్చినట్టుగా విమర్శలు గుప్పించారని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టులో అవినీతిపై దర్యాప్తు జరిపి దోషులను శిక్షించే ఉద్దేశం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా? లేదా? స్పష్టం చేయాలన్నారు.

అవగాహన నేపథ్యంలో సానుభూతి

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ పరిస్థితి బొటాబొటీ మెజారిటీతో తుమ్మితే ఊడిపోయే ముక్కు మాదిరిగా ఉండడంతో ప్రస్తుత సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్‌ల మధ్య ఎంఐఎం మధ్యవర్తిత్వంతో అవగాహన ఏర్పడిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్‌కు సానుభూతి ఉన్నట్టు కనిపిస్తోందన్నారు. తామిద్దరం చేసేది దోపిడీయేనని, తమ డీఎన్ఏ ఒకటేననే అభిప్రాయంతో కాంగ్రెస్ ఉందని వ్యాఖ్యానించారు. మేడిగడ్డ సందర్శన సందర్భంగా రాష్ట్ర మంత్రులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లకే పరిమితమయ్యారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రజాధనాన్ని గోదాట్లో కలిపారని, దీని కోసం ఖర్చు చేసిన రూ.లక్ష కోట్ల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

17 ఎంపీ స్థానాలకు పోటీ

ఫిబ్రవరి 28న లేదా మార్చి మొదటి వారంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశాలున్నాయని కిషన్‌రెడ్డి చెప్పారు. తెలంగాణలోని 17 స్థానాలకు బీజేపీ పోటీ చేస్తుందని, జనసేనతో పొత్తు ఉండకపోవచ్చునని అన్నారు. జనసేన ప్రస్తుతం ఎన్డీఏ భాగస్వామిగా ఉందని, ఏపీలో జనసేనతో బీజేపీ పొత్తు విషయమై చర్చ జరగలేదని తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి కేంద్రం త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఈ నెల 17న సుప్రీంకోర్టులో కేసు విచారణకు రానుందని, ఆ లోగానే కేంద్రం అఫిడవిట్‌ను సమర్పిస్తుందని చెప్పారు.

కేసీఆర్‌ను రక్షించేందుకే సీబీఐ విచారణా?

కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై మంత్రి పొన్నం ఫైర్

- ప్రజాపాలన దరఖాస్తులకు ఈనెల 6 వరకే గడువని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావును రక్షించడానికే మీరెప్పుడూ సీబీఐ విచారణ కోరుతుంటారని, సీబీఐ మీ పెంపుడు సంస్థ అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డినుద్దేశించి వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌పై జ్యుడీషియల్ విచారణ చేయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే ఇందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకరించాలని వ్యాఖ్యానించారు. మంగళవారం సచివాలయ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్‌ను రక్షించడానికే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చిలుక పలుకులు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్రంలో మీ ప్రభుత్వమే ఉన్నా ఇప్పటివరకు కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నెల రోజులు కూడా కాలేదని, అప్పుడే ప్రభుత్వంపై ప్రతిపక్ష నేతలు ఏదేదో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్య క్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒక్కటేనని, గోషామహ ల్‌లో బీఆర్ఎస్ పోటీ చేయలేదని, జూబ్లీహిల్స్‌లో మాత్రం బీఆర్ఎస్ పోటీ చేసిన తీరు తీస్తుంటే వీళ్ల స్నేహం అర్థం అవుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై బీఆర్ఎస్ నేతలు లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని, ఆటో డ్రైవర్లతో ధర్నాలు చేయిస్తున్నారని ఆరోపించారు. దీనిపై మాట్లాడేందుకు ఎవరు వచ్చినా తాను రెడీగా ఉంటానని, సచివాలయంలోనైనా మాట్లాడేందుకు సిద్ధమన్నారు. ప్రజాపాలన దరఖాస్తులకు ఈనెల 6 వరకే గడువు అని, పొడిగింపు ఉండదని మంత్రి పొన్నం స్పష్టం చేశారు.

కేంద్రం స్పందించాలి

లారీ డ్రైవర్ల ఆందోళనపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. లేకపోతే నిత్యవసరాల ధరలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులను పిలిచి తెలంగాణ భవన్‌లో కేటీఆర్ భోజనాలు పెట్టడం విడ్డూరంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. కేటీఆర్ ఇంకా మంత్రి అనుకుంటున్నారేమోనని ఎద్దేవా చేశారు. కార్మికులకు భోజనాలు కాదు... వాళ్లకు బట్టలు కుట్టించాలని హితవు పలికారు.

క్లుప్తంగా...

గృహలక్ష్మి పథకం రద్దు

ఉత్తర్వు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. సొంత జాగా ఉన్న పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందించే పథకమే గృహలక్ష్మి. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు దాదాపు రూ.15 లక్షల దరఖాస్తులు స్వీకరించగా, ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే రోజు నాటికి రూ.2 లక్షల దరఖాస్తులకు సంబంధించి మంజూరు పత్రాలు కూడా జారీ చేశారు. ఇప్పుడు ఆ పథకాన్ని, మంజూరు పత్రాలను రద్దు చేస్తూ రవాణా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు గ్యారంటీలలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన నేపథ్యంలో గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. సొంత జాగా ఉన్న అర్హులైన పేదలకు, సొంత జాగా లేనప్పటికీ ప్రభుత్వం అందించే స్థలంలో ఇళ్లు నిర్మించుకునేవారికి ఇందిరమ్మ పథకం కింద రూ.5 లక్షలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తామని ఈ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

పీఆర్టీయూటీఎస్ కేలండర్ ఆవిష్కరించిన సీఎం



సాక్షి, హైదరాబాద్: విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు తెలిపారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి సహా సంఘం నేతలు మంగళవారం సీఎంను కలిశారు. ఈ సందర్భంగా సంఘం కేలండర్‌ను సీఎం ఆవిష్కరించారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని నేతలు సీఎంను కోరారు.

'విద్యుత్ ఇంజనీర్లు కష్టపడి పని చేయాలి'

లక్డీకాపూల్ (హైదరాబాద్): విద్యుత్ సంస్థల్లోని ఇంజనీర్ల పాత్ర చాలా ముఖ్యమైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంజనీర్లు కష్ట పడి పని చేసి వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించి, సంస్థ నష్టాలు తగ్గించాలని సూచించారు. మంగళవారం తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.రత్నాకర్‌రావు, పి.సదానందం సీఎంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ ఇంజనీర్లు స్పందిస్తూ.. రాష్ట్రంలో అన్ని రకాల వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించడంలో విద్యుత్ సంస్థలకు సంబంధించిన ఇంజనీర్లందరం నిరంతరం శ్రమిస్తామన్నారు. అలాగే ప్రభుత్వానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని స్పష్టంచేశారు. విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల నియామకం త్వరగా చేపట్టాలని కోరారు. విద్యుత్ సంస్థల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా.. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

రేపు గురుకుల ఎల్ఎల్‌బీ స్పాట్ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గిరిజన/సాంఘిక/ఎంజేపీ బీసీ సంక్షేమ గురుకుల న్యాయ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటిగ్రేటెడ్ (5 ఏళ్ల) ఎల్ఎల్‌బీ కోర్సులో స్పాట్ కౌన్సెలింగ్ గురువారం (4వ తేదీన) నిర్వహిస్తున్నామని ఎంజేపీ బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు తెలిపారు. కొత్తగా న్యాయ విద్య గురుకుల కాలేజీలను బాలికల కోసం హనుమకొండలో, బాలుర కోసం కందుకూరులో ఏర్పాటు చేశామన్నారు. ఈ కాలేజీలో చేరేందుకు లాసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు (ర్యాంక్ కార్డు, 10వ తరగతి మెమో, ఇంటర్మీడియట్ మెమో, టీసీ, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు) రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, మూడు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు తీసుకుని కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు.

కౌన్సెలింగ్ జరిగే ప్రదేశాలు...

1. టీఎస్‌డబ్ల్యూఆర్ న్యాయ కళాశాల (స్త్రీలు), ఎల్‌బీ నగర్, చైతన్యపురి, హైదరాబాద్
2. టీటీడబ్ల్యూఆర్ న్యాయ కళాశాల (పురుషులు), సంగారెడ్డి
3. ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ న్యాయ కళాశాల (పురుషులు) కందుకూరు : మహేశ్వరం
4. ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ న్యాయ కళాశాల (స్త్రీలు) హనుమకొండ : కాజీపేట (సోమిడి)

గెజిటెడ్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడిగా కనకచంద్రం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం హైదరాబాద్ పీఆర్‌టీయూ భవన్‌లో జరిగింది. అసోసియేషన్ భవిష్యత్ కార్యాచరణపై సభ్యులు చర్చించారు. అనంతరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ కనకచంద్రం, ప్రధానకార్యదర్శిగా శేఖర్, అసోసియేట్ అధ్యక్షుడిగా కొండల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరసింహ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సిద్ధారెడ్డి, ప్రచారకార్యదర్శిగా నాగేందర్, అధికార ప్రతినిధిగా నంట శ్రీనివాస్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా పవన్ ఎన్నికయ్యారు.

ఏప్రిల్‌లో టెట్!

60 వేల మంది టీచర్లు రాసే అవకాశం

- పదోన్నతులకు అనివార్యంగా మారిన అర్హత పరీక్ష
- ఉపాధ్యాయ ఖాళీలపై స్పష్టత వస్తేనే మెగా డీఎస్సీ



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. విద్యాశాఖపై సీఎం సమీక్షలో ఈ అంశం చర్చకు వచ్చింది. ప్రభుత్వ టీచర్లకు పదోన్నతి కల్పించడానికి టెట్ అనివార్యమని అధికారులు సీఎంకు తెలిపారు. దీంతో వీలైనంత త్వరగా టెట్ నిర్వహించాలని సీఎం ఆదేశించినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్‌లో ఈ పరీక్ష నిర్వహించే అవకాశాలు కన్పిస్తున్నాయి. రాష్ట్రంలో 1.03 లక్షల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులున్నారు. 2012కు ముందు టెట్ లేకపోవడంతో అంతకుముందే ఉన్న దాదాపు 60 వేల మంది టీచర్లకు ఈ అర్హత లేదు. మరోవైపు టెట్ ఉంటే తప్ప పదోన్నతులు కల్పించడానికి వీల్లేదని 2012లోనే కేంద్రం తెలిపింది. అయితే టెట్ పరీక్ష నిర్వహించే వరకూ ఈ నిబంధనను అమలు చేయలేమని పేర్కొంటూ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో మినహాయింపు ఇచ్చింది. కేంద్రం తాజాగా మరోసారి ఈ నిబంధనను తెరపైకి తేవడం, సుప్రీంకోర్టు కూడా టెట్ తప్పనిసరి అని తీర్పు ఇవ్వడంతో గత ఏడాది నుంచి పదోన్నతులు నిలిచిపోయాయి.

మెగా డీఎస్సీకి టెట్ ఆటంకం

రాష్ట్రంలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో దీని అమలుపై అధికారులతో సీఎం చర్చించారు. మెగా డీఎస్సీ చేపట్టాలంటే, ఉపాధ్యాయ ఖాళీలపై స్పష్టత రావాలి. రాష్ట్రంలోని దాదాపు 10 వేల స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేస్తారు. ఇవి కాకుండా ఇప్పటికే 12 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు ఎస్జీటీలు మొత్తం కలిపి 22 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. టెట్ లేని కారణంగా పదోన్నతులు ఇవ్వడం సాధ్యం కావడం లేదు. ఈ కారణంగానే టెట్ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.

టెట్ ఎవరికి?

రాష్ట్రంలో సర్వీస్‌లో ఉన్న వారికి డిపార్ట్‌మెంట్ టెస్ట్ మాదిరి ప్రత్యేకంగా టెట్ పరీక్ష నిర్వహించాలని టీచర్లు కోరుతున్నారు. వీరితో పాటు బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన వాళ్ళు కూడా ఈ పరీక్ష రాస్తారు. ప్రైవేటు స్కూళ్ళల్లో పనిచేయాలన్నా టెట్ తప్పనిసరి. కాగా ఏడాదికి రెండు సార్లు టెట్ చేపట్టాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నా, ఇది అమలుకు నోచుకోవడం లేదు. ఇప్పుడు సర్వీస్‌లో ఉన్నవారికి విధిగా టెట్ నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొనడంతో, అందరికీ కలిపి సాధారణ టెట్ నిర్వహించాలని విద్యాశాఖ ప్రభుత్వానికి నివేదించింది. టెన్త్ పరీక్షలు ముగిసిన వెంటనే ఏప్రిల్ మొదటి వారంలో టెట్ చేపట్టాలనే ఆలోచనలో ఉన్నారు. అయితే 45 ఏళ్ళు దాటిన ఉపాధ్యాయులు టెట్‌కు సన్నద్ధమవ్వాల్సిన అవసరం ఉందని, పరీక్షల్లో ఇచ్చే సిలబస్‌పై కొంత కసరత్తు చేయాల్సి ఉంటుందని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొంత వ్యవధి ఇవ్వాలనే డిమాండ్ పెరుగుతోంది.

ప్రత్యేకంగా ఉంటేనే బాగుంటుంది

టెట్ వీలైనంత త్వరగా చేపట్టడం మంచిది. ఇది పాసయితేనే ప్రమోషన్లు పొందే వీలుంది. అయితే బోధన అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు అంతర్గత పరీక్ష మాదిరి పరీక్ష నిర్వహిస్తే బాగుంటుంది. వారికి ప్రత్యేక సిలబస్‌తో పరీక్ష పెట్టాలి.

– చావా రవి (టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

సమాఖ్య స్ఫూర్తితో ముందుకు

▶ మొదటి పేజీ తరువాయి

డైరెక్టర్ అభినాశ్‌దాస్, ఐఏఎస్ అధికారి ముత్తుకుమార్, తెలంగాణ ప్రభుత్వం పక్షాన సీఎస్ శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావులు పాల్గొన్నారు. రాష్ట్ర సమగ్ర ప్రగతి దృష్ట్యా అవలంబించాల్సిన సంయుక్త వ్యూహాలు, అభివృద్ధి ప్రాధాన్యతలు, వనరుల కేటాయింపు, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. నిధులు, నీతి ఆయోగ్ సహకారానికి సంబంధించి సీఎం రేవంత్ పలు విజ్ఞాపనలు చేయగా, సమాఖ్య వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన వైఖరి, అందించాల్సిన సహకారం గురించి నీతి ఆయోగ్ ప్రతినిధి బృందం వివరించింది.

మీ భాగస్వామ్యం అవసరం

రాష్ట్ర ప్రభుత్వంతో చర్చల సందర్భంగా నీతి ఆయోగ్ పలు సూచనలు, సిఫారసులు చేసింది. ముఖ్యంగా నీతి ఆయోగ్ పాలకమండలిలో తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యం అవసరమని పేర్కొంది. స్థానికంగా ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు గాను వివిధ రాష్ట్రాల్లో విజయవంతమైన పద్ధతులను అనుసరించాలని, వినూత్న పాలన పద్ధతులను ఆవిష్కరించాలని సూచించింది.



నీతి ఆయోగ్ బృందంతో సమావేశమైన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్సెస్ లాంటి గ్రాడ్యుయేట్ కోర్సులకు ఊతమివ్వాలని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ శక్తి, సామర్థ్యాలను మెరుగుపరుచుకునే దిశలో స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సిట్) ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. నీతి ఆయోగ్ చేపట్టే అన్ని కార్యక్రమాల్లో తమ వంతు నిర్మాణాత్మక మద్దతు, సహకారం ఉంటుందని సీఎం, డిప్యూటీ సీఎంలు హామీ ఇచ్చారు.

నిధుల కేటాయింపుపై దృష్టి సారించండి

పలు రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అవసరమైన నిధులు, వనరుల గురించి రేవంత్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా 16వ ఆర్థిక సంఘం ఏర్పాటు నేపథ్యంలో రాష్ట్రానికి పెరగాల్సిన కేటాయింపులపై నీతి ఆయోగ్ దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులు కేటాయించాలని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి గ్రాంటు కింద కేంద్రం నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.1,800 కోట్లు విడుదల చేయాలని కోరారు. సౌర విద్యుత్ వినియోగంలో కేంద్ర సహకారం కావాలని అడిగారు. సబర్మతి రివర్ ఫ్రంట్, నమో గంగే తరహాలో రాష్ట్రంలోని మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టే కార్యక్రమాలకు అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని, అంతర్జాతీయ స్థాయిలో చేపట్టబోయే ఈ ప్రక్షాళన కార్యక్రమానికి చేయూతనివ్వాలని కోరారు. కాలుష్య రహిత పట్టణాభివృద్ధి హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు సహకరించాలని, ఇందుకోసం రోడ్ మ్యాప్ తయారీలో నీతి ఆయోగ్ పాలుపంచుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

ఈ నెల 6,7,8 తేదీల్లో బీజేపీ భేటీ

- పార్లమెంట్ ఎన్నికలకు కమిటీల ఏర్పాటు
- 90 రోజుల కార్యాచరణ ప్రణాళికపై చర్చ
- బీజేఎల్పీనేత ఎన్నికపై కూడా...



సాక్షి, హైదరాబాద్ : పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కీలకభేటీకి బీజేపీ సిద్ధమైంది. ఈ నెల 6, 7, 8 తేదీల్లో జాతీయ నేతలు తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్‌లు రాష్ట్ర బీజేపీ నాయకులతో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా కొత్త ఎన్నికల కమిటీ నియామకంపై దృష్టి పెట్టనున్నారు.90 రోజుల ఎన్నికల కార్యాచరణ ప్రణాళికపై చర్చించి ఖరారు చేయనున్నట్టు రాష్ట్రపార్టీవర్గాల సమాచారం. లోక్‌సభ ఎన్నికల ముందు వరకు పార్టీపరంగా ఏయే కార్యక్రమాలు చేపట్టాలి ? ఏయే అంశాలపై దృష్టి పెట్టాలి ? అనే అంశంపై ఐదారు కమిటీలను నియమించనున్నట్టు తెలుస్తోంది. పనిలోపనిగా జాతీయ నేతలు అభిప్రాయసేకరణ జరిపాక బీజేఎల్పీనేతను ఎన్నుకోవాల్సి ఉన్నందున, ఈ భేటీల సందర్భంగా ఈ ఎన్నిక జరిగే అవకాశాలను కొట్టిపారేయలేమని పార్టీనేతలు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి మహిళలు, బీసీలకు ప్రాధాన్యం ఉంటుందంటున్నారు.

ముందుగానే లోక్‌సభ అభ్యర్థుల ప్రకటన : కిషన్‌రెడ్డి

ఎంపీ టికెట్లకు సంబంధించి దరఖాస్తులేవీ స్వీకరించడం లేదని మంగళవారం మీడియా చిట్‌చాట్‌లో కిషన్‌రెడ్డి తెలిపారు. అభ్యర్థుల ఖరారు అనేది జాతీయ నాయకత్వం పరిధిలోనే ఉంటుందన్నారు. గతంతో పోల్చితే ముందుగానే 17 ఎంపీ స్థానాలకు అభ్యర్థులను నాయకత్వం ప్రకటిస్తుందని చెప్పారు. ఇప్పటికైతే నాలుగు సిట్టింగ్ ఎంపీలకు టికెట్ గ్యారంటీపై చర్చ జరగలేదన్నారు. వరంగల్ నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ పోటీచేస్తారనే దానిపై ఎలాంటి చర్చ కానీ, నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరేందర్‌పై వేటు

ఫుడ్ కమిషన్ సభ్య కార్యదర్శిగా బదిలీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సచివాలయ ఉద్యో గుల సంఘం అధ్యక్షుడు ఎం.నరేందర్‌రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. సచివాలయంలోని రెవెన్యూశాఖలో అదనపు కార్యదర్శిగా వ్యవహరిస్తున్న నరేందర్‌రావును హాకా భవన్‌లోని ఫుడ్ కమిషన్ సభ్య కార్యదర్శిగా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఫుడ్ కమిషన్ సభ్య కార్యదర్శిగా ఉన్న జి.మనోహర్‌ను బదిలీ చేస్తూ తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన శాఖకు రిపోర్టు చేయాలని ఆదేశించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నరేందర్‌రావు సచివాలయ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించారు. కొత్త ప్రభుత్వానికి సంబంధించిన పాలనా వ్యవహారాలు, నిర్ణయాలను లీకు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

బడ్జెట్‌లో భారీ అంచనాలొద్దు

ప్రభుత్వ శాఖలకు ఆర్థిక శాఖ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఈసారి బడ్జెట్ ప్రతిపాదనల తయారీలో ఆర్భాటాలకు పోవద్దని రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. మారిన ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకొని 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రతిపాదనలతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సర సవరించిన అంచనాలను పంపాలని సూచించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు 52 పేజీలతో కూడిన విధివిధానాలను అన్ని ప్రభుత్వ శాఖలకు పంపారు. ఈ నెల 9లోగా ఆన్‌లైన్‌లో ఈ ప్రతిపాదనలను పరిపాలన విభాగాల నుంచి సచివాలయానికి పంపాలని, ప్రతిపాదనలను పరిశీలించి అదే నెల 11లోగా సచివాలయ అధికారులు ఆర్థిక శాఖకు పంపించాలని ఆ విధివిధానాల్లో పేర్కొన్నారు.

అన్ని ప్రభుత్వ శాఖలకు ఆర్థిక శాఖ సూచనలివే:

- రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలు మారిన నేపథ్యంలో ప్రస్తుతం అమల్లో ఉన్న పథకాలను కొనసాగించాలో వద్దో నిశితంగా పరిశీలించాలి.
- కొత్త పథకాలను ప్రారంభించాల్సిన పరిస్థితుల్లో ఎప్పటి నుంచి అమలు కావాలి, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎంత ఖర్చవుతుందన్నది స్పష్టంగా పొందుపర్చాలి.
- ప్రభుత్వ శాఖల పరిధిలో పూర్తి కావాల్సిన పనుల వివరాలను పేర్కొనాలి. వాస్తవిక అవసరాల మేరకే వాటికి ప్రతిపాదనలివ్వాలి.



- అన్ని ఇంజనీరింగ్ పనులకు సంబంధించిన అగ్రిమెంట్లు, పనుల ప్రస్తుత పరిస్థితి వంటి అంశాలను వివరంగా తెలపాలి.
- రాష్ట్ర ఆవిర్భావం నుంచి అమలు చేసిన పథకాల వివరాలు, వాటి అమలు కోసం సంవత్సరాలవారీగా అయిన ఖర్చు, లబ్ధిదారుల సంఖ్యను తెలియపర్చాలి.
- 2014 జూన్ 2 నుంచి 2023 డిసెంబర్ 30 వరకు వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, స్పెషల్ పర్పస్ వెహికిల్స్ (ఎస్‌పీవీ) ద్వారా తీసుకున్న రుణాల వివరాలను ప్రత్యేక ఫార్మాట్‌లో పంపించాలి.
- కేంద్ర ప్రాయోజిత పథకాల (సీసీఎస్)ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటి అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమయ్యే ప్రతిపాదనలను పొందుపర్చాలి. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలతో కలిసి కేంద్ర పథకాలను వినియోగించుకునే క్రమంలో ఈ ప్రతిపాదనలుండాలి.
- ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు అనుగుణంగా అన్ని శాఖలు ఆస్తుల వివరాలు, పన్ను రాబడులు, రుణాల వివరాలను పొందుపర్చాలి.
- అన్ని శాఖలకు ఉన్న బ్యాంకు ఖాతాల వివరాలను కూడా పంపాలి.
- బడ్జెట్ ప్రతిపాదనలు పంపే క్రమంలో వాస్తవిక అంచనాలుండాలే తప్ప గొప్పలకు పోయి భారీ అంచనాలను పంపొద్దు. గ్రాంట్‌ఇన్ ఎయిడ్ ఖర్చును తగ్గించి పంపాలి. అన్ని విభాగాల ఖర్చులను ఒక్క శాఖ కిందనే పంపాలి.
- కార్యాలయ నిర్వహణ, వాహనాలు, అద్దెలు, నీరు, విద్యుత్ ఖర్చులు, స్టేషనరీ, అవుట్ సోర్సింగ్ సర్వీసులు, సంక్షేమ, సబ్సిడీ పథకాల ప్రతిపాదనలు వాస్తవ అవసరాలకే పరిమితం కావాలి.
- ప్రభుత్వ రాబడులకు సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న పన్ను రేట్ల ప్రకారమే అంచనాలను పంపాలి.
- ప్రతి శాఖల్లోని ఉద్యోగుల వివరాలను వారు వేతనాలు తీసుకొనే పద్దులవారీగా విభజించి పంపాలి. హోంగార్డులు, అంగన్‌వాడీ వర్కర్లు, వీఆర్ఏలు, రోజువారీ వేతన ఉద్యోగులు, ఫుల్‌టైం, పార్ట్‌టైం కంటింజెంట్ ఉద్యోగులు, మినిమమ్ టైం స్కేల్ సిబ్బంది, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల వివరాలను ప్రత్యేక ఫార్మాట్‌లో పంపాలి.
- 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి ప్రభుత్వ శాఖలోకి వచ్చే అవకాశమున్న ఉద్యోగుల వివరాలను కేడర్‌వారీగా పంపాలి.

ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో అనాథలకు 2 % కోటా

అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో తల్లిదండ్రులు లేనివారికి (అనాథలు) రెండు శాతం కోటా కేటాయించేందుకు కసరత్తు చేయాలని అధికారులను రాష్ట్ర పీఆర్, మహిళ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. పిల్లలను దత్తత తీసుకునేందుకు అనేకమంది ఆసక్తి కనబరుస్తున్నా, నిబంధనలు కఠినంగా ఉండడంతో ఎక్కువమంది ముందుకు రావడం లేదన్నారు. దీనికి సంబంధించిన నిబంధనలను కూడా సులభతరం చేయాలని సూచించారు. అంగన్‌వాడీలకు వచ్చే పాలను సాధ్యమైనంత వరకు మండల కేంద్రాల్లో ఉన్న డెయిరీల ద్వారా సేకరించాలని, ఇందుకు ఒక పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మహిళ, శిశు సంక్షేమశాఖపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పిల్లల రక్షణ యూనిట్స్‌కు ట్రైనింగ్ ఇవ్వాలని, ఎన్జీవోల ఆధ్వర్యంలో నడిచినా డిపార్ట్‌మెంట్ నియంత్రణ ఉండాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఒకటి, రెండు రోజుల పనికోసం వచ్చే వర్కింగ్ ఉమెన్‌కు ముఖ్యమైన పెద్ద నగరాల్లో శాఖాపరంగా హాస్టళ్లు ఏర్పాటు చేసే ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి జిల్లాలో వృద్ధాశ్రమాలు కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల దగ్గరే అంగన్‌వాడీ కేంద్రాలు ఉండేవిధంగా అధికారులు చొరవ చూపాలనన్నారు. ఈ సందర్భంగా శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో మహిళ, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'స్త్రీ నిధి' దుర్వినియోగంపై విచారణ కమిటీ

అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

సాక్షి, హైదరాబాద్: స్త్రీ నిధి పథకంలో నిధుల దుర్వినియోగం ఫిర్యాదులపై శాఖాపరమైన విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని అధికా రులను పంచాయతీరాజ్, మహిళా శిశుసంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశించారు. ఈ నిధులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవా లని సూచించారు. ఈ నిధుల దుర్వినియోగంపై ఉమ్మడి వరంగల్ జిల్లాలో వస్తున్న ఆరోపణలు, జరిగిన ప్రచారం వల్ల దీనిపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం సచివా లయంలో స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్‌పై సమీక్ష సందర్భంగా సీతక్క మాట్లాడుతూ, స్త్రీనిధిలో పెండింగ్‌లో ఉన్న అన్ని లోన్లను వెంటనే క్లియర్ చేయాలని, మారుమూల ప్రాంతాల్లో ఉండే ప్రజలకు రుణాలు ఎక్కువ ఇచ్చేలా చొరవ చూపాలని సూచించారు. హైవేలతో పాటు ఇతర ప్రధానమైన రోడ్లకు ఇరుపక్కల వివిధ రకాల పండ్లు, కూరగా యలు, ఇతర వస్తువులు అమ్ముకునే వారికి షెడ్స్ ఏర్పాటు ద్వారా మరింత ఉపాధి పొందటానికి అవ కాశం ఉంటుందని చెప్పారు. ఈ తరహా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబల్ ఏరియాలో ఎలాంటి అవసరాలు ఉన్నాయో గుర్తించేందుకు అవసరమైన అధ్యయనం చేయాలని సూచించారు. మహిళలు వంద శాతం స్వయం సహాయక సంఘాలలో జాయిన్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రతినెలా ఒకసారి సమీక్షా సమావేశం ఉంటుందని, మహిళల ఆర్థిక సాధికారికత పెంచేందుకు తీసుకోవాల్సిన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో పీఆర్, ఆర్‌డీ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మహిళ, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, స్త్రీనిధి డైరెక్టర్ విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలు కల్పించాలి

పర్యాటక శాఖ సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు



సాక్షి, హైదరాబాద్ : 'రాష్ట్రంలో పర్యాటకుల సంఖ్య పెరగాలంటే అందుకు తగ్గ వసతులు ఉండాలి. అంతర్జాతీయ పర్యాటకులను రప్పించాలంటే ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించినపుడే అది సాధ్యపడుతుందని' రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేలా రాష్ట్ర పర్యాటకరంగ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం బేగంపేటలోని హరిత ప్లాజాలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టులు, హరిత హోటళ్ల నిర్వహణ, ఇతర అంశాలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రైవేట్‌కు దీటుగా హరిత హోటళ్లను తీర్చిదిద్దాలని, ఆక్యుపెన్సీరేషియో పెంచుకోవాలన్నారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వయంసమృద్ధి సాధించి, ఇతరశాఖలకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. పర్యాటకశాఖను మరింత లాభాలబాట పట్టించేందుకు నిబద్ధతతో పనిచేయాలన్నారు. మంత్రి కేక్ కట్ చేసి పర్యాటక అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) శాంతి, జనరల్‌మేనేజర్ (అడ్మిన్) రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

కాళేశ్వరంపై ఇంకా తాత్సారం తగదు

- అవినీతిపరులను జైల్లో పెట్టాల్సిందే
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్
- కేంద్రం, సీబీఐ, ఈడీపై నమ్మకం లేదన్న వక్తలు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులను జైల్లో పెట్టాలని నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఇంజనీర్లు, ఇతర వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ జల సాధన సమితి, జాగో తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టుపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన వారి జాబితాలను సిద్ధం చేసి జైలుకు పంపించాల్సిన అవసరముందని జాగో తెలంగాణ కన్వీనర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. ఈ ప్రాజెక్టుకు అనుమతిచ్చిన అధికారులందరినీ జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. రూ.4500 కోట్ల పనులను నామినేషన్ల మీద ఇచ్చిన ఘనత దేశంలో కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాళేశ్వరం అవినీతిపై విచారణకు ఒకే వ్యక్తికి బాధ్యతలు అప్పగిస్తే ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉంటుందనీ 7 లేదా 9 మంది అంతర్జాతీయ నిపుణులతో కూడిన కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అనుబంధ సంస్థలైన సీబీఐ, ఈడీతో విచారణ జరిపిస్తే ప్రయోజనం ఉండదని రైతుసంఘం నేత సారంపల్లి మల్లారెడ్డి అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం అవినీతి వెలుగులోకి రాకుండా కేసీఆర్ ఎన్ని ప్రయత్నాలు చేసినా, ప్రకృతి ఈ కుంభకోణాన్ని బయటకు తెచ్చిందని రిటైర్డు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ వ్యాఖ్యానించారు.

విచారణపై ఇంకా తాత్సారం వద్దు..

కాళేశ్వరం అవినీతిపై తాత్సారం చేయకుండా నెలరోజుల్లోగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఇంజనీర్, సీఎం మాజీ ఓఎస్డీ రంగారెడ్డి డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మేడిగడ్డ వద్ద నీటిపారుదల శాఖ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో అన్నీ అబద్ధాలున్నాయని తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్ ఆరోపించారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి తప్పుడు సమాచారంతో ఇంజనీర్లు ప్రజెంటేషన్ ఇచ్చారని విమర్శించారు. 9 టీఎంసీలతో అన్ని లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర నేత వేములపల్లి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో 'మోదీ వర్సెస్ రాహుల్'

- రాష్ట్రంలో 8 నుంచి 12 సీట్లు బీజేపీకి పక్కా
- జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్ వెల్లడి



కరీంనగర్‌టౌన్: ప్రధాని నరేంద్రమోదీ వర్సెస్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తరహాలోనే పార్లమెంట్ ఎన్నికలు జరగబోతున్నాయని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో బీజేపీ మండల అధ్యక్షులతోపాటు కొత్తగా ఎంపిక చేసిన మండల ఇన్‌చార్జీలతో ఆయన సమావేశమయ్యారు. సంజయ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఏ సంస్థ సర్వే చేసినా 80 శాతానికిపైగా ప్రజలు మోదీనే మళ్లీ ప్రధానమంత్రి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణలో బీజేపీ 8 నుంచి 12 ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటుందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగాలేవని, ఉద్యోగుల జీతాలకు కూడా పైసల్లేవని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలతోపాటు సీఎం, మంత్రులు కొత్తగా ఇస్తున్న హామీల అమలు దేవుడికే ఎరుక అని ఎద్దేవా చేశారు. ఈసారి బీజేపీకి సొంతంగా 350 స్థానాలు రాబోతున్నాయని, ఎన్డీఏ కూటమి 400కుపైగా సీట్లు సాధించబోతోందన్నారు. తెలంగాణలోనూ బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్నారు. బీఆర్ఎస్ 3వ స్థానానికి పడిపోవడం ఖాయమన్నారు. పొరపాటున ఎవరైన బీఆర్ఎస్‌కు ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్లేనన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మనోహర్ రెడ్డి, అధికార ప్రతినిధి సీహెచ్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అధికార భాషా సంఘం చైర్‌పర్సన్ శ్రీదేవి తొలగింపు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం చైర్‌పర్సన్ మంత్రి శ్రీదేవిని ఆ పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె పదవిలో ఉన్న సమయంలో ఎవరైనా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగులను తీసుకున్నా, వారిని ఆ పదవుల నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు.

అలాగే ఇతర విభాగాల నుంచి ఉద్యోగులు డిప్యుటేషన్ వెళ్లి వెంటే తక్షణమే వారు మాతృసంస్థలో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.



తమకు ఉన్నవాటిని ప్రశంసించడం
తెలియనివారికి సంతోషం అనేది ఎప్పటికీ రాదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 3 జనవరి 2024

గగనాంతర గవేషణ

కొత్త ఏడాది మొదలవుతూనే భారత్ మరో మైలురాయికి చేరుకుంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు చెందిన అంతరిక్ష ప్రయోగవాహక నౌక పీఎస్ఎల్వీ–సీ58 సోమవారం విజయవంతంగా నింగిలోకి దూసుకుపోవడంతో రోదసీ శోధనలో మన దేశం మరో ముందడుగు వేసింది. 'ఎక్స్‌–రే పోలారిమీటర్ శాటిలైట్' (ఎక్స్‌పో శాట్)నూ, మరో 10 ఇతర ఉపగ్రహాలనూ మోసుకుంటూ నింగిలోకి సాగిన ఈ ప్రయోగం అనేక విధాల ప్రత్యేకమైనది. ఖగోళంలోని కృష్ణబిలాలను (బ్లాక్ హోల్స్) అధ్యయనం చేసి, కొత్త అంశాల్ని వెలికితీసేందుకు 'ఎక్స్‌పోశాట్' ఉపకరిస్తుంది. ఈ తరహా శాస్త్రీయ శోధనకే పూర్తిగా అంకితమైన ఉపగ్రహాన్ని ఇస్రో పంపడం ఇదే తొలిసారి. దీంతో, అమెరికా తర్వాత రోదసిలోని ఇలాంటి దృగ్విషయాలపై ప్రయోగాలు జరుపుతున్న రెండో దేశమనే ఖ్యాతి భారత్‌కు దక్కింది. ఇక, వివిధ ప్రైవేట్ సంస్థల, విద్యార్థుల, ఇస్రో కేంద్రాలకు చెందిన మిగతా ఉపగ్రహాలు మన శాస్త్రవేత్తల, ప్రైవేట్ రంగ ఆలోచనలనూ, ఆకాంక్షలనూ ప్రతిబింబిస్తున్నాయి.

గత ఏడాది చరిత్రాత్మక చంద్రయాన్3 మిషన్‌తో మనం చంద్రునిపై జెండా పాతాం. చంద్రయాన్3 విజయం తర్వాత గత అయిదు నెలల్లో ఇస్రో విజయవంతం చేసిన రెండు మిషన్లూ శాస్త్రీయ స్వభావమున్నవే కావడం గమనార్హం. సూర్యుడి అధ్యయనానికి ముందుగా ఆదిత్య ఎల్1ను నింగిలోకి పంపింది. తాజాగా ఖగోళ–భౌతిక శాస్త్ర ఘటనలో భాగంగా వెలువడే ధ్రువీకృత ఎక్స్‌రేల అధ్యయనానికి ఈ 'ఎక్స్‌పో శాట్'ను తెచ్చింది. 'ఆదిత్య ఎల్1' లాగా 'ఎక్స్‌పో శాట్' సైతం పూర్తిగా అంతరిక్ష పరిశోధన–ప్రయోగశాలే. ఇది రెండు పేలోడ్‌లను నింగిలోకి మోసుకుపోయింది. రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రూపొందించిన 'పోలిక్స్' పేలోడ్ రాగల అయిదేళ్ళలో దాదాపు 50 మూలాల నుంచి వచ్చే ఉద్గారాలను పరిశీలిస్తుంది. 8 నుంచి 30 కిలో ఎలక్ట్రాన్ ఓల్ట్ (కేఈవీ) శక్తి పరిధిలోని ఎక్స్‌రేల గమనాన్ని గమనిస్తుంది. ఇక, ఇస్రోకు చెందిన యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ రూపొందించిన 'ఎక్స్‌పెక్ట్' అనే రెండో పేలోడ్ 0.8 నుంచి 15 కేఈవీల శక్తి గల ఎక్స్‌రేలను పరిశీలిస్తుంది. నిరంతర ఎక్స్‌రే ఉద్గారాల్లోని మార్పులను అధ్యయనం చేస్తుంది. వెరసి రెండు పేలోడ్లూ ప్రబలమైన ఎక్స్‌రేస్‌కు ఉత్పత్తిస్థానాలైన కృష్ణబిలాలు, పల్సార్ల విషయంలో కొత్త అంశాల్ని వెలికి తీస్తాయి.

గగనాంతర సీమలో మన తాజా గవేషణ... అమెరికా, చైనా, రష్యాలదే ఆధిపత్యమైన అంతరిక్ష యాన రంగంలో భారత్ స్థానాన్ని సుస్థిరం చేస్తుంది. 2021 డిసెంబర్‌లోనే అమెరికా 'నాసా' చేసిన ఈ తరహా ఐఎక్స్‌పీఈ మిషన్‌కు ఏకంగా 188 మిలియన్ డాలర్లయితే, మన తాజా ఎక్స్‌పో శాట్ కేవలం 30 మిలియన్ డాలర్ల (రూ. 250 కోట్ల)కే సిద్ధమవడం విశేషం. అమెరికా ఉపగ్రహ జీవితకాలం రెండేళ్ళే. మనది అయిదేళ్ళు. ఇలా అగ్రరాజ్యంతో పోలిస్తే అతి తక్కువ బడ్జెట్‌లో మరింత సమర్థమైన రాకెట్లు, ఉపగ్రహాలు రూపొందించి మన 'ఇస్రో' మరోసారి సత్తా చాటింది. మిగతా దేశాల్ని ఆశ్చర్యపరిచింది. నిజానికి ఎక్స్‌కిరణాల ధ్రువీభవనాన్ని కొలిచేందుకు సాగుతున్న ప్రయత్నాలు తక్కువ. 'నాసా' చేస్తున్నవీ బెలూన్ ఆధారిత, స్వల్పకాలిక ప్రయోగాలే. 2015 సెప్టెంబర్‌లో మనం ప్రయోగించిన ఆస్ట్రోశాట్ ద్వారానే భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞులు గతంలో ఎక్స్‌రే ఉత్పత్తి స్థానాల బ్రాడ్‌బ్యాండ్ వర్ణపటమాపనం చేస్తూ వచ్చారు. అతి సున్నితమైన, కచ్చితమైన ఉపకరణాలు అవసరం గనక ఎక్స్‌రేల ధ్రువీభవనాన్ని కొలిచే ప్రయత్నాలెప్పుడూ పెను సవాలే. ఇస్రో చేసిన ఎక్స్‌పో శాట్ ప్రయోగం ఆ సవాలుకు సరైన జవాబవుతుందని ఆశంస.

ఇలాంటి అనేక సవాళ్ళను ఇస్రో భుజానికెత్తుకుంది. పలు అంతరిక్ష ప్రయోగాలు, మిషన్లతో ఈ ఏడాది పొడుగూతా ఇస్రో క్యాలెండర్ నిండిపోయి ఉంది. సగటున నెలకు కనీసం ఒక అంతరిక్ష ప్రయోగమో, ప్రయత్నమో చేయనుంది. ఈ జోరు ఇలాగే సాగితే, ఈ జోరులో ఇస్రో ఈ ఏడాది జరిపే ప్రయోగాల సంఖ్య డజను దాటేసినా ఆశ్చర్యం లేదు. వాణిజ్య విభాగమైన 'న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్' (ఎన్ఎస్ఐఎల్) కోసం రెండు పీఎస్ఎల్వీ వాణిజ్య మిషన్లను సైతం ఇదే ఏడాది ఇస్రో చేపడుతోంది. అలాగే, నిరుడు చేసిన పునర్వినియోగ ప్రయోగవాహక నౌక ప్రయోగాన్ని మరింత కఠోర పరిస్థితుల మధ్య విజయవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కొన్నేళ్ళ క్రితం హైడ్రోజన్‌ను ఇంధనంగా చేసుకొని స్క్రామ్‌జెట్ ప్రయోగాత్మక పరీక్ష చేసిన ఇస్రో ఈసారి కిరోసిన్ వాడి, పరీక్షించనుంది. అలాగే, నిరుడు సెప్టెంబర్ 2న ఆరంభమైన భారత తొలి సౌరయాత్ర 'ఆదిత్య ఎల్1' సైతం తుది విన్యాసం అనంతరం ఈ జనవరి 6 నాటికి లక్షిత ఎల్1 గమ్యానికి చేరుకోనుంది. మొత్తం మీద ఈ కొత్త ఏడాది అంతా ఇస్రో తీరిక లేకుండా ప్రయోగాలు చేయనుంది.

ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ మాటల్లో చెప్పాలంటే ఈ 2024 'గగన్‌యాన్' సన్నాహక సంవత్సరం. అంతేకాదు... తాజా రోదసీ ప్రయోగంలో భాగంగా నింగిలోకి పంపిన ఇతర ఉపగ్రహాలలో 'ఉయ్ శాట్' పూర్తిగా కేరళలోని మహిళలే తీర్చిదిద్దినది కావడం విశేషం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మహిళల ముందంజకు అది ఓ ప్రతీక. ఇతర ప్రైవేట్ ఉపగ్రహాల వ్యవహారం అంతరిక్ష రంగంలో వస్తున్న సంస్కరణల్ని ప్రతిఫలిస్తోంది. ఈ ఆవిష్కరణలు, అతి తక్కువ ఖర్చు ప్రయోగాలు ప్రైవేట్ రంగానికి రోదసి తలుపుల్ని బార్లా తీస్తున్న భారత్‌కు కలిసొచ్చే అంశం. ఇప్పటికే దేశంలోని అంకుర సంస్థలు విదేశీ సంస్థలతో జత కలిసి ఉపగ్రహ నిర్మాణ వ్యాపారంలో దూసుకొస్తున్నాయి. ఖగోళ శోధనలో పురోగతికీ, ఉపగ్రహ నిర్మాణ సాధనలో భారత్ కేంద్రంగా మారడానికీ ఇవన్నీ శుభ శకునాలే! నూతన సంవత్సరం తొలి రోజున సాగిన విజయవంతమైన ప్రయోగం అందులో ఒకటి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: బ.సప్తమి సా.4.36 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: ఉత్తర ప.12.29 వరకు, తదుపరి హస్త, వర్జ్యం: రా.9.43, నుండి 11.27 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.42 నుండి 12.30 వరకు, అమృత ఘడియలు: లేవు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

అక్రమ వలసల విపరిణామం

విశ్లేషణ



కేపీ నాయర్

సుమారు 300 మంది భారతీయులు ప్రయాణిస్తున్న ఒక విమానాన్ని ఫ్రాన్స్‌లోని వాట్రీ విమానాశ్రయంలో నిర్బంధించడం అంతర్జాతీయ వార్తగా మారింది. నికరాగ్వాకు వెళ్తున్న ఇలాంటి వాళ్లందరూ అక్కడి నుంచి తమ దేశంలోకి అక్రమంగా వస్తున్నారని అమెరికా ఆరోపణ. ఫ్రెంచ్ అధికారులతో ఈ సమాచారాన్ని పంచుకున్న అమెరికన్ నిఘా వర్గాలు న్యూఢిల్లీని మాత్రం చీకట్లో ఉంచాయి. ఈ వార్తను పతాక శీర్షికల్లో వచ్చేలా చేయడం ద్వారా అక్రమ వలస రాకెట్‌ను సమర్థంగా బహిర్గతం చేయాలని వారు కోరుకున్నారు. తమ అమెరికా కలల్ని నెరవేర్చే అక్రమ ముఠాలకు భారీగా డబ్బులు ముట్టచెబుతూ, జనాలు తమ జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారు. సమగ్ర వలస విధాన సంస్కరణల అవసరాన్ని ఈ ఉదంతం సూచిస్తుంది.

తమ వలస, జాతీయతా చట్టంలో అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ నవంబర్ 21న ఒక నిబంధనను పొందుపర్చింది. నికరాగ్వాకు ప్యాసింజర్ విమానాల్లో రివాజుగా విదేశీయులను తీసుకెళ్తున్న వారిని గుర్తించి, వారి ప్రయత్నాలను విఫలం చేయడానికీ, అలాంటి వారిని శిక్షించడానికీ సంబంధించిన నిబంధన అది. విదేశీయులను ప్రమాదకరమైన భూభాగం, జలమార్గాల ద్వారా అమెరికాలోకి నెట్టడమే మానవ రవాణా చేస్తున్న వారి ఉద్దేశం అని అమెరికా విదేశీ మంత్రిత్వ శాఖ ఆరోపించింది. ఆ సమయంలో భారతదేశంలో ఎవరికీ పెద్దగా తెలియని ఈ ప్రకటన, నాలుగు కీలక అంశాలను పేర్కొంది. ఒకటి, చట్టవిరుద్ధమైన మార్గాల ద్వారా అమెరికాకు రాబోయే వలసదారుల కోసం కొత్త అక్రమ రవాణా కేంద్రంగా నికరాగ్వా ఉద్భవించింది. రెండు, నేరస్థ ముఠాలు వలస వచ్చేవారి నుండి 'భారీ–స్థాయిలో డబ్బు'ను వసూలు చేస్తున్నాయి, వారిని తీవ్ర ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. మూడు, అటువంటి అక్రమ వలసదారులు దేశంలోకి ప్రవేశించినా, ఎలాగైనా వారిని తమ తమ దేశాలకు అమెరికా తిప్పి పంపుతుంది. నాలుగు, నికరాగ్వాలోకి చార్టర్ విమానాలను పంపించే కంపెనీల యజమానులు, అధికారులు, సీనియర్ అధికారులతో కఠినంగా వ్యవహరించడానికి అమెరికా పాలనాయంత్రాంగం సిద్ధమవుతోంది.

అమెరికా చట్టంలోని సెక్షన్ 212 (ఎ)(3)(సి) 'యునైటెడ్ స్టేట్స్‌లో ప్రవేశించడం లేదా తీవ్రమైన అమెరికన్ ప్రతికూల విదేశాంగ విధాన పరిణామాలను కలిగి ఉన్న ఏ దరఖాస్తుదారుని అయినా సరే మినహాయించడానికి విదేశాంగ శాఖ మంత్రిని అమెరికా అనుమతిస్తుంది'. నికరాగ్వా బడా ముఠాలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న వారి సహాయకులకు వ్యతిరేకంగా అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఈ నిబంధనను ఉపయోగించడానికి పథక రచన చేశారని నవంబర్ ప్రకటన పేర్కొంది. నికరాగ్వాకు అలాంటి విమానాలను నడుపుతున్న వారినీ, అమెరికా–మెక్సికో సరిహద్దులోని చివరి గమ్యస్థానానికి వలసదారులను తీసుకువెళ్లేవారినీ వదిలిపెట్టబోమని అమెరికా విదేశాంగ శాఖ పునరుద్ఘాటించింది. దురదృష్టవశాత్తు, వాషింగ్టన్ చేసిన ఈ రెండవ హెచ్చరిక కూడా భారతదేశం దృష్టిలోకి రాకుండా పోయింది.

వందలాదిమంది అనుమానిత భారతీయులను తీసుకెళుతున్న లెజెండ్ ఎయిర్‌లైన్స్(రొమేనియన్ సంస్థ) విమానం ఇంధనం నింపుకోవడం కోసం ఫ్రాన్స్‌లోని వాట్రీ విమానాశ్రయంలో దిగుతోందన్న సమాచారాన్ని సేకరించిన అమెరికన్ ప్రభుత్వ నిఘావర్గాలు, వ్యవస్థీకృత నేరాలపై పోరాడే ఒక ఫ్రెంచ్ ప్రభుత్వ విభాగానికి ఉప్పందించాయి. అట్లాంటిక్ సముద్ర ప్రాంతం పొడవునా నిఘా సమాచారాన్ని పంచుకోవడం అనేది ప్రపంచాన్ని సురక్షితమైన ప్రదేశంగా మారుస్తుందన్నది దీని వెనుక ఉద్దేశం. కానీ ఇది కలవరపెట్టే ప్రశ్నను కూడా



లేవనెత్తుతుంది: అలాంటి నిఘా సమాచారాన్ని న్యూఢిల్లీతో ఎందుకు పంచుకోలేదు? అత్యవసర పరిస్థితుల కోసం తగినంతగా సన్నద్ధత లేని ఒక విమానాశ్రయంలో, నాలుగు రోజుల పాటు భారతీయ ప్రయాణికులు నిర్బంధించబడ్డారు.

వాషింగ్టన్‌లోని విశ్వసనీయ వర్గాల ప్రకారం, అమెరికన్ అధికారులు ఆ విమానాన్ని ఎగరడానికి ముందే ఆపాలని అనుకోలేదు. పతాక శీర్షికల్లోకి వచ్చేలా చేయడం ద్వారా ప్రపంచ స్థాయిలో చర్యలు తీసుకునేలా అక్రమ వలస రాకెట్‌ను సమర్థవంతంగా బహిర్గతం చేయాలని వారు కోరుకున్నారు. ఎవరి తోడూ లేని మైనర్ ప్రయాణీకులను కూడా కలిగి ఉన్న ఆ విమానం వాట్రీ విమానాశ్రయం వద్ద ముట్టడిలో ఉండగానే అది ప్రపంచవ్యాప్తంగా వార్తలను సృష్టించింది. యూరప్ టీవీల్లో అతిపెద్ద వార్తగా మారిన ఈ అసాధారణ సంఘటన కారణంగా, ఈశాన్య ఫ్రాన్స్‌లో క్రిస్మస్ వేడుకలకు, పారిస్‌లోని అధికారిక వ్యవస్థలకు అంతరాయం ఏర్పడింది.

పశ్చిమ దేశాలకు వలస వచ్చే వారికోసం వేటాడే నేరస్థ ముఠాలు ఈ ఉదంతం కారణంగా, కనీసం కొంతకాలం అయినా ఇలాంటి విమాన వలసలకు ప్రయత్నించవు. అమెరికన్ విదేశాంగ శాఖ శిక్షాత్మకమైన వలస చట్టాన్ని అమలు చేయడానికి కొన్ని వారాల ముందు, హైతీ తన రాజధాని నుండి నికరాగ్వాకు అన్ని విమానాలను నిలిపివేసింది. భారతదేశంలాగే, ప్రస్తుతం హైతీ కూడా అక్రమ వలసలకు ఒక వనరుగా ఉందని అమెరికా పేర్కొంది.

సంపన్న దేశాలకు తమను అక్రమంగా తరలించేందుకు లక్షల రూపాయలు అప్పులు చేసి నికరాగ్వాకు వెళ్లే విమానం ఎక్కుతున్నారు భారతీయులు. ప్రభుత్వం ఈ నష్టాన్ని నివారించడంలో ఆలస్యం చేసింది. ఎట్టకేలకు డిసెంబరు 21న ఆర్భాటంగా, ఆకర్షణీయమైన సంక్షిప్త నామంతో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. యువత, నైపుణ్యం కలిగిన నిపుణుల కోసం క్రమబద్ధమైన సహాయకరమైన వలసను ప్రోత్సహించే 'ప్రయాస్' కార్యక్రమం అది. అంతర్జాతీయ వలస చక్రానికి సంబంధించిన విషయాలపై మెరుగైన అవగాహనను ప్రోత్సహించడానికి... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మెరుగైన సమన్వయం కోసం ఒక రోడ్‌మ్యాప్‌ను అభివృద్ధి చేయడం దీని లక్ష్యం. నికరాగ్వాకు ఇటీవల కనీసం రెండు విమానాల్లో వెళ్లిన భారతీయులను ఎవరూ గుర్తించలేదని పోలీసులు ఇప్పుడు చెబుతున్నారు. అనేక వందల మంది భారతీయ అక్రమ వలసదారులు దొరకకుండా తప్పించుకు పోతుండటాన్ని నాటకీయంగా చూపించే తమ ప్రయత్నంలో అమెరికా, ఫ్రెంచ్ ప్రభుత్వాల నేరనిరోధక ఏజెన్సీలు... ప్రధానంగా పంజాబ్, గుజరాత్‌ల నుండి యూరప్ గుండా పశ్చిమ అర్ధ గోళానికి వలసదారులను చేర్చడం కోసం పనిచేస్తున్న విస్తృత నేరస్థ నెట్‌వర్క్ గురించి భారతదేశాన్నే కాకుండా ఐక్యరాజ్యసమితిని కూడా చీకటిలో ఉంచాయి. ప్రయాస్ అనేది ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ వలస సంస్థ, భారతీయ అంతర్జాతీయ వ్యవహారాల మండలి... ఉమ్మడి ప్రాజెక్ట్.

మరో విడ్డూరం ఏమిటంటే, లెజెండ్ ఎయిర్‌లైన్స్ చార్టర్ ఫ్లైట్ ఉదంతం వెలుగులోకి రావడానికి ఒక వారం ముందు, 'నమోదు కాని రిక్రూట్‌మెంట్ ఏజెంట్ల వల్ల మోసపోతున్న విదేశీ ఉద్యోగార్థుల సంఖ్య భారీగా పెరిగింది' అని భారత విదేశాంగ శాఖ హెచ్చరించింది. విదేశాలకు వెళ్లాలనుకునే భారతీయులపై వేటు వేయడం ప్రపంచ స్థాయిలో జరుగుతోంది. 'చాలా తూర్పు యూరోపియన్ దేశాలు, కొన్ని గల్ఫ్ దేశాలు, మధ్య ఆసియా, ఇజ్రాయెల్, కెనడా, మయన్మార్, లావో పీపుల్స్ డెమోక్రటిక్ రిపబ్లిక్‌లలో వీటికి సంబంధించి కేసులు నమోదవుతున్నాయి' అని హెచ్చరించింది.

పార్లమెంట్‌లోని ప్రతి సెషన్ లోనూ, అక్రమ వలసల శాపం గురించి జీరో అవర్‌లో పెద్ద మొత్తంలో ప్రశ్నలు వస్తుంటాయి. భారత విదేశాంగ మంత్రి లోక్‌సభలో ఒక ప్రకటన చేస్తూ ఈ సమస్య సంక్లిష్టత రీత్యా తాము నిస్సహాయంగా ఉంటున్నట్టు పేర్కొన్నారు. 'బహిష్కరణ ఉత్తర్వులు వచ్చే వరకు విదేశాలు చాలావరకు తమ తమ దేశాల్లో అక్రమంగా ఉంటున్న వారి గురించి సమాచారాన్ని అందించవు' అని చెప్పారు. 'విదేశాల్లో చట్టవిరుద్ధంగా ఉంటున్న లేదా పని చేస్తున్న భారతీయుల సంఖ్యపై మన దౌత్య కార్యాలయాల వద్ద ఎటువంటి విశ్వసనీయమైన డేటా లేదు' అని అంగీకరించారు. ఇది షాకింగ్‌గా ఉందని చెబితే సమస్యను తక్కువ అంచనా వేయడమే అవుతుంది. వాట్రీ విమానాశ్రయ ఘటన ఉదంతం, సమస్య తీవ్రతనూ, సమగ్ర వలస విధాన సంస్కరణల అవసరాన్నీ సూచిస్తుంది. ఈ విషయంలో విఫలమైతే ఎక్కువ మంది భారతీయులు... అంతర్జాతీయ నేరస్థ ముఠాల బాధితులుగా మారతారు.

వ్యాసకర్త వ్యూహాత్మక అంశాల విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇలా మారేం!



రాజ్యాంగంలో 'సైంటిఫిక్ టెంపర్' అనే మాటను జోడించిన మొదటి దేశం... ఇండియా. కానీ దేశంలో ఎంతోమంది మూర్ఖులుగా, తర్కహీనులుగా తయారయ్యారు.

– డాక్టర్ హాస్సేన్, ఆంకాలజిస్ట్

మడత ల్యాపులు



త్వరలో ల్యాప్‌టాపులకు కాలం చెల్లిపోయేట్టుంది. ల్యాప్‌టాపుల స్థానంలో రోల్–టాపులు వచ్చేస్తాయి. వీటిని దగ్గరగా చుట్టుకోవచ్చు. టెక్నాలజీ ఎంత నమ్మశక్యం కానట్టుగా మారుతున్నదో!

– అనిల్ చోప్రా, ఎయిర్ మార్షల్ (రిటైర్డ్)

ఏది వైఖరి?



నాలుగు వందల ఏళ్ల క్రితం జరిగిన అవమానాన్ని మనం ఎప్పటికీ మర్చిపోకూడదు కాబట్టి, రామాలయం అవసరం అని ఒక స్నేహితుడు గుర్తుచేశాడు. ఇదే జనాలు '2002' సంవత్సరం ఎప్పటిదో అంటూ, దాన్ని మర్చిపోవాలని చెబుతుంటారు. ఇంతకీ, ఇండియా గుర్తుంచుకోవాలా? మర్చిపోవాలా?

– సలీల్ త్రిపాఠి, జర్నలిస్ట్

అందుకా వ్యతిరేకత?



నరేంద్ర మోదీ లాంటి నేతలు తమ నియంత్రణలో లేకపోవడం పట్ల వాషింగ్టన్‌లోని వామపక్ష కులీన వర్గాలు నిరాశలో ఉన్నాయి. అంతర్జాతీయ వ్యవహారాల్లో వాళ్లు చెప్పేది కాకుండా, భారత ప్రయోజనాల రీత్యా ఆయన వ్యవహరిస్తున్నారు. ఇలాంటిదానికి వాళ్లు గతంలో ఎప్పుడూ అలవాటుపడి లేరు.

– ఆర్తీ టిక్కూ, జర్నలిస్ట్

ఇంత గందరగోళమా?



ఐడీఎఫ్ (ఇజ్రాయెల్) తన సైనికులను తానే 'ఫ్రెండ్లీ ఫైర్'లో (స్వపక్షం నుంచే జరిగే పొరపాటు కాల్పులు) చంపుకొంటూ బిజీగా ఉంది. కనీసం ఇప్పటికే 29 మంది చనిపోయారు. కొన్ని కేసుల్లోనైతే సొంత సైనికుల మీదికి ట్యాంకులు ఎక్కించేశారు. పూర్తి భయాందోళనలకు ఇదొక సంకేతం.

– నీనా వ్యాస్, జర్నలిస్ట్

తగనిది



ఆర్టికల్ 370, అయోధ్య కేసుల్లో తన తీర్పును సమర్థించుకుంటూ భారత ప్రధాన న్యాయమూర్తి మీడియా ఇంటర్వ్యూలు ఎందుకు ఇస్తున్నారు? న్యాయమూర్తి తన తీర్పుల ద్వారానే మాట్లాడాలి. అవసరం అనుకుంటే మీడియాను కేవలం సుప్రీంకోర్టు పనితీరు మీద అవగాహన కల్పించడానికే వాడుకోవాలి. అంతేగానీ తీర్పుల మీద వివరణ ఇవ్వడం, సమర్థించుకోవడం తగదు.

– ఆశిష్ గోయల్, న్యాయవాది

గాల్లో ప్రాణాలు



గాజా పౌరులను మానవ కవచాలుగా వాడుతున్నట్టు ఒక హమాస్ మాజీ కార్యకర్త విచారణలో అంగీకరించాడు. తమకు మిలిటరీ స్థావరాలు నిర్మించే వీలు లేనందున, జనావాస బిల్డింగుల నుంచి దాడి చేయడం తప్ప ఇంకో మార్గం లేదనేది అతడి వాదన. ఒక విధంగా ఇది నిరాకరణ కన్నా, సమర్థనలా ధ్వనిస్తోంది.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

ఇన్ బాక్స్

విద్య బాగుపడుతుందా?

తెలంగాణ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. పాత ప్రభుత్వం పని తీరును సమీక్షించడం శుభ పరిణామం. సమీక్షించాల్సిన అతి ముఖ్యమైన అంశాల్లో పాఠశాల విద్యా శాఖ ఒకటి. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ అనంతరం అత్యంత నిర్లక్ష్యానికి గురై 50 శాతం పాఠశాలలు మూసివేత అంచున నిలబడి ఉన్నాయి. గత ప్రభుత్వం రెసిడెన్షియల్ పాఠశాలల సంఖ్యను భారీగా పెంచడం శుభ పరిణామమే. అయితే వాటిలో చేరిన విద్యార్థులలో 90 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న వారే కావడం గమనార్హం.

కొత్త ప్రభుత్వం అడ్మిషన్ వయస్సు 3 సంవత్సరాలకు తగ్గించడంతోపాటుగా, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలను ప్రవేశపెట్టాలి. ప్రాథమిక పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్స్‌గా; హైస్కూల్స్ అన్నింటినీ రెసిడెన్షియల్స్‌గా మార్చాలి. అన్ని రాష్ట్రాల్లాగే సీసీఈని రద్దు చేసి, సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టాలి. ఒక పాఠశాలను ఒక యూనిట్‌గా తీసుకొని మౌలిక వసతులతోపాటు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించి కంప్యూటర్ విద్య ప్రాధాన్యం పెంచడంతోపాటు లైబ్రరీలు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు నెలకొల్పాలి. తరగతి గదికో ఉపాధ్యాయుణ్ణి నియమించాలి. మండల విద్యాధికారి కార్యాలయాలతోపాటు ప్రతి పాఠశాలకు స్కావెంజర్, అటెండర్, క్లర్క్‌ను నియమించాలి. ఇన్‌ఛార్జ్‌ల వ్యవస్థను రద్దు చేసి అన్ని స్థాయిల్లో పర్యవేక్షక పోస్టులను నింపాలి. డిప్యూటేషన్లను రద్దు చేసి, విద్యా శాఖను భ్రష్టు పట్టిస్తున్న రిటైర్డ్ మేధావులను తొలగించాలి. ఇకనైనా ఉపాధ్యాయులు, మేధావులు, ప్రజలు, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు కళ్ళు తెరిచి గ్లోబలైజేషన్ విసిరిన సవాల్‌కు తగ్గట్టుగా పాఠశాలలను సంస్కరించాలనే డిమాండ్‌ను ప్రభుత్వాల ముందు ఉంచాలి. అందుకు తగ్గట్టుగా పౌరులను తయారు చేస్తామని హామీ ఇస్తే తప్ప ప్రభుత్వ పాఠశాలలను ప్రజలు విశ్వసించరు.

– డాక్టర్ ఏరుకొండ నరసింహుడు
తెలంగాణ టీచర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఫిట్ ఇండియా సాధ్యం కావాలంటే...

అభిప్రాయం



డా॥ ఆంజనేయ గౌడ్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్'లో జాతి మౌలిక లక్ష్య సాధనకు పిలుపివ్వడం ఆహ్వానించదగినదే. 2024 సంవత్సరంలో 'ఫిట్ ఇండియా' లక్ష్యం కావాలని ఆరోగ్యకర ఆశయాన్నే ప్రకటించారు. ఏడున్నర దశాబ్దాలుగా భారత ప్రభుత్వాలు ఎన్నో నినాదాలనిచ్చి, ఆ దిశగా అంతో ఇంతో దేశాన్ని ముందడుగు వేయించారనడంలో సందేహం లేదు. 'జై కిసాన్, జై జవాన్', 'హరిత విప్లవం', 'నీలి విప్లవం' ఇలా ఎన్నో ఆశయాలను ప్రకటించి, ఫలితాలు కొంతమేర రాబట్టగలిగారు. అయితే సమృద్ధిగా మానవ వనరులు, మేధో శక్తి, ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన మన దేశం, నిర్దేశిత లక్ష్యాలను చేరుకుందా అంటే ప్రశ్నార్థకమే. అందుబాటులో ఉన్న అపార యువశక్తిని సరియైన దారిలో నడిపించకుండా ఏ దేశం కూడా ఆదర్శ ప్రగతిని నమోదు చేయజాలదు. యువతకు విద్య, ఉపాధి అవకాశాలు ఎంత ముఖ్యమో... శారీరక, మానసిక శక్తిని ఇచ్చే క్రీడలూ అంతే ముఖ్యం. పదేళ్లుగా మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు పరుస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమమైనా, నేటి 'ఫిట్ ఇండియా' నినాదమైనా, చిత్తశుద్ధితో ఆచరణలో పెడితే 'ఆత్మ నిర్భర్ భారత్' వాస్తవమౌతుంది. 'వికసిత్' స్ఫూర్తి పిలుపులకే పరిమితమైతే సమాజంలో సమూల మార్పులు ఎండమావిగానే ఎదుట నిలుస్తాయి.

ప్రధాని నూతన నినాదాన్ని నిజం చేయడానికి కేంద్రం నిర్దిష్టమైన కార్యాచరణ చేపడితే, మన దేశం ఒలింపిక్స్‌లో పతకాలను గెలవడమే కాదు, ప్రతి ఊరు ఉరకలెత్తే ఉత్పత్తి శక్తుల కేంద్రంగా మారుతుంది. ట్రిలియన్ డాలర్ల వృద్ధి ఎంత అవసరమో, దాన్ని ఆస్వాదించగలిగే ఆరోగ్యవంతమైన సమాజ సృష్టి కూడా అంతే ముఖ్యం.

తాజా మన్ కీ బాత్ లో సద్గురు వాసుదేవ్, మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్, చెస్ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్, బాలీవుడ్ నటుడు



అక్షయ్ కుమార్ 'ఫిట్ ఇండియా' కోసం పలు సూచనలు ఇచ్చారు. కానీ ఒకవైపు కుస్తీ యోధులు కన్నీరు పెడుతూ అవార్డులు వాపస్ ఇస్తున్నారు. దేశ అవలక్షణాల ఆటలో సాగలేక మన మల్ల యోధులు క్రీడా రంగం నుంచి రిటైర్మెంట్ ప్రకటిస్తున్నారు. మైదానాల్లో మొలకెత్తిన కలుపు మొక్కలను ఏరేయకుండా ఫిట్ ఇండియా సాధ్యమా? సరియైన కేటాయింపులు చేయకుండా ఖేలో ఇండియా ఎలా సాకారం అవుతుంది? అందుకే కేంద్ర సర్కార్ కీలకమైన నిర్ణయాలు తీసుకోక తప్పదు.

మొదటగా జాతీయ ఒలింపిక్ అసోషియేషన్ కార్యవర్గ ఎన్నిక, దేశ క్రీడా ఫెడరేషన్‌ల ఎన్నికల నియమావళిలో సమూల మార్పులు జరగాలి. అంతర్జాతీయ ఒలింపిక్ అసోసియేషన్ నియమావళి, పనితీరును ప్రామాణికంగా తీసుకోవాలి. నాలుగేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికల్లో రెండు సార్లకు మించి, ఎవరూ ఎనిమిదేండ్ల కంటే ఎక్కువ కాలం పదవుల్లో ఉండకూడని విధంగా నిబంధనలు ఉండాలి.

ప్రాథమిక విద్య స్థాయి నుంచే క్రీడలు తప్పనిసరి చేయాలి. క్రీడోపాధ్యాయులను విద్యార్థుల నిష్పత్తి ఆధారంగా శాస్త్రీయ పద్ధతిలో నియమించాలి. అసలు వ్యవసాయ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అధ్యయనాలకు నిపుణులతో కమిషన్‌లు వేసినట్టే, క్రీడా రంగంపై కూడా అధ్యయనానికి సంబంధిత రంగ నిపుణులతో కమిషన్ వేసి అధ్యయనం జరిపించాలి.

పైన అనుకున్నవన్నీ జరగాలంటే ప్రభుత్వ దృక్పథంలో శాస్త్రీయత చోటు చేసుకోవాలి. శారీరక సామర్థ్యంతో పాటు, మేధస్సుకు ఉత్సాహాన్నిచ్చే క్రీడలకు పెద్ద పీట వేస్తే సహజంగానే సమాజ ఉత్పాదక సామర్థ్యం పెరుగుతుందనే సత్యాన్ని అర్థం చేసుకోవాలి. పౌష్టికాహారం, క్రీడా విద్య అవకాశాలను అందుబాటులోకి తెస్తే, శారీరక, మానసిక సామర్థ్యం వారసత్వంగా కలిగిన దేశంలోని బడుగులు అద్భుతాలు ఆవిష్కరిస్తారనడంలో సందేహమే లేదు.

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ ఛైర్మన్

ఈశ్వరమ్మ ఆరాధన

శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాని, తత్వవేత్త, సంఘ సంస్కర్తగా ప్రసిద్ధి చెందారు. ఆయన తత్వ వారసురాలిగా శ్రీ ఈశ్వరీదేవి పేరు పొందారు. బ్రహ్మంగారి కాలజ్ఞాన తత్వాలను ప్రజలకు బోధించారు. ఆమె బ్రహ్మంగారి రెండో కుమారుడైన గోవిందస్వామి, గిరియమ్మ దంపతులకు క్రీ.శ.1703లో జన్మించారు. చిన్నప్పటి నుంచే సంస్కృతం, తెలుగు భాషలపై పాండిత్యం సంపాదించారు. భారత, భాగవతాది గ్రంథాలను స్వయంగా వర్ణించే వారు. బ్రహ్మంగారి మఠానికి సమీపాన ఉన్న నల్లమల కొండ గుహలో 14 ఏళ్ల కఠోర తపస్సు చేసి.. అష్టాంగ యోగాది, జ్ఞాన వాక్సిద్ధి పొందారు. స్వీయ కల్యాణాన్ని త్యజించి... లోక కల్యాణార్థం బ్రహ్మచర్య దీక్ష బూని ఆత్మతత్వ బోధనలు రచించారు. శిష్యసమేతంగా దేశ పర్యటన చేసి భక్తితత్వాన్ని ప్రచారం చేశారు. భక్తులకు ఎన్నో లీలలు ప్రత్యక్షంగా చూపించారని భక్తులు చెప్పుకుంటూ ఉంటారు.

మార్కాపురంలో కలరా, మశూచి వంటి అంటు వ్యాధులను నివారించారు. ఆ గ్రామంలో బొడ్డు రాయిని ప్రతిష్ఠించారు. ఎందరినో సంస్కరించి జ్ఞాన దీప్తిలా భాసిల్లి... జనుల గుండెల్లో అమ్మవారిగా కొలువైనారు. 1803లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైఎస్ఆర్ జిల్లాలోని బ్రహ్మంగారి మఠం (కందిమల్లాయపల్లె)లో సజీవ సమాధి నిష్ఠ పొందారు. నాటి నుంచి లోక కల్యాణార్థం యోగ నిద్ర ముద్రితురాలై భక్తజనుల నిత్య నీరాజనాలు స్వీకరిస్తున్నారు. ఆ ప్రాంతం శ్రీ ఈశ్వరీదేవి మఠంగా పేరొందింది. ఏటా మార్గశిర బహుళ నవమి నాడు అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవం నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది జనవరి 3 నుంచి 8 వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

– వి. మల్లికార్జున ఆచార్య, కడప
(జనవరి 5న ఈశ్వరీదేవి సజీవ సమాధి నిష్ఠ పొందిన రోజు)

క్లుప్తంగా...

నాలుగోరోజు ప్రజాపాలనలో 20.39 లక్షల దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: రెండు రోజుల సెలవుల అనంతరం మంగళవారం నాలుగో రోజు ప్రజాపాలనలో అభయహస్తం గ్యారంటీల కింద 20,39,927 దరఖాస్తులను స్వీకరించినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్‌లో ప్రజాపాలనపై సమీక్ష నిర్వహించారు. గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్లు వివరించారు. కొరత రాకుండా అదనపు దరఖాస్తులను అందుబాటులో ఉంచినట్లు అధికారులు వివరించారు. నాలుగోరోజు గ్యారంటీలకు 17,39,146 ఇతర అంశాలకు సంబంధించి 3,00,817 దరఖాస్తులు వచ్చాయని సీఎస్ పేర్కొన్నారు. ఇప్పటివరకు నాలుగురోజులకు కలిపి మొత్తం 61,16,167 దరఖాస్తులు అందాయని వివరించారు. మంగళవారం 1,866 మున్సిపల్ వార్డులలో, 3,779 గ్రామ పంచాయతీలలో ప్రజాపాలన నిర్వహించినట్లు తెలిపారు.

బైరి నరేశ్‌పై కేసు నమోదు



ఏటూరునాగారం/కమలాపూర్: ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో జరిగిన కారు ప్రమాదం ఘటనలో భారత నాస్తిక సమాజం తెలంగాణ అధ్యక్షుడు బైరి నరేశ్‌తోపాటు అతని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ మంగళవారం తెలిపారు. స్థానిక బీఆర్ ఫంక్షన్ హాల్‌లో మూఢనమ్మకాల నిర్మూలన సంఘం(ఎంఎన్ఎస్) ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజాచైతన్య సదస్సుకు నరేశ్ హాజరయ్యారు. సదస్సు ప్రాంగణంలో అయ్యప్పస్వాములు నిరసన తెలుపుతుండగా నరేశ్ వాహనం దూసుకెళ్లడంతో ఓ అయ్యప్ప భక్తుడి కాలు విరిగింది. ఈ ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, ఏటూరునాగారంలో సదస్సును అడ్డుకుని దాడి చేయడం అప్రజాస్వామికమని డాక్టర్ బైరి నరేశ్ ఖండించారు. హనుమకొండ జిల్లా రాములపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీనిపై ప్రభుత్వం స్పందించి కారకులపై చర్యలు తీసుకోవాలని, తనకు రక్షణ కల్పించాలని కోరారు.

డీజీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు



సాక్షి, హైదరాబాద్: డీజీపీ కార్యాలయ తెలంగాణ నాన్-గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డీజీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీజీపీ రవి గుప్తా, అదనపు డీజీపీలు శిఖా గోయల్, అభిలాషా బిస్త్, మహేశ్ భగవత్, సంజయ్ కుమార్ జైన్, ఐజీలు ఎం.రమేశ్, తరుణ్ జోషి, స్టీఫెన్ రవీంద్ర, సీఐడీ ఎస్పీ అపూర్వరావు, ఏఐజీ నాగరాజు ఈ వేడుకలలో పాల్గొన్నారు. మినిస్టీరియల్ సిబ్బంది పోలీస్ శాఖకు వెన్నుముకలా పనిచేస్తున్నారని ఈ సందర్భంగా డీజీపీ ప్రశంసించారు. సిబ్బంది ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీజీపీ కార్యాలయ తెలంగాణ నాన్-గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శి టి.శివరంజని, సంఘం అధ్యక్షుడు సి.పవన్ కుమార్ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి, సభ్యులు శ్రీనివాసరెడ్డి, శంకర్‌రెడ్డి, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తబ్లిగి జమాత్‌కు నిధులపై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా పరిగి మండలం జీమత్ నగర్‌లో జనవరి 6, 7, 8 తేదీల్లో జరగనున్న తబ్లిగి జమాత్ సదస్సు కోసం రూ.2.45 కోట్ల నిధులు విడుదల చేయడంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది. మతపరమైన సమ్మేళనంలో భాగంగా తబ్లిగి జమాత్‌కు రూ.2.46 కోట్లు కేటాయిస్తూ గతనెల 13న ప్రభుత్వం జీవో నంబర్ 123ను జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ, జీవోను కొట్టివేయాలని కోరుతూ అఫ్సర్‌పాషా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'తబ్లిగి జమాత్ 2020, జనవరిలో నిర్మల్ పట్టణంలో ఇలాంటి ఇస్లామిక్ సమ్మేళనాన్ని నిర్వహించింది. దీని ఫలితంగా నిర్మల్ జిల్లా భైంసాలో మతపరమైన హింసతో పాటు శాంతిభద్రతల సమస్యలు తలెత్తాయి. 2009లో రష్యా సుప్రీంకోర్టు తబ్లిగి జమాత్‌ను తీవ్రవాద సంస్థగా పేర్కొంది. సౌదీ అరేబియా, ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్, కజకిస్తాన్ సహా అనేక ఇతర దేశాలు కూడా ఈ సంస్థను నిషేధించాయి. వక్ఫ్ బోర్డు నిధులతో ప్రభుత్వానికి సంబంధం లేదు. నిధులు విడుదల చేయాలని వక్ఫ్ బోర్డును ఆదేశించే హక్కు ప్రభుత్వానికి లేదు' అని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక మంగళవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ వాదనలపై కౌంటర్ దాఖలు చేయాలని మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి, వికారాబాద్ జిల్లా కలెక్టర్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవోతో పాటు తబ్లిగి జమాత్ సంస్థకు నోటీసులు జారీ చేశారు.

ఆధునిక మగ్గాలు ఆగాయి

నిరవధికంగా సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు మూసివేత

- పేరుకుపోయిన వస్త్ర నిల్వలు.. గిట్టుబాటు కాని ధరలు
- రోడ్డున పడిన వెయ్యి మంది నేత కార్మికులు


సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్‌లో నిలిచిన వస్త్రోత్పత్తి

సిరిసిల్ల: ఒకవైపు మార్కెట్‌లో బట్టకు సరైన ధర లేదు...మరోవైపు వస్త్రోత్పత్తి నిల్వలు పేరుకుపోయాయి. దీంతో సిరిసిల్లలోని టెక్స్‌టైల్‌పార్క్ పరిశ్రమలను యజమానులు మంగళవారం మూసివేశారు. దీంతో నేత కార్మికులకు ఉపాధి కరువైంది. టెక్స్‌టైల్ పార్క్‌లో మాంద్యం(సంక్షోభం) కారణంగా వస్త్రోత్పత్తి గిట్టుబాటు కావడం లేదని వస్త్రోత్పత్తిదారులు పేర్కొంటున్నారు. ఆధునిక మగ్గాలను నిరవధికంగా బంద్ పెట్టడంతో అక్కడ పనిచేసే వెయ్యి మంది నేత కార్మికులు రోడ్డునపడ్డారు. వేలాదిమంది నేతన్నలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో వరంగల్‌లో చేపట్టిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పునాదుల్లో ఉండగా.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాముందే నిర్మించిన సిరిసిల్ల తొలి టెక్స్‌టైల్ పార్క్ ఇప్పుడు సంక్షోభంతో మూతపడింది. సిరిసిల్లలో కార్మికులు కూలి పెంచాలని సమ్మెకు దిగడం సహజం. కానీ పరిశ్రమల యజమానులే కార్ఖానాలను మూసి వేసి బట్ట గిట్టుబాటు కావడం లేదని వస్త్రోత్పత్తిని నిలిపివేయడం టెక్స్‌టైల్ రంగంలో సంక్షోభానికి అద్దం పడుతోంది.

ఉపాధి లక్ష్యంగా..

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులో 65 ఎకరాల్లో 2003లో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేశారు. 7,000 మంది కార్మికులకు ఉపాధి లక్ష్యంగా దీనిని నెలకొల్పారు. 20 ఏళ్లుగా కేవలం గరిష్టంగా 2వేల మందికి పని కల్పించింది. టెక్స్‌టైల్ పార్క్‌లో 113 యూనిట్లు ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 65కు పడిపోయింది. 800 ఆధునిక ర్యాపియర్ లూమ్స్‌పై వస్త్రోత్పత్తి జరుగుతోంది. సంక్షోభం కారణంగా 40 మంది యూనిట్ల యజమానులు ఆధునిక ర్యాపియర్స్ లూమ్స్‌ను అమ్మేసుకున్నారు.

విద్యుత్ చార్జీలూ భారమే

టెక్స్‌టైల్ పార్క్‌లోని యూనిట్లకు విద్యుత్ చార్జీలు భారంగా మారాయి. వస్త్రోత్పత్తిదారులకు యూనిట్ కరెంట్ ధర రూ.7.50 ఉంది. అదే మహారాష్ట్రలో యూనిట్ విద్యుత్ చార్జీలు రూ.3 ఉంది. తమిళనాడులో 500 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తుండగా, అంతకు మించి వినియోగిస్తే ప్రతి యూనిట్‌కు రూ.2.50 ఉంది. పొరుగు రాష్ట్రాల్లో విద్యుత్ టారిఫ్ రేట్లు తక్కువగా ఉండగా, సిరిసిల్లలో ఎక్కువగా ఉండడంతో పొరుగు రాష్ట్రాలతో సిరిసిల్ల వ్యాపారులు పోటీ పడలేకపోతున్నారు. ఇటీవల నూలు రేట్లు బాగా పెరగడం, రవాణా చార్జీలు ఎక్కువ కావడంతో వస్త్రోత్పత్తి వ్యయం కూడా పెరిగింది. ఒక్కో మీటరు బట్ట నాణ్యతను బట్టి రూ.18 నుంచి రూ.70 వరకు అమ్ముతుంటారు. అయితే ప్రస్తుతం బట్టకు మార్కెట్‌లో ధర లేక నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ప్రస్తుతం పార్క్‌లోని యూనిట్లలో కోటి మీటర్ల బట్టల నిల్వలు ఉన్నాయి. దీంతో టెక్స్‌టైల్ పార్క్‌లో పరిశ్రమలను నిరవధికంగా మూసివేశారు.

నెలకు రూ.12వేలు వచ్చేవి



పనిచేసిన రోజు రూ.400 నుంచి రూ.500 ఇచ్చేవారు. అంతా కలిపి నెలకు రూ.12వేలు వరకు ఉండేది. ఇప్పుడు పార్క్ మూసివేయడంతో మాకు పని లేకుండాపోయింది. మళ్లీ కార్ఖానాలు తెరిచే దాకా పని ఉండదు. పని చేయకుంటే ఇల్లు గడవదు.
– గాజుల మల్లేశం, నేతకార్మికుడు


టెక్స్‌టైల్ రంగం సంక్షోభంలో ఉంది



మా కార్ఖానాల్లో బట్టల నిల్వలు పేరుకుపోయాయి. బట్ట ఉత్పత్తి వ్యయం కూడా ఎక్కువ అయ్యింది. ఆ మేరకు బట్టకు ధర లేక ఇబ్బందిగా ఉంది. ధర తగ్గించి అమ్మే పరిస్థితి ఏర్పడింది. నష్టాలను భరిస్తూ వస్త్రోత్పత్తి చేయలేక యూనిట్లు మూసివేయాలని నిర్ణయం తీసుకున్నాం.
–అన్నల్‌దాస్ అనిల్‌కుమార్, పార్క్ అసోసియేషన్ అధ్యక్షుడు

'విభజన' కమిటీ మార్గదర్శకాల మేరకే విచారణ

- ఏఐఎస్ కేడర్ వివాదంపై హైకోర్టు స్పష్టం
- నిర్ణయం తీసుకునే బాధ్యతను డీవోపీటీకే అప్పగిస్తాం
- విచారణ నేటికి వాయిదా వేసిన ఉన్నత న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా ఆలిండియా సర్వీస్ (ఏఐఎస్) అధికారుల కేటాయింపునకు ఏర్పాటు చేసిన ప్రత్యూష్ సిన్హా అడ్వైజరీ కమిటీ మార్గదర్శకాల మేరకే విచారణ చేపడతామని వాద, ప్రతివాదులకు హైకోర్టు స్పష్టం చేసింది. 'రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ కేడర్ వివాదంపై జనవరిలో ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ తీర్పు సందర్భంగా కమిటీ మార్గదర్శకాలను ధర్మాసనం సమర్థించింది. ఈ మార్గదర్శకాల మేరకు మాత్రమే మేం విచారణ చేపడతాం. కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఆదేశాలు సరికాదు. వాటిని రద్దు చేసి.. నిర్ణయం తీసుకునే బాధ్యతను సిబ్బంది మరియు శిక్షణ విభాగం(డీవోపీటీ)కి అప్పగిస్తాం. తెలంగాణ వచ్చి దాదాపు 10 ఏళ్లు కావొస్తోంది.. పదేళ్లుగా డీజీపీ అంజనీకుమార్ సహా కేడర్ వివాదం ఎదుర్కొంటున్న అధికారులు ఇక్కడ పనిచేస్తున్నారు. వీరిలో చాలా మంది సర్వీస్ సంవత్సరంలోపు కూడా ఉంది. ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తాం'అని జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది.

పదేళ్లుగా కొనసాగుతున్న కేడర్ వివాదం..

2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటి నుంచి కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. విభజన సమయంలో పలువురు అధికారులను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. అయితే వీరిలో కొందరు ఈ కేటాయింపులపై క్యాట్‌ను ఆశ్రయించి.. తెలంగాణలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు పొందారు. క్యాట్ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం తప్పుబడుతూ.. తెలంగాణ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేసింది. ఈ క్రమంలోనే గత జనవరిలో తెలంగాణ సీఎస్ సోమేశ్‌కుమార్‌ను ఏపీకి వెళ్లాల్సిందేనంటూ ఇదే హైకోర్టు సీజే ధర్మాసనం తీర్పునిచ్చింది. అయితే కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా తమ పిటిషన్లను విడిగా విచారణ జరపాలని డీజీపీ అంజనీకుమార్ సహా ఇతర అధికారులు కోరడంతో విచారణను సీజే ధర్మాసనం మరో బెంచ్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై సోమవారం జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది.

అది చట్టరీత్యా ఆమోదం కాదన్న ఏఎస్‌జీ

కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) నరసింహ శర్మ వాదనలు వినిపిస్తూ.. ఏఐఎస్ అధికారులు క్యాట్‌ను ఆశ్రయించి కేటాయింపులకు వ్యతిరేకంగా ఉపశమనం పొందడం చట్టరీత్యా ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సోమేశ్‌కుమార్ తీర్పు సందర్భంగా ఇదే హైకోర్టు పేర్కొందన్నారు. అనంతరం పలువురు ఐఏఎస్‌ల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని సెక్షన్ 80 ప్రకారం అధికారుల కేటాయింపునకు ఏర్పాటు చేసిన ప్రత్యూష్ సిన్హా అడ్వైజరీ కమిటీ మార్గదర్శకాలను ఐపీఎస్‌లు సవాల్ చేశారని న్యాయవాది సుధీర్ నివేదించారు. న్యాయవాది కె.లక్ష్మీనరసింహ, సీనియర్ న్యాయవాది గోదా శివ.. ఐఏఎస్ అధికారుల తరఫున వాదనలు వినిపించారు. నివాసం ఉంటున్న ప్రాతిపదికన ఏఐఎస్ అధికారుల కేటాయింపు సరికాదన్నారు. ఈ విషయంలో నియామకం నుంచి వాదనలు వినాల్సి ఉంటుందని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి వాదనల కోసం నేటికి వాయిదా వేసింది.

ఏఎస్ మెట్ కార్పొరేషన్‌లో సోదాలు

- పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టిన పన్నుల శాఖ అధికారులు
- రూ.5.89 కోట్ల మేర పన్ను ఎగవేతకు పాల్పడినట్లు ఆధారాలు
- కంపెనీ డైరెక్టర్ పీయూష్ మెహతా అరెస్టుకు వారెంటు జారీ
- పరారీలో పీయూష్ మెహతా

సాక్షి, హైదరాబాద్: నకిలీ పన్ను ఇన్‌వాయిస్‌లు, ఈ-వేబిల్‌లను ఉపయోగించి రూ.కోట్లలో జీఎస్టీ ఎగవేసిన ఆరోపణలపై ఏఎస్ మెట్ కార్పొరేషన్‌లో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు సోదాలు చేపట్టారు. వస్తువులకు అసలు రసీదు లేకుండానే ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్(ఐటీసీ) క్లెయిమ్ చేసేందుకు సదరు సంస్థ అవకతవకలకు పాల్పడిందని గుర్తించారు. ఈ మొత్తం మోసపూరిత లావాదేవీలలో కీలకమైన సదరు కంపెనీ డైరెక్టర్ పీయూష్ ప్రవీణ్‌చంద్ర మెహతా అరెస్టుకు వాణిజ్య పన్నులశాఖ అధికారులు వారెంట్ జారీ చేశారు. ప్రస్తుతం పరారీలో ఉన్న పీయూష్ మెహతా కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. భారీ మొత్తంలో జీఎస్టీ ఎగవేత సమాచారంతో డిసెంబర్ 24 నుంచి 26 వరకు సికింద్రాబాద్‌లోని తిరుమలగిరిలో ఉన్న ఏఎస్ మెట్ కార్పొరేషన్ ప్రై.లిమిటెడ్‌లో సోదాలు చేపట్టినట్లు తెలంగాణ వాణిజ్య పన్నుల కమిషనర్ డా. టీకే శ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

బోగస్ లావాదేవీలను చూపించి..

ఏఎస్ మెట్ కార్ప్ ప్రై. లిమిటెడ్ ఎంఎస్ పైప్స్, టీఎంటీ బార్లు, టీఎంటీ రీ బార్లు, సీఆర్‌ఎఫ్‌హెచ్ స్టీల్ కాయిల్స్, ఎంఎస్ రౌండ్స్ ఆఫ్ ఐరన్ అండ్ స్టీల్ ట్రేడింగ్ నిర్వహిస్తోంది. సదరు కంపెనీ సరుకు రవాణా వాహనాలైన లారీలు, ట్రక్కుల స్థానంలో కార్లు, ప్యాసింజర్ ఆటోలు, వ్యాన్లు, బైక్‌లు మొదలైన రిజిస్ట్రేషన్ నంబర్లను ఈ-వేబిల్‌లలో నమోదు చేసినట్లు ధ్రువపత్రాల తనిఖీలో ఆదాయపన్నుశాఖ అధికారులు గుర్తించారు. బోగస్ లావాదేవీలను చూపి రూ.5.89 కోట్ల మేర ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) పొందినట్లు గుర్తించారు. ఈ మొత్తం మోసం వెనుక పీయూష్ ప్రవీణ్‌చంద్ర మోహతా ఉన్నట్లు కీలక ఆధారాలు లభించడంతో అతడి అరెస్టుకు వారెంటు జారీ చేశారు. అయితే అప్పటి నుంచి పరారీలో ఉన్న పీయూష్ జాడ గుర్తించే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తెలిపారు.

బస్సు నడపకపోతే డిపో ముందు ధర్నా చేస్తా

మధిర ఆర్టీసీ డీఎంకు వైరా ఎమ్మెల్యే హెచ్చరిక



వైరా రూరల్: వైరా–నెమలి రూట్‌లో వెంటనే బస్సు సర్వీసు ప్రారంభించకపోతే డిపో ముందు ధర్నా చేస్తానని ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ హెచ్చరించారు. ఈ రూట్లో బస్సు సర్వీస్ నడపాలని గత నెల 9వ తేదీ నుంచి ఇప్పటివరకు పలుమార్లు ఎమ్మెల్యేగా తాను మధిర డీఎంకు చెప్పినా ఖాతరు చేయకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. వైరా మండలంలోని విప్పలమడకలో మంగళవారం జరిగిన ప్రజాపాలన సభకు ఎమ్మెల్యేగా హాజరుకాగా.. స్థానికులు వైరా–నెమలి రూట్‌లో బస్సు నడవడం లేదని తెలిపారు. దీంతో డీఎం దేవదానంకు ఫోన్ చేసి మాట్లాడుతూ వెంటనే బస్సు ప్రారంభించకపోతే అధికార పార్టీ ఎమ్మెల్యేనైనప్పటికీ మధిర డిపో ముందు ధర్నా చేయాల్సి వస్తుందని రాందాస్‌నాయక్ హెచ్చరించారు. దీనికి డీఎం బదులిస్తూ బస్సు సర్వీసు పునః ప్రారంభంపై ఆర్ఎం దృష్టికి తీసుకెళ్తానని బదులిచ్చారు. కాగా, గత నెల 9న మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించగా, వైరా–నెమలి రూట్‌లో రద్దయిన బస్సు నడిపించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఆయన 10న వైరాలో ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించి వేదికపై నుంచే మధిర డీఎంకు సూచనలు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో రాందాస్‌నాయక్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

నేడు సావిత్రిబాయి ఫూలే జయంత్యుత్సవాలు: జాజుల

సాక్షి, హైదరాబాద్: సామాజిక సంఘ సేవకు రాలు, భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయు రాలు సావిత్రిబాయి ఫూలే 193వ జయంత్యుత్స వాలను రాష్ట్రవ్యాప్తంగా బుధవారం పెద్దఎత్తున నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ బీసీలకు పిలుపు నిచ్చారు. అణగారిన వర్గాలతో అక్షరాలు దిద్దించి, మహిళలకు చదువు నేర్పిన మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బడుగుల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన సావిత్రిబాయి జయంత్యుత్సవాలను తెలంగాణ, ఏపీలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం హాజరవు తున్నారని జాజుల వెల్లడించారు.

సన్నాలు పైపైకి

▶ మొదటి పేజీ తరువాయి

నగరంతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఇదే పరిస్థితి నెలకొంది.

రాష్ట్రంలో పెరగని సన్నాల దిగుబడి

రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో 80 శాతానికి పైగా దొడ్డు రకాలైన 1010, 1001, 1061, ఐఆర్ 64, తెల్లహంస వంటి వరి రకాలనే ఎక్కువగా పండిస్తారు. ఉత్తర తెలంగాణలో యాసంగిలో సన్న రకాలు పండే పరిస్థితి ఏమాత్రం లేదు. దక్షిణ తెలంగాణలోని మహబూబ్‌నగర్, ఖమ్మంలలో అదే పరిస్థితి. మిర్యాలగూడ, సూర్యాపేట వంటి ప్రాంతాల్లో కొన్నిచోట్ల సన్నాలు పండించినా, సొంత అవసరాలకే వినియోగిస్తారు. ఇక వానాకాలం సీజన్‌లో నిజామాబాద్ మినహా ఉత్తర తెలంగాణలో రైతులు తమ పొలాల్లో సంవత్సరకాలం తిండి అవసరాలు, స్థానిక అవసరాలకు మాత్రమే సన్న రకాలను పండించి, దొడ్డు వరి వైపే మొగ్గు చూపుతారు. నిజామాబాద్, నల్లగొండ ఉమ్మడి జిల్లాలతో పాటు మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మాత్రమే ఖరీఫ్ సీజన్‌లో సన్నాలు ఎక్కువగా పండిస్తారు. సన్నాలను బియ్యంగా మార్చి విక్రయించే రైతులు కొందరైతే , సన్న ధాన్యాన్ని మిల్లర్లకు విక్రయించే వారు ఎక్కువ మంది. అయితే ఈసారి వానాకాలం సీజన్‌లో నాగార్జునసాగర్ కింద పంట తక్కువగా రావడంతో సన్నాలకు డిమాండ్ పెరిగింది. దీనికి తోడు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద కూడా వాతావరణ ప్రతికూల పరిస్థితులతో సన్న ధాన్యాన్ని తెగులు సోకినట్లు రైతులు చెబుతున్నారు. దీంతో ఇక్కడ కూడా కొంత పంట దెబ్బతింది. కేవలం బోర్లు, కరెంటు మోటార్ల కింద పండిన పంట మాత్రమే ఎక్కువ దిగుబడి వచ్చింది.

మార్కెట్‌కు వచ్చిన ధాన్యం 43 ఎల్ఎంటీ మాత్రమే

రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్‌లో 99 మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసినా, ఇప్పటివరకు వచ్చిన ధాన్యం 43 ఎల్ఎంటీ మాత్రమే మరో 2 ఎల్ఎంటీ ధాన్యం కూడా కొనుగోలు కేంద్రాలకు వచ్చే పరిస్థితి లేదు. గత యాసంగిలో 67 ఎల్ఎంటీ మేర దొడ్డు ధాన్యం వచ్చినా, అదంతా మిల్లుల్లోనే నిల్వ ఉంది.

మిర్యాలగూడలోని ఓ రైస్ మిల్లు నుంచి మంగళవారం సరఫరా అయిన హోల్‌సేల్, రిటైల్ బియ్యం ధర (క్వింటాల్‌కు రూ.లలో)

బియ్యం రకం	హోల్‌సేల్ ధర	రిటైల్ మార్కెట్‌లో
జైశ్రీరాం స్టీమ్ రైస్	6800	7300 – 7500
జైశ్రీరాం పాత బియ్యం	6900	7500– 7800
కొత్త హెచ్ఎంటీ స్టీమ్ రైస్	6500	6,800– 7000
బీపీటీ స్టీమ్ రైస్	5,500	5,900– 6,200
బీపీటీ ఆఫ్ బాయిల్డ్ రైస్	5,000	5,400– 5,600

'ప్రజాపాలన'లో కేసీఆర్ ఫొటో లేదంటూ రగడ

సిద్దిపేట జిల్లా బూర్గుపల్లిలో అధికారులతో వాగ్వాదం

గజ్వేల్: ప్రజాపాలన కార్యక్రమంలో ఫ్లెక్సీ ఏర్పాటు అంశం వాగ్వాదానికి దారితీసింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలనలో స్థానిక ఎమ్మెల్యే కేసీఆర్ ఫొటో లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని సర్పంచ్ వంటేరు విజయ్‌వర్ధన్‌రెడ్డి అధికారులను నిలదీశారు. కేసీఆర్ ఫొటో పెట్టిన తర్వాతే ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డి అక్కడికి చేరుకొని నియోజకవర్గంలోని అన్నిచోట్లా ఇదేవిధంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఇక్కడ ప్రత్యేకంగా అభ్యంతరమేంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సీఐతోనూ విజయ్‌వర్ధన్‌రెడ్డి వాదనకు దిగారు. ప్రొటోకాల్ పాటించాలని డిమాండ్ చేయడం తప్పా అని విజయ్‌వర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సందర్భంలో సీఐ ఆర్డీవో బన్సీలాల్‌కు ఫోన్ చేసి ఫ్లెక్సీ వివాదాన్ని వివరించారు. సర్పంచ్‌తో మాట్లాడించే ప్రయత్నం చేశారు. అయితే ప్రజాపాలనలో అధికారదర్పాన్ని ప్రదర్శించడం సరికాదంటూ సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కరెంట్ చార్జీల పెంపు ప్రతిపాదనలకు గడువు పొడిగించండి

ఈఆర్సీకి విజ్ఞప్తి చేసిన డిస్కంలు

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరం 2023–24లో విద్యుత్ చార్జీల పెంపునకు సంబంధించిన టారిఫ్ ప్రతిపాదనలు సమర్పించడానికి గడువు మంగళవారం ముగియగా, మరో నెలపాటు పొడిగించాలని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ)కి రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు విజ్ఞప్తి చేశాయి. టారిఫ్ ప్రతిపాదనలు, వార్షిక ఆదాయ అవసరాల(ఏఆర్ఆర్) అంచనాలు ఇంకా సిద్ధం కాకపోవడంతో ఫిబ్రవరి 2 వరకు గడువు పొడిగించాలని ఈఆర్సీకి మంగళవారం లేఖను అందించాయి. వాస్తవానికి గతేడాది నవంబర్ చివరిలోగా ఈ ప్రతిపా దనలు సమర్పించాల్సి ఉండగా, డిస్కంల విజ్ఞప్తి మేరకు జనవరి 2 వరకు గడువు పొడి గిస్తూ అప్పట్లో ఈఆర్సీ నిర్ణయం తీసుకుంది.

దానం అనుచరుడి భూకబ్జాపై నిరసన

ప్రజావాణిలో బాధితుల ఫిర్యాదు.. ఆందోళన



లక్డీకాపూల్: ప్రజాసమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. మంగళవారం తమ తమ సమస్యలపై అర్జీలు సమర్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌కు ప్రజలు పోటెత్తారు. ప్రభుత్వానికి సమస్యలు విన్నవించుకునేందుకు నగరవాసులే కాకుండా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తెల్లవారుజాము నుంచి ప్రజాభవన్‌కు దరఖాస్తుదారులు బారులుతీరారు. ఉదయం 8 గంటల కల్లా ప్రజాభవన్‌లోని క్యూలైన్లు నిండిపోయాయి. ప్రజావాణి నోడల్ అధికారిణి హరిచందన ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు అర్జీలను స్వీకరించారు. అందులో భూ సమస్యల పరిష్కారం, ఉద్యోగాలు, పింఛన్ల కోసం ఎక్కువ మంది అర్జీదారులు వస్తున్నారు. ఏళ్లతరబడి పరిష్కారానికి నోచుకోని తమ సమస్యలు ఇప్పుడైనా పరిష్కారమతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మా భూముల్ని దానం అనుచరుడు కబ్జా చేశాడు..

బేగంపేట ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లోని ఇళ్లను కబ్జా చేసి స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బస్తీవాసులు ఉపేంద్ర, నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాము సర్వే నెంబర్ 194/8/1లో రెండు ఎకరాల భూమిని పైగా నవాబు వారసుల వద్ద నుంచి కొనుగోలు చేసి కష్టపడి ఇళ్లు కట్టుకున్నామన్నారు. ఆ భూమి పక్కనే సర్వే నెం.184,185,186,187లలో మూడు ఎకరాలను దానం నాగేందర్ అనుచరులు కొనుగోలు చేసి..మరికొంత ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. ఇప్పుడు ఆ భూమి నుంచి తమను వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తాము కట్టుకున్న ఇళ్లను కూలగొట్టిస్తామని బెదిరిస్తున్నారంటూ కొందరు బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలోని రెండు ఎకరాల్లో తాము ఇళ్లు వేసుకున్నామని పేర్కొంటూ..మిగిలిన మూడు ఎకరాలను దానం తన బినామీ సుధీర్‌గౌడ్ పేరిట కొనుగోలు చేశారని ఆరోపించారు. దాంతో పాటు తమ ఇళ్ల జాగాలను కబ్జా చేసేందుకు నిత్యం ఆయన రౌడీలతో బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ప్లకార్డులతో నిరసన తెలుపున్న బస్తీవాసుల దృశ్యాలను సెల్‌ఫోన్‌లో వీడియో తీసిన దానం నాగేందర్ అనుచరుడిపై బాధితులు దాడి చేసి పోలీసులకు అప్పగించారు. అంతే కాకుండా డీసీపీ విజయకుమార్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు.

- సిద్దిపేట జిల్లా మిరుదొడ్డికి చెందిన మద్దెల నర్సింలు, కుత్బుల్లాపూర్‌కి చెందిన పప్పిరెడ్డి సురేందర్ రెడ్డిలు కూడా భూ కబ్జాలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
- బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏల సర్దుబాటు కోసం తెచ్చిన జీఓ నెం.81, 85లకు సవరణ చేసి వీఆర్ఏ కుటుంబాలకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.
- హ్యాండీకాప్ సర్టిఫికెట్ కోసం తిరుగుతున్నా అధికారులు, ఎమ్మెల్యేలు తమను పట్టించుకోలేదని పలువురు వికలాంగులు ఆవేదన వ్యక్తం చేశారు.



వన్ ఉమన్ షో!

బంగ్లాదేశ్‌లో 7న సార్వత్రిక ఎన్నికలు • విపక్షాల బాయ్‌కాట్

మళ్లీ హసీనా గెలుపు లాంఛనమే • ఏకపక్ష పోకడలతో విమర్శలపాలు

ఎన్నికల 'చిత్రా'నికి పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో సర్వం సిద్ధమైంది. అక్కడ జనవరి 7న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. కాకపోతే వాటి ఫలితం మాత్రం ముందే తేలిపోయింది. విపక్ష పార్టీల బాయ్‌కాట్ నేపథ్యంలో పాలక అవామీ లీగ్ విజయం, పార్టీ అధినేత్రి షేక్ హసీనా ప్రధానిగా కొనసాగడమూ లాంఛనప్రాయమే కానుంది. హసీనా వంటి నియంత చేతిలో అధికారం ఉన్నంత వరకూ ఎన్నికలు పారదర్శకంగా జరిగే అవకాశం లేదని విపక్షాలన్నీ ఆరోపిస్తున్నాయి. ఆమె పదవి నుంచి తప్పుకుని తటస్థ మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని, దాని పర్యవేక్షణలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరపాలని అవి పలుమార్లు డిమాండ్ చేశాయి. వాటిని హసీనా నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. దాంతో ఎన్నికల బహిష్కరణ తప్ప తమకు మరో మార్గం లేదని విపక్షాలన్నీ ఇప్పటికే ప్రకటించాయి. బేగం ఖలీదా జియా సారథ్యంలోని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ), దాని భాగస్వాములతో పాటు ప్రధాన ప్రతిపక్ష పార్టీలన్నీ ఎన్నికలను బాయ్‌కాట్ చేశాయి. ఈ నేపథ్యంలో బ్యాలెట్ పత్రాలపై కేవలం అధికార అవామీ లీగ్, దాని భాగస్వామ్య పక్షాల అభ్యర్థులు, స్వతంత్రులు మాత్రమే ఉండనున్నారు!

ఇంటా బయటా విమర్శలే...

హసీనా పూర్తిగా ఏకపక్ష పోకడలు పోతున్నారన్న ఆరోపణలు ఇప్పటివి కావు. బంగ్లాదేశ్‌లో 2009 నుంచీ ఆమే ప్రధానిగా అధికారం చలాయిస్తున్నారు. ఆ క్రమంలో గత పదేళ్లుగా హసీనా కరడుగట్టిన నియంతగా మారారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అధికారాన్ని విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తున్నారని, విపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, కంట్లో నలుసుగా మారిన వారిని ఏకంగా చంపిస్తున్నారని మండిపడుతున్నాయి. అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకుని కోరుతున్నాయి. వాటి వాదనలోనూ వాస్తవం లేకపోలేదు. విపక్ష నేతలు, ముఖ్యంగా బీఎన్‌పీకి చెందిన వారు భారీగా జైలుపాలయ్యారు. కనీసం 20 మందికి పైగా తమ నేతలు, కార్యకర్తలు జైలుపాలైనట్టు బీఎన్‌పీ నాయకుడు అబ్దుల్ మొయీన్ ఖాన్ ఆరోపించారు. బీఎన్‌పీ చీఫ్ బేగం ఖలీదా జియా కూడా అవినీతి ఆరోపణలపై గృహ నిర్బంధంలో మగ్గుతున్నారు. 78 ఏళ్ల జియా ఆరోగ్యమూ బాగా క్షీణించింది. తన నియంతృత్వం, అణచివేత బయటి ప్రపంచానికి తెలియకుండా అడ్డుకునేందుకు మీడియాపైనా హసీనా ఉక్కుపాదం మోపారని విపక్షాలు దుయ్యబడుతున్నాయి. నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనిస్‌ను కేసులతో వేధించడం ఆపాలంటూ అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో పాటు ఏకంగా 170 మంది అంతర్జాతీయ ప్రముఖులు హసీనాకు గత ఆగస్టులో బహిరంగ లేఖ రాయాల్సి వచ్చింది! అయినా ఆర్థిక అవకతవకల కేసులో ఆయనకు తాజాగా ఆర్నెల్ల జైలు శిక్ష పడటం గమనార్హం! ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అణచివేత తీవ్రతరం కావడంతో నిర్బంధం నుంచి తప్పించుకునేందుకు బీఎన్‌పీతో పాటు పలు విపక్షాల నేతలు భారీగా అజ్ఞాతంలోకి వెళ్లారు!! జర్నలిస్టులతో పాటు ఎవరికీ బంగ్లాదేశ్‌లో సురక్షిత పరిస్థితులు లేవని ఐరాస స్వయంగా పేర్కొంది.

భిన్న పార్శ్వాలు

హసీనా ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ ప్రస్థానంలో భిన్న పార్శ్వాలున్నాయి. ఒకటి పుష్కర కాలంగా దేశం సాధించిన స్థిరమైన ఆర్థిక ప్రగతి. మరొకటి ప్రధానిగా ఆమె ఒంటెత్తు పోకడలు, విచ్చలవిడి అణచివేత విధానాలు. ప్రపంచంలోని అతి పేద దేశాల్లో ఒకటిగా చెప్పే బంగ్లాదేశ్ హసీనా హయాంలో చెప్పుకోదగ్గ ఆర్థిక ప్రగతి సాధించింది. ఆర్థిక వృద్ధిలో భారత్‌ను కూడా మించిపోయింది. దేశంలో గత పదేళ్లలో తలసరి ఆదాయం మూడింతలు పెరిగింది. గత 20 ఏళ్ల కాలంలో కనీసం 2.5 కోట్ల మంది పేదరికం నుంచి బయట పడ్డట్టు ప్రపంచ బ్యాంకు గణాంకాలే చెబుతున్నాయి. భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు హసీనా తెర తీశారు. దుస్తుల ఎగుమతిలో చైనా తర్వాత రెండో స్థానం బంగ్లాదేశ్‌దే. అయితే ఈ అభివృద్ధంతా ప్రజాస్వామిక విలువలకు పాతరేసిన ఫలితమేనన్న వాదన ఉంది. మరోవైపు కరోనా కల్లోలం బంగ్లాను అతలాకుతలం చేసింది. జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. ద్రవ్యోల్బణం 9.5 శాతం దాటింది! విదేశీ మారక నిల్వలు క్షీణిస్తున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

బంగ్లా పార్లమెంటులో బలాబలాలు (మొత్తం సీట్లు 350)	
అవామీ లీగ్	306
జాతీయ పార్టీ	27
బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ	6
ఇతరులు	11

నియంతగా మారిన హక్కుల నేత!

76 ఏళ్ల షేక్ హసీనా బంగ్లాదేశ్ జాతి పిత షేక్ ముజిబుర్ రెహ్మాన్ పెద్ద కూతురు. ఆయన రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారు. కరడుగట్టిన నియంతగా విమర్శల పాలవుతున్న ఆమె ఒకప్పుడు బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య మనుగడ కోసం ప్రముఖంగా గళమెత్తడం విశేషం! 1980ల్లో సైనిక పాలకుడు జనరల్ హుసేన్ మహమ్మద్ ఎర్షాద్ నియంతృత్వంపై ఖలీదా జియాతో పాటు అన్ని పార్టీల నేతలతోనూ కలిసి పోరాడారామె. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వారితో పాటు వీధి పోరాటాలూ చేశారు. 1996 ఎన్నికల్లో నెగ్గి తొలిసారిగా ప్రధాని పదవి చేపట్టారు. 2001లో ఖలీదా చేతిలో ఓటమి చవిచూశారు. 2006లో అవినీతి ఆరోపణలపై నిర్బంధం పాలయ్యారు. 2008లో జైలు నుంచి విడుదలయ్యాక ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు. నాటినుంచీ ప్రధానిగా కొనసాగుతున్నారు. ఆమె ఇప్పటికే మొత్తమ్మీద 19 ఏళ్లు ప్రధానిగా ఉన్నారు. ప్రపంచంలో అత్యధిక కాలం అధికారంలో ఉన్న మహిళా దేశాధినేతగా ఇప్పటికే రికార్డు లకెక్కారు.



కత్తిపోటు అనంతరం కుప్పకూలిన లీ జే మ్యుంగ్

దక్షిణ కొరియా ప్రతిపక్ష నేతకు కత్తిపోట్లు

సియోల్: దక్షిణ కొరియా ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీ నేత లీ జే మ్యుంగ్(59) కత్తిపోట్లకు గురయ్యారు. మంగళవారం ఆయన బుస్సాన్‌లోని ప్రతిపాదిత విమానాశ్రయం ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం మీడియా ప్రతినిధులు తదితరులతో మాట్లాడుతున్న సమయంలో ఓ ఆగంతకుడు కత్తితో లీ మెడపై బలంగా పొడిచాడు. తీవ్రంగా రక్తస్రావం అయ్యింది. చుట్టుపక్కల వారు, పోలీసులు నిందితుడి(67)ని పట్టుకున్నారు. బుసాన్‌లో చికిత్స అనంతరం విమానంలో సియోల్‌కు తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా లేదని అధికారులు చెబుతున్నప్పటికీ పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. ఘటనకు కారణాలపై దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు చెప్పారు. ఘటనపై దర్యాప్తుకు అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ఆదేశించారు.

వలసలను అడ్డుకున్నాం: సునాక్



లండన్: దేశంలోకి ఆశ్రయం పొందేందుకు వచ్చే వారి దరఖాస్తులను 2023 చివరి కల్లా పూర్తిగా పరిష్కరించాలన్న లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకున్నట్లు బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ చెప్పారు. చిన్న చిన్న పడవల ద్వారా దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారిని 36 శాతం మేర అడ్డుకున్నట్లు ఆయన తెలిపారు. ఇదే సమయంలో యూరప్‌లోకి వలసదారుల తాకిడి గణనీయంగా ఉందని వివరించారు. శరణార్థుల దరఖాస్తులను పరిష్కరించడం ద్వారా మిలియన్ల కొద్దీ ప్రజాధనం ఆదా అవుతోందని చెప్పారు. అక్రమ వలసల భారం నుంచి బ్రిటిష్ ప్రజలకు విముక్తి కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. 2022 చివరి నాటికి 92 వేల శరణార్థుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా అంతకు మించి 2023లో 1,12,000 దరఖాస్తులను పరిష్కరించినట్లు దేశ హోం శాఖ తెలిపింది. 2002 తర్వాత ఇదే అత్యధికమని వివరించింది.

మిలిటెంట్లు, బలగాల మధ్య కాల్పులు

ఇంఫాల్: మణిపూర్‌లోని మొరేహ్‌లో భద్రతా బలగాలు, మిలిటెంట్లకు మధ్య మరోసారి కాల్పులు చోటుచేసుకున్నాయి. సోమవారం పోలీసులపై దాడికి పాల్పడినట్లు అనుమానిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకునేందుకు మంగళవారం ఉదయం సరిహద్దులకు సమీపంలోని చవంగ్‌ఫై ఏరియాకు బలగాలు చేరుకున్నాయి. గాలింపు జరుపుతున్న బలగాలపైకి మిలిటెంట్లు కాల్పులకు తెగబడ్డారు. బలగాలు వెంటనే ఎదురుకాల్పులు జరిపాయి. కాల్పులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

రోజంతా అల్లాడించి...
రోడ్డెక్కిన ట్రక్కులు

పెట్రోల్ బంకులకు పోటెత్తిన జనం
- దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా క్యూలే
- నిత్యావసరాల సరఫరాకు తీవ్ర అంతరాయం
- చివరికి కేంద్రం హామీతో సమ్మె విరమణ

న్యూఢిల్లీ: హిట్ అండ్ రన్ కేసుల్లో ప్రతిపాదిత కఠిన చట్టాలను నిరసిస్తూ లారీలు, ట్రక్కుల డ్రైవర్లు చేపట్టిన సమ్మె మంగళవారం దేశవ్యాప్త గందరగోళానికి, అత్యవసర సేవల్లో తీవ్ర అంతరాయానికి దారి తీసింది. ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు కూడా సమ్మెలో పాల్గొనడంతో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత ఏర్పడింది. సమ్మె రోజుల పాటు కొనసాగుతుందన్న వార్తల నేపథ్యంలో దేశమంతటా వాహనదారులంతా పెట్రోల్ బంకులకు పోటెత్తారు. దాంతో ఎక్కడ చూసినా బంకుల ముందు భారీ క్యూ లైన్లే దర్శనమిచ్చాయి. ఇది నగరాలు, పట్టణాల్లో భారీ ట్రాఫిక్ జామ్‌లకు దారితీసింది. అత్యధిక బంకుల్లో చూస్తుండగానే నిల్వలు అడుగంటి నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. వంట గ్యాస్ సిలిండర్లతో పాటు కాయగూరలు, ఇతర నిత్యావసరాల సరఫరా కూడా నిలిచిపోయి జనం తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. కేంద్రంతో ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఏఐఎంటీసీ) జరిపిన చర్చలు ఎట్టకేలకు మంగళవారం రాత్రికి ఫలించాయి. కొత్త చట్టాన్ని ఇప్పటికిప్పుడే అమలు చేయడం లేదని కేంద్రం తరఫున హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా వారికి హామీ ఇచ్చారు. దానిపై ఏఐఎంటీసీతో లోతుగా చర్చించాకే నిర్ణయం తీసుకునేలా అంగీకారం కుదిరినట్టు సంఘం చైర్మన్ మల్కిత్‌సింగ్ బల్ తెలిపారు. దాంతో సమ్మె విరమిస్తున్నట్టు సంఘం ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సర్వత్రా నో స్టాక్...!

రోడ్డు ప్రమాద మృతికి బాధ్యుడైన వాహనదారు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా పారిపోయేతే పదేళ్ల దాకా కఠిన కారాగార శిక్ష, రూ.7 లక్షల దాకా జరిమానా విధించేలా భారత న్యాయ సంహితలో చేర్చిన సెక్షన్లపై లారీలు, ట్రక్కుల డ్రైవర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తుండటం తెలిసిందే. వాటి రద్దు డిమాండ్‌తో మహారాష్ట్ర తదితర చోట్ల సోమవారం నుంచే మూడు రోజుల సమ్మెకు దిగారు. అది మంగళవారాకల్లా దేశమంతటా విస్తరించింది. దాంతో పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులంతా ఒక్కసారిగా రోడ్డెక్కడంతో అన్ని రాష్ట్రాల్లోనూ పరిస్థితి చేయి దాటింది. పెట్రోల్ బంకులన్నీ జనంతో పోటెత్తి కన్పించాయి. కిలోమీటర్ల పొడవున వాహనదారులు బారులు తీరారు. నో స్టాక్ బోర్డు పెట్టి బంకులను మూసేయడం ఉద్రిక్తతకు, గొడవలకు దారి తీసింది. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. మరోవైపు డ్రైవర్లు కూడా తమ లారీలు, ట్రక్కులను హైవేలపై రోడ్డుకు అడ్డంగా పెట్టి వాహనాల రాకపోకలను కూడా అడ్డుకుంటూ కన్పించారు.



కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లాతో చర్చల అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఏఐఎంటీసీ బృందం

పింఛను నామినీలుగా ఉద్యోగినుల పిల్లలు

న్యూఢిల్లీ: భర్త నుంచి వేరుగా ఉండే మహిళా ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం కొత్త వెసులుబాటు కల్పించింది. కుటుంబ పింఛను కోసం నామినీలుగా ఇకపై తన పిల్లల పేర్లను పేర్కొనవచ్చని తెలిపింది. సెంట్రల్ సివిల్ సర్వీసెస్(పింఛను)నిబంధనలు–2021లోని 50వ క్లాజ్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి లేదా రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగి మరణించిన సందర్భాల్లో కుటుంబ పింఛను మంజూరవుతుందని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగి లేదా పింఛనుదారు మరణించినప్పుడు ఆ వ్యక్తి జీవిత భాగస్వామికి కుటుంబపింఛను అందుతుందని తెలిపింది. మరణించిన ప్రభుత్వ ఉద్యోగి లేదా పింఛనుదారు జీవిత భాగస్వామి కుటుంబ పింఛనుకు అనర్హులైనప్పుడు లేదా చనిపోయినప్పుడు కుటుంబ పింఛను ఇతర కుటుంబసభ్యులకు అందుతుందని వివరించింది. మహిళా ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబ పింఛనుకు నామినీలుగా భర్త కంటే ముందుగా సంతానాన్ని పేర్కొనేందుకు వీలు కల్పిస్తూ తాజాగా నిబంధనలను మార్చినట్లు కేంద్ర పింఛను, పింఛనుదారుల సంక్షేమ విభాగం పేర్కొంది. తాజా సవరణ.. మహిళా ప్రభుత్వోద్యోగి విడాకుల పిటిషన్, గృహ హింస కేసు, మహిళల రక్షణ చట్టం కింద కేసులను దాఖలు చేసిన అన్ని సందర్భాల్లో, ఆమె భర్త కంటే ముందు అర్హత ఉన్న బిడ్డకు కుటుంబ పెన్షన్‌ను పంపిణీ చేయడానికి అనుమతిస్తుందని విభాగం కార్యదర్శి వి శ్రీనివాస్ పీటీఐకి తెలిపారు.



టోక్యో విమానాశ్రయంలో ప్రమాదం అనంతరం అగ్నికీలల్లో చిక్కి బుగ్గవుతున్న విమానం

మంటల్లో విమానం!

టోక్యో ఎయిర్‌పోర్టులో కోస్ట్‌గార్డు విమానాన్ని ఢీకొట్టిన ప్రయాణికుల విమానం
- రన్‌వేపై ల్యాండ్ అవుతుండగా ప్రమాదం.. వెంటనే వ్యాపించిన మంటలు
- ప్రాణాలతో బయటపడిన 379 మంది ప్రయాణికులు
- కోస్ట్‌గార్డు విమానంలోని ఆరుగురు సిబ్బందిలో ఐదుగురు మృతి
- భూకంప బాధితుల కోసం సహాయక సామగ్రి తీసుకెళ్లకముందే దుర్ఘటన

టోక్యో: తీవ్ర భూకంపం ధాటికి పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం చోటుచేసుకోవడంతో పెనువిషాదంలో మునిగిపోయిన జపాన్‌లో మరో దుర్ఘటన జరిగింది. భూకంప బాధితుల కోసం సహాయక సామగ్రిని చేరవేయాల్సిన విమానం ప్రమాదంలో చిక్కుకొని ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. విమానాశ్రయం రన్‌వేపై ల్యాండ్ అవుతున్న విమానం మరో విమానాన్ని ఢీకొట్టింది. మొదటి విమానంలో ఉన్న 379 మంది క్షేమంగా ప్రాణాలతో బయటపడడంతో ఊరటనిచ్చింది. ఏమాత్రం ఆలస్యం జరిగినా ఊహించని ఉత్పాతమే జరిగేదని ప్రత్యక్షసాక్షులు చెప్పారు. రాజధాని టోక్యోలోని హనెడా ఎయిర్‌పోర్టు జపాన్‌లో అత్యంత రద్దీ విమానాశ్రయాల్లో ఒకటి. నూతన సంవత్సరం సెలవుల సందర్భంగా ప్రయాణికుల రాకపోకలతో మంగళవారం మరింత రద్దీగా మారింది. హొక్కైడోలోని షిన్ చిటోస్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన జపాన్ ఎయిర్‌లైన్స్ విమానం జేఏఎల్–516(ఎయిర్‌బస్ ఏ–350) హనెడా ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ఇందులో 12 మంది సిబ్బంది సహా మొత్తం 379 మంది ఉన్నారు. రన్‌వేపై దిగుతూ కుదుపులకు లోనైంది. రన్‌వేపై ల్యాండ్ అవుతూ, ఒక పక్కగా నిలిపి ఉన్న జపాన్ తీర రక్షక దళానికి చెందిన విమానం ఎంఏ–722ను అనూహ్యంగా ఢీకొట్టి కొద్దిదూరం దూసుకెళ్లి ఆగిపోయింది. క్షణాల వ్యవధిలోనే జేఏఎల్ విమానం రెక్క భాగంలో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన విమాన సిబ్బంది వెంటనే తలుపులు తెరిచి ప్రయాణికులకు బయటకు పంపించారు. మంటలు వేగంగా దూసుకొస్తున్నా లెక్క చేయకుండా ప్రయాణికులంతా బయటకు వచ్చారు. తర్వాత విమానం మొత్తం మంటల్లో చిక్కుకుంది. ఎయిర్‌పోర్టు ప్రాంగణమంతా పొగతో నిండిపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. విమానం నుంచి ప్రయాణికులను భద్రంగా బయటకు పంపించిన అందులోని సిబ్బందిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలన్న దానిపై వారికి శిక్షణ ఇచ్చినట్లు అధికారులు చెప్పారు.

'సాయం' అందించకుండానే...

ప్రమాదం జరిగిన వెంటనే తీర రక్షక దళం విమానం పైలట్ అక్కడి నుంచి పరారయ్యాడని జపాన్ కోస్ట్‌గార్డు అధికారులు చెప్పారు. ఈ విమానంలో ఉన్న ఆరుగురు కోస్ట్‌గార్డు సిబ్బందిలో ఐదుగురు మరణించారని స్థానిక మీడియా వెల్లడించింది. కోస్ట్‌గార్డు విమానం సహాయక సామగ్రితో జపాన్ పశ్చిమ తీరంలోని నిగాటాకు బయలుదేరాల్సి ఉంది. కానీ అక్కడి భూకంప బాధితులకు సామగ్రిని అందించకుండానే ప్రమాదం జరగడం, ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోవడం ఆవేదన కలిగిస్తోంది.

ఊపిరాడక నరకంలా అనిపించింది

జేఏఎల్–516 విమానంలో తనకు ఎదురైన భయానక అనుభవాన్ని 17 ఏళ్ల స్వీడి ఆంటోన్ డీబె మీడియాతో పంచుకున్నాడు. తొలుత ఏం జరిగిందో అర్థం కాలేదని, విమానం లోపలంతా దట్టమైన పొగ కమ్ముకుందని, ఊపిరాడక నరకంలా అనిపించిందని చెప్పాడు. సీట్లలో నుంచి కిందపడిపోయామని, ఎవరో ఎమర్జెన్సీ డోర్లు తెరవడంతో ప్రాణాలతో బయటపడ్డామని తెలిపాడు.

రెండు రోజుల్లో 155 ప్రకంపనలు

జపాన్‌లో 50 మందికి పైగా మృతి

వజిమ: జపాన్‌లో సోమ, మంగళవారం సంభవించిన వరుస ప్రకంపనలతో ప్రాణ, ఆస్తి నష్టం భారీగా సంభవించింది. రెండు రోజుల్లో మొత్తం 155 ప్రకంపనలు నమోదైనట్లు భూకంప విభాగం తెలిపింది. సోమవారం మధ్యాహ్నం సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.6గా నమోదు కావడంతో అధికారులు సునామీ హెచ్చరికలను జారీ చేశారు. మంగళవారం పశ్చిమ తీరంలోని ఇషికావ ప్రిఫెక్చర్‌లో భూకంప సంబంధిత ప్రమాద ఘటనల్లో 50 మందికి పైగా చనిపోగా మరో 16 మంది గాయపడ్డారు. పలు భవనాలు, వాహనాలు ధ్వంసం అయ్యాయి. విద్యుత్ వ్యవస్థలు దెబ్బతినడంతో సుమారు 33 వేల నివాసాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రధాన హైవేలు దెబ్బతిన్నాయి. దీంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. మళ్లీ భూ ప్రకంపనలు సంభవించే ప్రమాదమున్నందున ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు కోరారు. పశ్చిమ తీరంలోని హొన్షు దీవి నుంచి 97 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు షెల్టర్లలోకి తరలిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. జపాన్‌లో భూకంపం నేపథ్యంలో పొరుగునే ఉన్న రష్యా, దక్షిణ కొరియా, ఉత్తర కొరియాలు కూడా సునామీ హెచ్చరికలను జారీ చేశాయి.



జపాన్‌లోని వజిమలో కుప్పకూలిన భవనం

312కు చేరిన జేఎన్.1 వేరియంట్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ సబ్ వేరియంట్ జేఎన్.1 కేసులు ఇప్పటి వరకు 312 బయటపడ్డాయి. ఇందులో 47% కేసులు కేరళలోనే నమోదయ్యాయని ప్రభుత్వ ఆరోగ్య విభాగం ఇన్సాకాగ్ మంగళవారం తెలిపింది. మొత్తం పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ వేరియంట్ జాడలను గుర్తించామంది. కేరళలో 147, గోవాలో 51, గుజరాత్‌లో 34, మహారాష్ట్రలో 26, తమిళనాడులో 22, ఢిల్లీలో 16, కర్ణాటకలో 8, రాజస్తాన్‌లో 5, తెలంగాణలో రెండు, ఒడిశాలో ఒక కేసు ఈ వేరియంట్‌కు సంబంధించినవిగా నిర్ధారణైనట్లు వివరించింది.

రాష్ట్రాలతోనే దేశాభివృద్ధి

తమిళనాడులో ప్రధాని మోదీ పునరుద్ఘాటన



తిరుచిరాపల్లిలో చిన్నారులతో మాట్లాడుతున్న మోదీ

తిరుచిరాపల్లి/లక్షద్వీప్: రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం అనేది కేంద్ర ప్రభుత్వం విశ్వసించే విధానమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. రాష్ట్రాల అభివృద్ధి దేశాభివృద్ధిని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఆయన మంగళవారం తమిళనాడులో పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పౌర విమానయానం, ఓడ రేవులు, రైల్వే, హైవేలు, పెట్రోలియం, సహాయ వాయువు, అణు శక్తి, ఉన్నత విద్యకు సంబంధించిన రూ.20,140 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులను ప్రారంభించారు. వాటిని జాతికి అంకితం ఇచ్చారు. మరికొన్ని కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. తొలుత భారతీదాసన్ విశ్వవిద్యాలయం 38వ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం తిరుచిరాపల్లి అంతర్జాతీయ విమానాశ్రయంలో నూతన టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు. ఏడాది కాలంలో 40 మందికిపైగా కేంద్ర మంత్రులు తమిళనాడులో 400సార్లు పర్యటించారని చెప్పారు. తమిళనాడు అభివృద్ధితో ఇండియా అభివృద్ధి సాధిస్తుందన్నారు. దేశ విదేశాలతో బహుళ అనుసంధానం అభివృద్ధికి కీలక మార్గమని అన్నారు. దీనివల్ల కీలక రంగాల్లో పెట్టుబడులు, తద్వారా వ్యాపారం, వాణిజ్యం పెరుగుతాయని, ప్రజల జీవనం సులభతరం అవుతుందన్నారు. దేశాభివృద్ధిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి యువతకు ఇది మంచి సమయమని చెప్పారు. ఈ అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకోవాలన్నారు.

లక్షద్వీప్‌లో మోదీ..

రూ1.1,50 కోట్లకుపైగా విలువైన పలు జాతీయ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడానికి ప్రధాని మోదీ మంగళవారం లక్షద్వీప్‌కు చేరుకున్నారు. అగత్తి ఎయిర్‌పోర్టు వద్ద బహిరంగ సభలో ప్రసంగించారు. లక్షద్వీప్‌లో గత పదేళ్లలో ఎన్నో ప్రాజెక్టులను అమల్లోకి తీసుకొచ్చామని చెప్పారు. ఇక్కడి ద్వీపాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు.

కార్మికులకు డీఎంకే ఎంపీ క్షమాపణ

చెన్నై: ఉత్తరప్రదేశ్, బిహార్‌లకు చెందిన కార్మికులనుద్దేశించి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యల వివాదం ముదరడంతో డీఎంకే లోక్‌సభ ఎంపీ దయానిధి మారన్ క్షమాపణలు చెప్పారు. దయానిధి మారన్ చేసిన వ్యాఖ్యలతో కూడిన వీడియో ఒకటి తాజాగా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కొందరు ఆయన వ్యవహార శైలిని తీవ్రంగా తప్పుబట్టారు. దీంతో, ఎంపీ మారన్ మంగళవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో కార్మికులకు క్షమాపణలు చెప్పారు.

ఉక్రెయిన్‌పైకి 100 క్షిపణులు

కీవ్: రష్యా మంగళవారం ఉక్రెయిన్‌పైకి సుమారు 100 క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో అయిదుగురు చనిపోగా 100 మందికి పైగా గాయపడ్డారు. రాజధాని కీవ్‌పై జరిగిన దాడుల్లో నలుగురు చనిపోగా మరో 92 మంది వరకు గాయపడ్డారు. ఖార్కివ్‌పై జరిగిన దాడిలో ఒకరు మృతి చెందారు. రష్యా ప్రయోగించిన క్షిపణుల్లో హైపర్‌సోనిక్ కింజల్ రకానికి చెందినవి కూడా ఉన్నాయని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. అయితే, కీవ్‌పైకి వచ్చిన అన్నిటినీ క్షిపణి రక్షణ వ్యవస్థలు సమర్థంగా అడ్డుకున్నట్లు చెప్పారు.

సమాజంలో విభజనను పెంచుతోంది

బీజేపీపై సోనియా ధ్వజం



తిరువనంతపురం: భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు లౌకికవాదమే మూలస్తంభమని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ స్పష్టం చేశారు. అధికారంలో ఉన్న వ్యక్తులు లౌకికవాదం అనే పదాన్ని వ్యతిరేకిస్తున్నారని, తూలనాడుతున్నారని ఆరోపించారు. అసలు ఈ మాటే వారికి నచ్చడం లేదని ఆక్షేపించారు. ఈ పరిణామం వల్ల అంతిమంగా సమాజంలో 'విభజన' పెరిగిపోతోందని 'మనోరమ ఇయర్‌బుక్–2024'కు రాసిన వ్యాసంలో సోనియా ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పదవుల్లో కొనసాగుతున్న వ్యక్తులు ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నట్లు చెబుతూనే, ప్రజాస్వామ్య వ్యవస్థ రక్షణ కవచాలను బలహీనపరుస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం పరస్పరం లోతుగా అనుసంధానమైన ఉంటాయని తెలిపారు. ఈ రెండు పదాల గురించి సమగ్రంగా తెలుసుకుంటే భారతదేశ చరిత్రను, భూత, వర్తమాన, భవిష్యత్తు సవాళ్లను మరింత బాగా అర్థం చేసుకోవచ్చని వెల్లడించారు. సెక్యులరిజం గురించి రకరకాలుగా నిర్వచించవచ్చని పేర్కొన్నారు. భారత్‌కు సంబంధించినంత వరకు మహాత్మా గాంధీ బోధించిన 'సర్వధర్మ సమభావం' అనేది లౌకికవాదానికి సరైన అర్థం అవుతుందని సోనియా గాంధీ అభిప్రాయడ్డారు. అన్ని మతాల ఐక్యత గురించి గాంధీజి బోధించారని గుర్తుచేశారు.

మెగసెసె వాపస్ చేస్తా: సందీప్ పాండే

న్యూఢిల్లీ: గాజాపై ఇజ్రాయెల్ దాడులకు అమెరికా మద్దతు ఇస్తున్నందుకు నిరసనగా రామన్ మెగసెసె అవార్డును వెనక్కి ఇచ్చేయాలని నిర్ణయించుకున్నట్లు సామాజిక కార్యకర్త సందీప్ పాండే తెలిపారు. అమెరికా యూనివర్సిటీల నుంచి పొందిన రెండు డిగ్రీలను కూడా వదులుకోనున్నట్లు వివరించారు. రామన్ మెగసెసె అవార్డుతో అమెరికాకు చెందిన రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్, ఫోర్డ్ ఫౌండేషన్‌లతో సంబంధముండటం గమనార్హం. 'గాజాలోని 21 వేల మందికి పైగా పాలస్తీనా పౌరుల ఉసురుతీసిన ఇజ్రాయెల్‌కు అమెరికా వంతపాడటం మనస్తాపం కలిగించింది. అందుకే మెగసెసె అవార్డును వెనక్కి ఇచ్చేయాలని నిర్ణయించుకున్నా' అని ఆయన పీటీఐకి చెప్పారు.

డ్రోన్ దాడిలో హమాస్ అగ్ర నేత అరౌరీ మృతి

బీరుట్: లెబనాన్ రాజధాని బీరుట్ శివారులో జరిగిన డ్రోన్ దాడిలో హమాస్ మిలిటరీ విభాగం వ్యవస్థాపకుల్లో ఒకరైన సలేహ్ అరౌరీ మృతి చెందారు. మంగళవారం జరిగిన ఈ ఘటనలో మరో నలుగురు కూడా చనిపోయినట్లు హెజ్బొల్లా సారథ్యంలోని టీవీ తెలిపింది. వెస్ట్‌బ్యాంకులోని మిలిటెంట్లకు ఆయనే నాయకత్వం వహిస్తున్నారు. ఘటనపై ఇజ్రాయెల్ అధికారులు స్పందించలేదు. అరౌరీని చంపుతామని ఇజ్రాయెల్ ప్రకటించడం గమనార్హం.

సాక్షి కరీంనగర్

బుధవారం | 3 | జనవరి | 2024



బోనం మొక్కులు

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. ఇరుకైన ఆలయంలో నెత్తిన బోనాలతో ఇబ్బందులు పడ్డారు.



కన్నీరుపెట్టిన జగ్గారావుపల్లి

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతదేహం స్వగ్రామానికి చేరడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు అశ్రునయనాలతో అంత్యక్రియలు పూర్తిచేశారు.

8లో▸

గరిష్ఠం/కనిష్ఠం

30.0/18.0

వాతావరణం

పొద్దంతా పొడిగా ఉంటుంది. సాయంత్రం నుంచి చలిగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘ప్రజాపాలన దరఖాస్తులు కాలయాపనకే’



కరీంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఆరుగ్యారంటీల పథకం కాలయాపనకేనని, దరఖాస్తు ఫారంలో బ్యాంకు అకౌంట్ అడగకపోవడంలో ఆంతర్యమేమిటని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. మంగళవారం బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జతపర్చుతున్నారని, ప్రభుత్వం బ్యాంకు అకౌంట్ ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ఇప్పుడున్న డిజిటల్ యుగంలో ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం బ్యాంకు అకౌంట్ లేకుండా లబ్ధిదారులకు ఎలా సంక్షేమ పథకాల డబ్బులు చెల్లిస్తారని అన్నారు. ప్రభుత్వ తీరుతో ప్రజలు ఆగమవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, జక్కుల నాగరాజు, బైరం పద్మయ్య, హైమద్, దూలం సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



కొత్తపల్లి: కరీంనగర్ సర్కిల్‌లోని విద్యుత్‌శాఖ ఉద్యోగులంతా అంకితభావంతో పనిచేసి వినియోగదారులకు నిరంతర విద్యుత్‌ను అందించేందుకు కృషి చేయాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ పిలుపునిచ్చారు. కరీంనగర్ విద్యుత్ భవన్‌లోని ఆయన చాంబర్‌లో వివిధస్థాయిల అధికారులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు బొకేలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీఈలు విజేందర్‌రెడ్డి, రాజం, తిరుపతి, కాళిదాసు, గోపీకృష్ణ, చంద్రమౌళి, ఎస్ఏవో రాజేశం, పీవో బండారి చంద్రయ్య పాల్గొన్నారు.

పేషెంట్ల తరలింపుపై సీరియస్

సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్‌టౌన్: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి ప్రైవేటు ఆసుపత్రులకు పేషెంట్లను తరలించే అంశంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. ‘సాక్షి’లో గత నెల 20న ‘ఎమర్జెన్సీ పేషెంట్‌ను ఎత్తుకెళ్లడమే’ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి స్పందించారు. ప్రైవేటు వాహనాలు ఆసుపత్రి ఆవరణలోకి రాకుండా చర్యలు చేపట్టడంతో పాటు 24 గంటల పాటు పేషెంట్‌కేర్, సెక్యూరిటీగార్డు, ఆర్ఎంవో, పీఆర్‌వోలు పర్యవేక్షించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు ఆసుపత్రిలో పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

నాలుగో రోజు 50,325 అర్జీలు

కరీంనగర్ అర్బన్: ప్రజాపాలనకు అర్జీల జాతర వెల్లువెత్తుతోంది. ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా దరఖాస్తులను స్వీకరిస్తుండగా ప్రజలు బారులు తీరుతున్నారు. మంగళవారం జిల్లాలోని 55 గ్రామాలు, నగరంలోని 7 వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమం జరగగా 50,325 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు 201 గ్రామాల్లో ప్రజాపాలన జరగగా 2,57,914 నివాసాలను కవర్ చేయగా, మొత్తంగా 1,76,298 అర్జీలు వచ్చాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వివరించారు. గ్యారంటీలకు కాకుండా ఇతర అర్జీలు 10,524 రాగా మంగళవారం 6,237 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

జిల్లాలో నాలుగు కరోనా పాజిటివ్ కేసులు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో కరోనా కేసులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం అనుమానితుల నుంచి నమూనాలు తీసుకొని నిర్ధారణ కోసం ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించారు. నాలుగు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. పాజిటివ్ కేసుల్లో రేకుర్తికి చెందిన తల్లితో పాటు 18 నెలల బాబు, అదే గ్రామానికి చెందిన మరో మహిళకు, చిగురుమామిడికి చెందిన యువతి ఉన్నారు. గతనెల 25న రెండు పాజిటివ్ కేసులు నమోదు అయిన విషయం విధితమే. జిల్లాలో మొత్తం ఆరు కరోనా పాజిటివ్ యాక్టివ్‌లో ఉన్నాయి.

మంచు దుప్పటి



నగరాన్ని మంచుదుప్పటి కమ్మేసింది. కనుచూపుమేర కమ్ముకున్న పొగమంచు సిటీప్రజలను మంత్రముగ్ధులను చేస్తోంది. పొద్దున ఎనిమిది దాటినా మంచు తొలగకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. మంగళవారం ఉదయం మానేరుడ్యాం గేట్లు, తీగలవంతెన ప్రాంతాలు మంచుదుప్పట్లో ముసుగేసుకున్న దృశ్యాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

బంకుల్లో బారులు

కరీంనగర్ అర్బన్: సమయం మంగళవారం సాయంత్రం 5గంటలు. అప్పటివరకు పెట్రోల్ బంకులు సాధారణ స్థితిలో ఉండగా ఒక్కసారిగా వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ఆయిల్ ట్యాంకర్ల ఆపరేటర్లు సమ్మెలో ఉండగా ఇంధన సరఫరా నిలిచిపోయిందని సోషల్ మీడియాలో ప్రచారం జరగగా గందరగోళానికి దారి తీసింది. నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా పెట్రోల్ బంకులు వాహనాలతో నిండిపోగా పలుచోట్ల అరకిలోమీటర్ మేర వాహనాలు బారులు తీరాయి. చాలాచోట్ల బంకుల్లో ‘నోస్టాక్ బోర్డు’ కనిపించింది. ‘ట్యాంకర్ డ్రైవర్లు సమ్మె విరమించారు. పెట్రోల్, డీజిల్ సరఫరా యథావిధిగా జరుగుతుంది’ అని జిల్లా పౌరసరఫరాల అధికారి సురేశ్‌రెడ్డి వివరించారు.



కరీంనగర్‌లోని జిల్లాజైలు బంకు వద్ద మంగళవారం సాయంత్రం బారులుతీరిన వాహనదారులు

సర్కారు బడుల్లో స్మార్ట్ హాజరు

- ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా విద్యార్థుల నమోదు
- గురువులకు మినహాయింపు ఎందుకు?
- ఫలితాలు ఇవ్వని బయోమెట్రిక్ విధానం
- డుమ్మాలకు చెక్.. బోధనకు మెరుగు

కరీంనగర్ ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	టీచర్లు
కరీంనగర్	651	48,745	3,206
పెద్దపల్లి	592	46,241	2,209
సిరిసిల్ల	534	55,955	2,134
జగిత్యాల	783	49,946	1,403
మొత్తం	2,560	2,00,887	8,952



సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో యాప్‌లో విద్యార్థి హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరును పారదర్శకంగా నమోదు చేసే ప్రక్రియకు విద్యాశాఖ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. విద్యార్థుల హాజరును ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్ఏ) ద్వారా నమోదు చేస్తున్నారు. కాగా.. ఇదే విధానాన్ని ఉపాధ్యాయులకు మినహాయింపు దేనికనేది ప్రశ్నార్థకంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో బయోమెట్రిక్ ద్వారా ఉపాధ్యాయుల హాజరును నమోదు చేసిన ప్రభుత్వం కొంతకాలంగా సాంకేతిక సమస్యలను సాకుగా చూపి ఎత్తివేసింది. దీంతో కొందరు ఉపాధ్యాయులు పాఠశాలల సమయ వేళలు పాటించకపోవడం, శిక్షణల పేరిట ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

అవకతవకలకు చెక్

జిల్లా ప్రభుత్వ విభాగంలోని వివిధ యాజమాన్యాల్లో 2,560పాఠశాలలు ఉండగా.. 2,00,887మంది విద్యార్థులు చదువుతున్నారు. 8,952 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు మాత్రమే ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్ఏ)ను పాటిస్తున్నారు. యాప్‌లో మొదట విద్యార్థుల ఫొటోలు అప్‌లోడ్ చేసి, వారిఫేస్‌ను యాప్‌లో స్కాన్‌చేస్తారు. బయోమెట్రిక్ హాజరు విధానంతో సమయం ఎక్కువగా వృథా అవుతుండడంతో ఈ యాప్ ద్వారా విద్యార్థుల హాజరు నమోదు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని ప్రతీ పాఠశాలకు ఆండ్రాయిడ్ మొబైళ్లు, ట్యాబ్‌లు అందజేసింది. వీటి ద్వారా ఈ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నారు. తద్వారా విద్యార్థుల హాజరు సమాచారం మండల, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు క్షణాల్లో తెలిసిపోయే అవకాశం ఉంది. ఇదంతా బాగానే ఉండగా.. ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న బయోమెట్రిక్ విధానాన్ని పూర్తిగా ఎత్తివేసి విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ఏ అమలు చేయడంలో ప్రభుత్వ ఉద్దేశం ఏంటనేది అర్థంకాకుండా పోయింది.

ఫలితమివ్వని ‘బయోమెట్రిక్’

ప్రభుత్వ ఉపాధ్యాయులకు అమలు చేసిన బయోమెట్రిక్ విధానం ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. కొంత మంది ఉపాధ్యాయులు సాంకేతికత కారణాలతో బయోమెట్రిక్ యంత్రాలు మూలనపడేశారు. మరికొందరు మరమ్మతుల పేరుతో యంత్రాలను వాడకుండా పోయారు. దీంతో ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న బయోమెట్రిక్ విధానాన్ని కొంతకాలంగా నిలిపివేశారు. విద్యార్థులకు అమలు చేస్తున్న ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్ఏ)ను ఉపాధ్యాయులకు అమలు చేస్తే డుమ్మాలు తగ్గి, బోధన విధానం మెరుగు పడుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

అక్రమాలకు చెక్...

ఫేస్‌యాప్‌తో పాఠశాలల్లో అక్రమాలకు చెక్‌పడింది. ఈ విధానం ద్వారా ఎంతమంది విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారు. మధ్యాహ్నం ఎంత మందికి భోజనం పెట్టారనే వివరాలు కచ్చితంగా నమోదు అవుతాయి. ప్రస్తుతం చాలా పాఠశాలల్లో విద్యార్థులు హాజరుకాకపోయినా ఉపాధ్యాయులు హాజరు వేస్తున్నారు... అలా మధ్యాహ్న భోజనం బిల్లులు అదనంగా కాజేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, స్కాలర్‌షిప్‌లు వంటి విషయాల్లోనూ జరిగే అక్రమాలకు ఈ యాప్ ద్వారా అడ్డుకట్ట పడనుంది. పాఠశాలలకు డుమ్మాకొడుతున్నా ఉపాధ్యాయులకు సైతం ఈ యాప్ ద్వారా చెక్ పెట్టాలని విద్యాశాఖ యోచిస్తోంది.

కాంగ్రెస్‌కు టచ్‌లో కార్పొరేటర్లు

- మర్యాదపూర్వకం అంటూనే మంత్రి ‘పొన్నం’కు శుభాకాంక్షలు
- బల్దియాలో మారనున్న రాజకీయ సమీకరణలు



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన బీఆర్ఎస్ కార్పొరేటర్ పద్మ భర్త ఆకుల ప్రకాశ్

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ బల్దియాలో రాజకీయ సమీకరణలు మారనున్నాయి. పదేళ్ల సుదీర్ఘకాలం అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో, ఆ పార్టీ కరీంనగర్ నగరపాలకసంస్థలోనూ జీవం పోసుకుంటోంది. ఇప్పటివరకు ఒక్క కార్పొరేటర్ కూడా లేని కాంగ్రెస్‌కు త్వరలో భారీగా బలగం చేకూరే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌తో అంతర్గతంగా టచ్‌లో ఉండగా, కొంతమంది బహిరంగంగానే మర్యాదపూర్వకంగా మార్పు కోరుతున్నారు.

‘టచ్’లో కార్పొరేటర్లు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికి, నగరపాలకసంస్థలో మాత్రం ఆ పార్టీకి ప్రాతినిథ్యం లేదు. అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో గత మున్సిపల్ ఎన్నికల్లో నగరంలోని 60 డివిజన్లలో ఒక్కసీటు కూడా గెలుచుకోలేకపోయింది. ఇప్పుడు ఏకంగా రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ కార్పొరేటర్లు కొంతమంది కాంగ్రెస్ వైపు దృష్టి సారించారు. ముందుగా బెర్త్‌ఖాయం చేసుకొనే పనిలో పడ్డారు. పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్ టచ్‌లోకి వెళ్లారనే విశ్వసనీయ ప్రచారం బల్దియాలో సాగుతోంది. ఇప్పటికే 17వ డివిజన్ కార్పొరేటర్ కోల భాగ్యలక్ష్మి ప్రశాంత్ బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. 7వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ ఆకుల పద్మ ప్రకాశ్ సైతం అదే బాటలో నడుస్తున్నట్లు సమాచారం. నూతన సంవత్సరం సందర్భంగా ఆకుల ప్రకాశ్ హైదరాబాద్‌లో పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

‘పొన్నం’దే ఫైనల్

స్థానిక రాజకీయ పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరికలపై గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు ఆయనతో టచ్‌లో ఉండగా, ఆయన ఇంకా స్పష్టత ఇవ్వలేదని సమాచారం. చేరికలపై ఆయన సుముఖంగానే ఉన్నట్లు మంత్రిని కలిసి వచ్చిన నాయకులు చెబుతున్నారు. త్వరలో వచ్చే లోకసభ ఎన్నికలు, ఏడాదిలో రానున్న నగరపాలకసంస్థ ఎన్నికల్లో పార్టీని విజయం వైపు నడిపించాలంటే క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఏదేమైనా రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరగా, అసంతృప్త నేతలు పార్టీ మార్పు కోరుతుండడం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

2020లో పార్టీల గెలుపు

టీఆర్ఎస్	33
బీజేపీ	13
ఎంఐఎం	06
బీఆర్ఎస్ రెబల్స్	03
స్వతంత్రులు	05
మొత్తం	60
బల్దియాలో ప్రస్తుత బలాబలాలు	
బీఆర్ఎస్	44
బీజేపీ	09
ఎంఐఎం	07

సమస్యాత్మక నియోజకవర్గాలపై దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

- ఎంపీ ఎన్నికల క్రమంలో ఇంటెలిజెన్స్ కమిటీ
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల క్రమంలో ఎన్నికల సంఘం జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ ఏర్పాటు చేసిందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం ఇతర వస్తువుల పంపిణీ పట్టివేతకు సంబంధించిన సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో జిల్లాస్థాయి ఇంటెలిజెన్స్ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీలో రెవెన్యూశాఖతో పాటు పోలీస్, ఐటీ, జీఎస్టీ, బ్యాంకులకు చెందిన నిర్దేశిత అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. నివేదిక ఆధారంగానే జిల్లాలోని సున్నితమైన వ్యయ అసెంబ్లీ నియోజకవర్గాలు, ప్రాంతాలను ఎన్నికల సంఘం గుర్తించి తదనుగుణంగానే ప్రత్యేకంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఆదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్ కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు, ఏసీపీ పి.కిష్టయ్య, ఇన్‌కమ్‌టాక్స్ అధికారి ఆర్.రాజేశ్, జీఎస్టీ అధికారి వి.మదనయ్య, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు డిజిటలైజేషన్ చేయాలి

మానకొండూర్: ప్రజాపాలన దరఖాస్తులు డిజిటలైజేషన్ చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మానకొండూర్ మండలం కల్లెడ గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. దరఖాస్తులను రోజువారీగా డిజిటలైజేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకుంటున్న వారికి రసీదు ఇవ్వాలని సూచించారు. దరఖాస్తుదారు కిరాయి ఇంట్లో నివాసం ఉంటున్నట్లయితే ఆ వివరాలు కూడా నమోదు చేయాలన్నారు. మానకొండూర్ తహసీల్దార్ రాజు, ఆర్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

కష్టపడ్డ వారికే ‘స్థానిక’ టికెట్లు

- పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో బీజేపీని గెలిపించండి
- త్వరలో 20వేల మందితో క్షేత్రస్థాయి కార్యకర్తల సమ్మేళనం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్



పద్మశాలీల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ బండి సంజయ్ కుమార్ తదితరులు

కరీంనగర్‌టౌన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల ఫలితాల ప్రభావం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ఉంటుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. దీన్నిదృష్టిలో ఉంచుకుని ఎంపీ ఎన్నికల్లో బీజేపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేయడంతోపాటు గ్రామ, మండలస్థాయిలో వచ్చే ఫలితాల ఆధారంగా స్థానికసంస్థల్లో టికెట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం కరీంనగర్‌లోని శుభ మంగళగార్డెన్స్‌లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బీజేపీ మండలాధ్యక్షులు, ఇన్‌చార్జీల సమావేశానికి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం పార్టీ క్యాడర్ పెరిగిందని, రెట్టింపు మెజారిటీతో అభ్యర్థిని గెలిపించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎన్నికల్లో మండలాధ్యక్షులు, ఇన్‌చార్జీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పార్టీలో ఒకరిద్దరు నాయకులు నష్టం చేస్తున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. డాక్టర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో 50శాతానికి పైగా ఓట్లు సాధించడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని, బండి సంజయ్ ఈసారి గెలిస్తే కేంద్ర మంత్రి అయ్యే అవకాశాలున్నాయని తెలిపారు. సీహెచ్.విఠల్ మాట్లాడుతూ... బండి సంజయ్‌ను ఓడించేందుకు పెద్ద ఎత్తున కుట్రలు జరుగుతున్నాయని, గత ఎన్నికల్లో కేసీఆర్ వందలు కోట్లు ఖర్చు పెట్టాడని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మ జయశ్రీ, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు జి.క్రిష్ణారెడ్డి, ప్రతాప రామకృష్ణ, ఇన్‌చార్జీలు మీసాల చంద్రయ్య, మోహన్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

త్వరలో కరీంనగర్– హసన్‌పర్తి రైల్వేలైన్ పనులు

కరీంనగర్– హసన్‌పర్తి రైల్వేలైన్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని ఎంపీ బండి సంజయ్ కుమార్ తెలిపారు. నగరంలోని పద్మశాలీ భవన్‌లో సంఘం 2024 క్యాలెండర్లను ఆవిష్కరించారు. ప్రజల కోరిక మేరకు కరీంనగర్– హసన్‌పర్తి కొత్త రైల్వేలైన్ పనులు త్వరలో ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు. దేశం సురక్షితంగా ఉండాలంటే బీజేపీ గెలుపు అనివార్యమని సూచించారు.

హక్కులు సాధించుకుందాం

- ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు కోల్పోయిన హక్కులను సాధించుకుందామని ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ నాయకులు అన్నారు. మంగళవారం ఐఎన్‌టీయూసీ అనుబంధ ఎస్‌డబ్ల్యూయూ రీజినల్ విస్తృతస్థాయి సమావేశం నగరంలోని డీసీసీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2017, 2021 పేస్కేల్స్, 2013 పేస్కేల్ ఏరియర్స్ ఇప్పించాలని కోరారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని రీజియన్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నకున్నారు.అధ్యక్షుడిగా ఎస్.కె.రాజు, కార్యదర్శిగా టీఆర్.రెడ్డిని ఏకగ్రీవం చేశారు. ఎస్‌డబ్ల్యూయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్, వైస్ చైర్మన్ జక్కుల మల్లేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

రేపు లూయిస్ బ్రెయిలీ జయంతి

కరీంనగర్: లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలు గురువారం ఉదయం 11గంటలకు శాతవాహన యూనివర్సిటీలోని లూయి బ్రెయిలీ విగ్రహం వద్ద నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి సంక్షేమశాఖ అధికారి ఎం.సరస్వతి తెలిపారు. జిల్లాలో వివిధ ప్రభుత్వశాఖల్లో విధులు నిర్వహిస్తున్న అంధ ఉద్యోగులకు ‘ఆన్‌డ్యూటీ’ సౌకర్యం కలదని వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

హ్యాపీ న్యూ ఇయర్ సర్..

కరీంనగర్ అర్బన్: ఆడిట్‌శాఖ రాష్ట్ర సంచాలకుడు మార్తినేని వెంకటేశ్వరరావుకు టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం డైరెక్టర్‌ను ఆడిట్‌శాఖ ఉద్యోగుల సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేశారు. రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పోరిక రామును కలిసి పూలబొకే అందజేశారు. అనంతరం ఆడిట్ రాష్ట్ర సంచాలకుడు స్టేట్ ఆడిట్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ స్టేట్ ఆడిట్ రాజ్ కుమార్, సహాయ ఆడిట్ అధికారి సీహెచ్ జోయల్, రాజేశ్వరరావు, వంశీ, పవన్, రవిచంద్ర ఉన్నారు.



రాష్ట్ర సంచాలకుడితో శ్రీనివాస్‌రెడ్డి

క్లుప్తంగా

8న రేకుర్తికి కంటి వైద్య నిపుణుల రాక

కొత్తపల్లి(కరీంనగర్): రేకుర్తిలోని డా.మాడేకర్ లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రికి ఈ నెల 8న మెల్ల కన్ను వైద్య నిపుణురాలు తులసి, రెటీనా స్పెషలిస్ట్ పావని రెడ్డి వస్తున్నారని ఆస్పత్రి చారిటబుల్ ట్రస్టు సభ్యుడు కోల అన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మెల్లకన్ను, చిన్న పిల్లల్లో కంటి సమస్యలు ఉన్నవారు, మోతె బిందుకు సంబంధించిన చికిత్స అవసరమైన వారు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంప్రదించాలన్నారు. వివరాలకు 76739 83940 ఫోన్ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

వ్యక్తి బలవన్మరణం

మేడిపల్లి(జగిత్యాల): మండలంలోని కొండాపూర్‌కు చెందిన బావు రవి(40) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. రవి మద్యానికి బానిసయ్యాడు. ఆరోగ్యం క్షీణించడంతో పలు ఆస్పత్రులకు వెళ్లి, చికిత్స పొందాడు. అయినా నయం కాకపోవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది, మంగళవారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంరాజు తెలిపారు.

లింగంపేటలో మహిళ..

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని లింగంపేటకు చెందిన మామిడిపల్లి సత్తమ్మ (40) ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల పట్టణ ఏఎస్సై వేణురావు వివరాల ప్రకారం.. సత్తవ్వకు కొంతకాలంగా మానసిక స్థితి సరిగా ఉండటం లేదు. దీనికితోడు అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. మృతురాలి భర్త తుక్కరాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

డెంగీతో వివాహిత మృతి



సౌమ్య (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని దూలూర్‌లో పల్లి సౌమ్య(24) డెంగీతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. మేడిపెల్లి మండలంలోని కల్వకోటకు చెందిన శ్రీకాంత్‌తో సౌమ్య వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. శ్రీకాంత్ గల్ఫ్ వెళ్లడంతో ఆమె దూలూర్‌లోని తల్లిగారింట్లో ఉంటోంది. 5 రోజులుగా జ్వరంతో బాధ పడుతుంటే కుటుంబసభ్యులు కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. సోమవారం పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, సౌమ్యకు డెంగీ జ్వరంగా నిర్ధారించారు. ఆమె అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



చందు మృతదేహం

రామగుండం: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన నందవరపు చందు (53) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి చందు ద్విచక్రవాహనంపై వెళ్తూ బీ–థర్మల్ ఎదుట వాహనం అదుపుతప్పడంతో కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం ఎస్సై వెంకట్ తెలిపారు.

కన్నీరు పెట్టిన జగ్గారావుపల్లి

- స్వగ్రామం చేరిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతదేహం
- గుండెలవిసేలా రోదించిన కుటుంబసభ్యులు
- సీఐఎస్ఎఫ్ అధికారుల గౌరవ వందనం
- అశ్రునయనాల మధ్య శివకృష్ణారెడ్డి అంత్యక్రియలు



పాడె మోస్తున్న ఎమ్మెల్యే సత్యం



శివకృష్ణారెడ్డి మృతదేహానికి పూలమాల వేస్తున్న సీఐఎస్ఎఫ్ అధికారి

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని జగ్గారావుపల్లికి చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చాడ శివకృష్ణారెడ్డి(23) మృతదేహం మంగళవారం స్వగ్రామం చేరింది. అంబులెన్స్ కొదురుపాకకు రాగానే దారి పొడవునా జగ్గారావుపల్లి వరకు పలు గ్రామాల ప్రజలు జాతీయ జెండాలు పట్టుకొని, సెల్యూట్ చేశారు. శవపేటిక ఇంటికి చేరడంతో శివకృష్ణారెడ్డి తల్లిదండ్రులు భాగ్యమ్మ, గోపాల్‌రెడ్డి, సోదరుడు గంగారెడ్డి, సోదరి గౌతమి, బంధువుల రోదనలు మిన్నంటాయి. కొడుకా నాతోనే ఉంటానంటివి కదరా అంటూ భాగ్యమ్మ రోదించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

పాడెమోసిన ఎమ్మెల్యే సత్యం

శివకృష్ణారెడ్డి అంతిమయాత్రలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని, పాడె మోశారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

యూనిఫాం, జెండా అందజేత

శివకృష్ణారెడ్డి మృతదేహంపై జైపూర్ డియోలి ఆరో రిజర్వ్‌డ్ బెటాలియన్ సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ నితినేశ్‌కుమార్, కమాండెంట్ ఏకే.ఆశీశ్‌కుమార్ కుందాని, ఇన్‌స్పెక్టర్ కె.రామచంద్ర, సిబ్బంది జాతీయ జెండా కప్పి, గౌరవ వందనం చేశారు. శివకృష్ణారెడ్డి యూనిఫాం, మృతదేహంపై కప్పిన జెండాను గోపాల్‌రెడ్డికి అందజేశారు. సీఐఎస్ఎఫ్ తరఫున అంత్యక్రియల నిమిత్తం రూ.25 వేలు అందించారు.

తనయుడి చితికి నిప్పంటించిన తండ్రి

శివకృష్ణారెడ్డి చితికి అతని తండ్రి గోపాల్‌రెడ్డి నిప్పంటించారు. తమ వ్యవసాయ భూమిలోనే అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న కరీంనగర్ వన్‌టౌన్ ఏసీపీ నరేందర్



అరెస్టు చూపుతున్న గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని పవర్ కాలనీలో ఉండే వంచర్ల గంగాధర్‌రావు(36) హత్య కేసులో నిందితుడు చోడ రమేశ్‌ను అరెస్టు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 31న జరిగిన గంగాధర్‌రావు, మేస్త్రీ పని చేసే రమేశ్‌ల మధ్య డబ్బుల విషయంలో గొడవ జరిగింది. మాటామాటా పెరిగి, రమేశ్ గంగాధర్‌రావుపై రాడ్డుతో దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు. రమేశ్‌ను మంగళవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడు..

కరీంనగర్ క్రైం: పార్కింగ్ చేసిన వాహనంపై పెట్టిన కెమెరా, సామగ్రి బ్యాగును చోరీ చేసిన కేసులో నిందితుడిని కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేసి, వివరాలు వెల్లడించారు. గత నెల 30న ఓ మీడియా సంస్థకు చెందిన జర్నలిస్టు కలెక్టరేట్ రోడ్డులో పార్కింగ్ చేసిన బైక్‌పై కెమెరా, సామగ్రి ఉన్న బ్యాగు పెట్టాడు. దాన్ని కట్టరాంపూర్‌కు చెందిన జునుగారి శేఖర్ ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలించారు. మంగళవారం సాయంత్రం అంబేడ్కర్ స్టేడియం వద్ద అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.2,55,500 విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిపై గతంలో వన్‌టౌన్ పరిధిలో 7 కేసులు నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు.

హోటల్‌పై దాడి ఘటనలో ఐదుగురు..

జమ్మికుంట(హుజూరాబాద్): ఓ బిర్యానీ హోటల్‌పై దాడి చేసిన ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. న్యూ ఇయర్ సందర్భంగా సోమవారం తెల్లవారుజామున పుప్పాల అరవింద్, గుడికందుల రాజు, పొనగంటి హరీశ్, పూరెల్ల సాగర్, పొనగంటి అనిల్ జమ్మికుంట పట్టణంలోని కేఎస్ బిర్యానీ హోటల్‌కు వెళ్లారు. సిబ్బందిపై దాడి చేసి, లోపల ఫర్నిచర్ ధ్వంసం చేశారు. హోటల్ యాజమాని చిన్నాల శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమేశ్ తెలిపారు. నిందితులను మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాజన్నపేటకు చెందిన మస్కారి రంజిత్‌కుమార్ అనే వ్యక్తిపై దాడిచేసిన ఘటనలో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. రంజిత్‌కుమార్ స్థానికంగా టెంట్‌హౌజ్ నడుపుతున్నాడు. టెంట్‌హౌజ్‌కు సంబంధించిన సామన్లను అదే గ్రామానికి చెందిన సుధమల్ల సుదర్శన్ ఇంటిని కిరాయికి తీసుకొని వాటిని ఫంక్షన్లకు కిరాయికి ఇస్తుంటాడు. అయితే నాలుగు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన రెడ్డిమల్ల సత్యనారాయణ టెంట్‌హౌజ్ పరిసరాలను శుభ్రం చేయాలని రంజిత్‌కుమార్‌కు తెలపగా వారంరోజుల్లో పరిసరాలను శుభ్రం చేస్తానని చెప్పాడు. ఈ క్రమంలోనే సత్యనారాయణతోపాటు అతని తండ్రి రెడ్డిమల్ల ప్రకాశ్ ఈనెల 1న రంజిత్‌కుమార్‌పై దాడిచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిప్పంటించుకొని మహిళ ఆత్మహత్య



వాసంతి శెట్టి (ఫైల్)

కరీంనగర్‌క్రైం: మానసిక పరిస్థితి సరిగా లేని ఓ మహిళ నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. నగరంలోని ముకరాంపురకు చెందిన ఓ ప్రముఖ హోటల్ యజమాని భార్య మందాడి వాసంతి శెట్టి(61) కొన్ని రోజులుగా మానసిక వ్యాధితోపాటు పలు అనారోగ్య సమస్యలతో బాధ పడుతోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, మంగళవారం ఉదయం 11 గంటలకు ఇంట్లోని కిచెన్‌లో చీరకు నిప్పంటించుకుంది. కుటుంబసభ్యులు, పనివారు ఇంట్లో నుంచి పొగ రావడం గమనించి, లోపలికి పరిగెత్తారు. కిచెన్ లోపలివైపు గడియపెట్టి ఉండటంతో తలుపులు పగలగొట్టారు. బాధితురాలిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. వాసంతి శెట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు శివరాం శెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్ తెలిపారు.

గోవును వధించిన దుండగులు



రోదిస్తున్న కుటుంబసభ్యులు

శంకరపట్నం(మానకొండూర్): గోవును వధించిన ఘటన శంకరపట్నం మండలంలోని మొలంగూర్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గాజుల పద్మ, కుమారస్వామి కుటుంబసభ్యులు ఓ గోవును పెంచుకుంటున్నారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాన్ని గ్రామ చివరన నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, వధించారు. గోవు కాలును మంగళవారం ఓ కుక్క తీసుకువచ్చి, కుమారస్వామి ఇంటి పరిసరాల్లో వేసింది. అది తాము పెంచుకుంటున్న గోవుదేనని నిర్ధారించుకున్న ఆ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- పట్టుకొని ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు



చికిత్స పొందుతున్న శ్రీకాంత్

సిరిసిల్లటౌన్: 'నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను.. ఇందుకు ఆ ముగ్గురు కారణం అంటూ ఓ యువకుడు రాసిన సూసైడ్ నోట్ సిరిసిల్లలో సోమవారం కలకలం సృష్టించింది. కాగా, బాధితుడిని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణానికి చెందిన మిట్టపల్లి శ్రీకాంత్ గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఓ ప్రముఖ వ్యక్తికి పీఆర్‌వోగా ఉన్నాడు. రూ.లక్ష మాట్లాడుకొని, తన స్నేహితులతో కలిసి సదరు వ్యక్తికి ఎన్నికల్లో పని చేశాడు. కానీ, ఆయన ఇప్పటివరకు ఆ డబ్బులను చెల్లించకపోవడంతో శ్రీకాంత్ మనస్తాపానికి గురయ్యాడు. పలు మీడియా ప్రతినిధులకు తాను సూసైడ్ చేసుకుంటున్నానంటూ నోట్‌ను వాట్సాప్ ద్వారా పంపించాడు. దీనిపై 'సాక్షి' దినపత్రికలో మంగళవారం వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన టౌన్ సీఐ ఉపేందర్, పోలీసులు రంగంలోకి దిగి, ఫోన్ నంబర్ ఆధారంగా శ్రీకాంత్‌ను పట్టుకున్నారు. అప్పటికే పలు ట్యాబ్లెట్లు మింగి, అపస్మారక స్థితికి చేరుకున్న అతన్ని జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. శ్రీకాంత్ థైరాయిడ్‌కు సంబంధించిన ట్యాబ్లెట్లు మింగినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

సిరిసిల్లక్రైం: మూడేళ్ల క్రితం కుమారుడు మృతిచెందడంతో మానసికంగా కుంగిపోయి తాగుడుకు బానిసైన వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం రాజీవ్‌నగర్‌కు చెందిన వోడ్నాల వామేశ్వర్ (55) కుమారుడు మూడేళ్ల క్రితం ప్రమాదంలో చనిపోయాడు. దీంతో వామేశ్వర్ మానసికస్థితిని కోల్పోయాడు. ఏ పని చేయకుండా తాగుడుకు బానిసగా మారాడు. ఈ క్రమంలో మంగళవారం సిరిసిల్ల కొత్తచెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. చెరువు వాచ్‌మెన్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కిరాణా దుకాణంలో షార్ట్‌సర్క్యూట్



కాలిపోయిన సామగ్రి

మల్లాపూర్(కోరుట్ల): మండల కేంద్రంలోని ఓ కిరాణా దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి, సామగ్రి దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. మల్లాపూర్‌కు చెందిన కస్తూరి సంతోష్ మంగళవారం మధ్యాహ్నం దుకాణాన్ని మూసివేసి, భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి, మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ రావడంతో సమీపంలోని దుకాణదారులు సంతోష్‌కు సమాచారం ఇచ్చారు. అతను వెంటనే షాపు వద్దకు వచ్చి, నీళ్లు చల్లి, మంటలు ఆర్పాడు. ఈ ఘటనలో రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు కిరాణా దుకాణాన్ని పరిశీలించారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం, విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిహారం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కాంక్రీట్ మిక్సింగ్ మిల్లర్ చోరీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారు రంగంపల్లిలో సిమెంట్ కాంక్రీట్ మిక్సింగ్ మిల్లర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు చెలుకల మల్లేశం తెలిపాడు. ఈ మేరకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దకల్వలకు చెందిన కల్వల రాజేశం మిల్లర్‌ను అద్దెకు తీసుకువచ్చి, సోమవారం రాత్రి మిక్సింగ్ పని పూర్తయిన తర్వాత ఇంటి ముందు నిలిపి ఉంచానన్నారు. తెల్లారేసరికి కనిపించలేదని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

మహిళా నేతతో ఎమ్మెల్యే అసభ్య ప్రవర్తన

- మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలోనే ఘటన



న్యూ ఇయర్ వేడుకల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి, మహిళా నేత

కరీంనగర్: కరీంనగర్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నూతన సంవత్సర వేడుకలపై నెటిజన్లు మండిపడుతున్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వేడుకల్లో పాల్గొన్న మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించారంటూ పలు వీడియోలు వైరల్ అవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయం (ఇందిరాభవన్)లో గత నెల 31న న్యూ ఇయర్ వేడుకలను పార్టీ నిర్వహించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ ఓ మహిళా నేత ముఖానికి కేక్ పూసేందుకు పలుమార్లు ప్రయత్నించారు. ఆ తర్వాత అందరూ డాన్స్ చేస్తుండగా అదే మహిళా నేతను పలుమార్లు తనతో కలిసి డాన్స్ చేయాలంటూ ఎమ్మెల్యే బలవంతం చేసినట్లు వీడియోలో ఉంది. ఈ రెండు సందర్భాల్లోనూ ఆమె ఇబ్బంది పడుతున్నట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆ సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లాస్థాయి నేతలంతా పక్కనే ఉండటం గమనార్హం. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

వక్రభాష్యం తగదు.. ఆమె సోదరిలాంటిది

న్యూ ఇయర్ వేడుకల్లో పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమాన్ని కొంతమంది కావాలనే వక్రీకరిస్తున్నారని ఎమ్మెల్యే సత్యనారాయణ తెలిపారు. ఆమె తన సోదరిలాంటిది, ఏటా తనకు రాఖీ కడుతుందని పేర్కొన్నారు. సోదరిగా భావించే వేడుకల్లో పాల్గొన్నామని, అబద్ధపు ప్రచారాన్ని ఖండిస్తున్నామని తెలిపారు.

బిర్యానీ తినొస్తూ.. అనంతలోకాలకు

- బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం
- న్యూ ఇయర్ రోజు అల్లీపూర్‌లో విషాదం



మారుతి (ఫైల్)

రాయికల్(జగిత్యాల): బైక్ అదుపుతప్పి, షట్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. రాయికల్ మండలంలోని అల్లీపూర్‌కు చెందిన దాసరి మారుతి(24), నరేశ్ స్నేహితులు. సోమవారం న్యూ ఇయర్ సందర్భంగా గ్రామంలో దావత్ చేసుకున్నారు. తర్వాత ద్విచక్రవాహనంపై కోరుట్లలోని ఓ బిర్యానీ సెంటర్‌కు వెళ్లి, బిర్యానీ తిన్నారు. తిరిగి వస్తుండగా రాయికల్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి, పక్కనే ఉన్న షట్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మారుతి తలకు బలమైన గాయాలై, అక్కడికక్కడే మృతిచెందాడు. నరేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. నరేశ్‌కు తల్లిదండ్రులు, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. అతని మృతి విషయం తెలిసి, కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుని తండ్రి రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈ సంఘటనతో కొత్త సంవత్సరం రోజు గ్రామంలో విషాదం నెలకొంది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు.

బైక్ అదుపుతప్పి.. బావిలో పడి

- పసునూర్‌కు చెందిన యువకుడి మృతి
- రెండు రోజుల తర్వాత మృతదేహం వెలికితీత



అభిలాశ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

కథలాపూర్(వేములవాడ): బైక్ అదుపుతప్పి, బావిలో పడిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. రెండు రోజుల తర్వాత ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమారం మండలంలోని పసునూర్‌కు చెందిన బెజ్జంకి అభిలాశ్(21) గత నెల 31న తన స్నేహితుడిని పక్క గ్రామమైన రాజలింగంపేటలో బైక్‌పై దించి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అక్కడి నుంచి కోరుట్ల వెళ్తున్నట్లు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. కానీ, కథలాపూర్ మండలంలోని గంభీర్‌పూర్ శివారులో బైక్ అదుపుతప్పి, రోడ్డు పక్కనున్న బావిలో పడిపోయింది. అభిలాశ్ నీటిలో మునిగి, ఊపిరాడక మృతిచెందాడు. అతను తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు రెండు రోజులు వెతికారు. మంగళవారం గంభీర్‌పూర్‌కు చెందిన పలువురు బావిలో మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, కథలాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అభిలాశ్ మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి బలవన్మరణం



ఇబ్రహీం మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేశ్

గంభీరావుపేట(సిరిసిల్ల): అనారోగ్య కారణాలతో గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన ఇబ్రహీం(55) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ఇబ్రహీం గతంలో గేదెల కొనుగోలు, విక్రయించడం చేసేవాడు. నాలుగేళ్ల క్రితం అతనికి పక్షవాతం వచ్చింది. ఆరోగ్యం సహకరించకపోవడంతో తరచూ చనిపోతానంటూ కుటుంబసభ్యుల ఎదుట బాధపడేవాడు. ఈ క్రమంలో ఇటీవల అతని భార్య పిల్లలను తీసుకొని, పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తనను ఎవరూ చూసుకోవడం లేదని, ఆరోగ్యం సహకరించడం లేదని ఆవేదనకు గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది, మంగళవారం స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి జహెరాబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ పేర్కొన్నారు.

జగదేవ్‌పేట జీపీ కార్యదర్శి సస్పెన్షన్

జగిత్యాల: వెల్గటూర్ మండలంలోని జగదేవ్‌పేట పంచాయతీ కార్యదర్శి (బుగ్గారం మాజీ కార్యదర్శి) మహబూబ్ పాషాను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ యాస్మిన్ బాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుగ్గారం వాసి చుక్క గంగారెడ్డి తమ గ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగమైనట్లు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీనిపై మెట్‌పల్లి డీపీవో విచారణ చేపట్టి, నివేదిక అందించారు. దాని ప్రకారం.. బుగ్గారం బస్టాండ్ సమీపంలో డబుల్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా 2022లో వేసిన బోరును పూడ్చేశారు. ఇందులో జరిగిన అవకతవకలపై రికార్డులు పరిశీలించాలని ఆదేశించారు. అయితే, అప్పుడు పనిచేసిన పంచాయతీ కార్యదర్శి మహబూబ్ పాషా ప్రస్తుత పంచాయతీ కార్యదర్శికి రికార్డులు ఇవ్వలేదు. దీంతో కలెక్టర్ ఆయనను సస్పెండ్ చేశారు.

జాబితాపూర్ సర్పంచ్..

జగిత్యాల క్రైం: జాబితాపూర్ సర్పంచ్ అంకం మమతను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ యాస్మిన్ బాషా మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జాబితాపూర్‌లో గతంలో రూ.11.08 లక్షలు దుర్వినియోగం చేయగా పలుమార్లు షోకాజ్ నోటీసులు జారీ చేసినా సర్పంచ్ స్పందించలేదు. విజిలెన్స్ నివేదిక ప్రకారం విచారణ చేపట్టి, ఆమెను సస్పెండ్ చేశారు.

ఖాదీ భూములపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న కరం

మెట్‌పల్లి: మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్టాన్‌కు చెందిన భూముల విక్రయంపై ప్రభుత్వం న్యాయ విచారణ జరపాలని కాంగ్రెస్ నాయకుడు, సుప్రీంకోర్టు న్యాయవాది కొమొరెడ్డి కరం కోరారు. మెట్‌పల్లి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూముల అమ్మకాల్లో అక్రమాలు జరిగాయని, దీనిపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి జ్యుడీషియల్ విచారణ జరపాలని కోరతామన్నారు. ఖాదీ బోర్డు చైర్మన్‌గా ఉన్న కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆ పదవిలో శాశ్వతంగా కొనసాగేలా రూపొందించుకున్న నిబంధనలను సవరించేలా పోరాడతామని పేర్కొన్నారు. ఆ పదవి పద్మశాలీ వర్గానికి దక్కేలా చూస్తామని తెలిపారు. మెట్‌పల్లి మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమయ్యాయని, త్వరలోనే వాటి వివరాలను ప్రజల ముందుంచుతామని అన్నారు. నాయకులు రైసుద్దీన్, సురభి అశోక్ తదితరులున్నారు.

వైన్స్ షాపులో దొంగతనం

రామగిరి(మంథని): లద్నాపూర్ మహాలక్ష్మి వైన్స్ షాపులో చోరీ జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. వైన్స్ ను నిర్వాహకులు రోజులాగే సోమవారం రాత్రి 10 గంటలకు మూసివేసి, ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం 10 గంటలకు షాపు తీయడానికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా కౌంటర్‌లోని రూ.98 వేలు కనిపించలేదు. దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకొని, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి ప్రసాద్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు పోటీలు



బహుమతులు అందిస్తున్న పద్మ, సాగర్

కరీంనగర్‌రూరల్: మొగ్దుంపూర్‌లోని జెడ్పీ పాఠశాలలో మంగళవారం జాతీయ వైజ్ఞానిక కల్పన దినోత్సవం పురస్కరించుకొని హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గెలుపొందిన వారికి బహుమతులందించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మ, సంస్థ సభ్యులు రమణ, శ్రీధర్‌రెడ్డి, మునిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 11న ప్రవేశ పరీక్ష

కొత్తపల్లి(కరీంనగర్): ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రభుత్వ గురుకుల పాఠశాలలతో పాటు జనరల్ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరం 5వతరగతిలో ప్రవేశానికి తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో వచ్చేనెల 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చింతకుంట తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జెజె.థెరిస్సా ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 6 లోగా ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ప్రణవిని అభినందిస్తున్న సరిత

కొత్తపల్లి(కరీంనగర్): సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఈనెల 11 నుంచి 14 వరకు జరగబోయే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎలగందుల మోడల్ స్కూల్ విద్యార్థిని కె.ప్రణవి ఎంపికయినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ వి.సరిత తెలిపారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తో పాటు ఎస్ఎంసీ చైర్మన్ సుధాకర్, పీడీ హరీష్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాముడి అక్షింతల పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న సభ్యులు

కరీంనగర్‌టౌన్: అయోధ్య రామయ్య అక్షింతల వితరణ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ 6వ డివిజన్ బొమ్మకల్ చౌరస్తా నుంచి యజ్ఞవరాహ స్వామి గుడి వరకు గడపగడపకు అక్షింతలు, కరపత్రం, రామచంద్రుడి ఫొటో అందజేశారు. ఈ కార్యక్రమంలో అయోధ్య శ్రీరామచంద్ర తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు అవుదుర్తి శ్రీనివాస్, గుడేపు ఉమామహేశ్, అవుదుర్తి రేణుక, భాగ్య, రమాదేవి, పద్మ, రజిత, రమ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు, కార్యదర్శిని అభినందిస్తున్న సభ్యులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ బోయవాడ పాదుపు సంఘం ఎన్నికలు మంగళవారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జరిగాయి. అధ్యక్షుడిగా సమ్మెట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కొత్తగట్టు రమేశ్ ఎన్నికయ్యారు. ఎన్నికల కమిటీ సభ్యులుగా జౌదుర్తి లక్ష్మణ్‌కుమార్, జంపాల సంపత్, నాగవెల్లి రాజేశ్, జనగామ కుమార్ వ్యవహరించారు. అధ్యక్ష, కార్యదర్శిని సభ్యులు రమేశ్, సదానంద, మహేందర్, స్వామి, శివశంకర్ తదితరులు అభినందించారు.

టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో వేడుకలు

సప్తగిరికాలనీ (కరీంనగర్): టీయూడబ్ల్యూజే (ఏ– 143) ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్‌లో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల కోసం గత ప్రభుత్వం అందజేసిన ఇళ్ల స్థలాల రద్దు అనే అసత్య ప్రచారాలు నమ్మొద్దన్నారు. చెరుకు గోపాలకృష్ణ, అలిమొద్దీన్, పడాల రవికుమార్, తోట శ్రీకాంత్, ఎండీ అజీమ్, ఎండీ సలీం, సదానందం, జన్నారం శ్రీనివాస్, రఘు, సుధాకర్, అనిల్, సంపత్, రవికుమార్, నయీం, నర్సింగం, సుమంత్, కిషోర్, వినయ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.





108 మంది కన్నె స్వాములతో పడిపూజ

కరీంనగర్‌కల్చరల్: మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్–మాధవి దంపతుల సౌజన్యంతో తెలంగాణ అయ్యప్ప సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్ గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం జెడ్పీ క్వార్టర్స్‌లోని అయ్యప్ప దేవాలయంలో 108 మంది కన్నె స్వాములతో మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేష అభిషేకం, అర్చన చేశారు. కాగడాలతో ప్రదర్శన, పల్లకీసేవ నేత్రపర్వంగా జరిపారు. ఆలయంలో వినోద్‌కుమార్ పూజలు నిర్వహించారు. లింగంపల్లి సత్యనారాయణ, మంద వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తీగల వంతెన.. అపరిశుభ్రత

కొత్త సంవత్సరం నగరవాసులు, మందుబాబులకు కొత్త జోష్‌నిస్తే.. కరీంనగర్‌కు వన్నె తెచ్చిన తీగల వంతెన చెత్తాచెదారం, ఖాళీ మందు సీసాలు, వాటర్ బాటిల్స్, యూజ్డ్ ప్లాస్టిక్ గ్లాస్‌లు, తినిపడేసిన పేపర్ ప్లేట్లతో మురికి కూపంగా మారింది. కొత్త సంవత్సరం తీగల వంతెనపైకి ఎవరికి ప్రవేశం లేదని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ప్రకటించినా.. ఆయన ఆదేశాలను లెక్క చేయకుండా తీగల వంతెనపై మందు పార్టీలు, కేక్ కటింగ్‌లతో నగరవాసులు, యువకులు హంగామా చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్





కొనసాగిన ప్రజాపాలన రద్దీ

కరీంనగర్ కార్పొరేషన్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కూడా కేంద్రాల్లో రద్దీ కొనసాగింది. నాలుగో రోజు నగరపాలక సంస్థ పరిధిలోని 4, 9, 17, 23, 28, 31, 38, 40, 50, 54 డివిజన్లలో సభలు నిర్వహించగా.. అన్ని డివిజన్లలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను సందర్శించారు.



54వ డివిజన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న మేయర్ సునీల్‌రావు

49,843 దరఖాస్తులు

రెండు రోజుల సెలవుల అనంతరం ప్రజాపాలన కార్యక్రమం మంగళవారం కొనసాగింది. నాలుగో రోజు ఆరు గ్యారంటీలకు సంబంధించి 10,023 దరఖాస్తులు రాగా, ఇతర దరఖాస్తులు 928, మొత్తం 10,951 దరఖాస్తులు వచ్చాయి. నాలుగు రోజులు కలిపి నగరవ్యాప్తంగా ఇప్పటివరకు 49,843 దరఖాస్తులు వచ్చాయి.

గ్యారంటీలందేలా కృషి

ఆరు గ్యారంటీలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందించేలా తమ పాలకవర్గం కృషి చేస్తుందని మేయర్ అన్నారు. 54వ డివిజన్‌లో ప్రజాపాలన కేంద్రంలో స్థానిక కార్పొరేటర్ ఇఫ్రా తహేరిన్ అధీనాతో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. ఖాన్‌పుర, అశోక్‌నగర్ కేంద్రాలను సందర్శించారు. కార్పొరేటర్ నాంపల్లి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. 40వ డివిజన్‌లోని కేంద్రానికి హాజరై కార్పొరేటర్ కోటగిరి భూమాగౌడ్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కాంగ్రెస్ నాయకులు బొట్ల రామ్మూర్తి, వీర దేవేందర్ పటేల్, నోముల పవన్‌కుమార్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ

కరీంనగర్‌రూరల్: గోపాల్‌పూర్, ఫకీర్‌పేట, ఇరుకుల్ల గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులు పెద్దసంఖ్యలో వచ్చాయి. ఫకీర్‌పేటలో 186, గోపాల్‌పూర్‌లో 1,046, ఇరుకుల్లలో 430 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు. బొమ్మకల్‌లో 1,972, చామనపల్లిలో 765, చెర్లభూత్కూర్‌లో 874, దుబ్బపల్లిలో 233, దుర్శేడ్‌లో 1,038, ఎలబోతారంలో 501, నగునూరులో 1,118 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, సర్పంచులు ఊరడి మంజుల, కటకం నందయ్య, బలుసుల శారద, ఉప సర్పంచులు ఆరె శ్రీకాంత్, ఎం.శంకర్‌గౌడ్, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి, ఏవో సత్యం, ఏపీఎం శోభ పాల్గొన్నారు.

8 గ్రామాలు.. 8,242 దరఖాస్తులు



కొత్తపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న రాజు, వేణుమాధవ్

కొత్తపల్లి: అభయహస్తం దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. మండలంలోని 8 గ్రామాల్లో 8,242 దరఖాస్తులు వచ్చాయి. రేషన్ కార్డుల కోసం 969 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 6 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఆసిఫ్‌నగర్‌లో 1,330 ఇళ్లదారులకు గాను 1,003, బద్దిపల్లిలో 320 గాను 370, చింతకుంటలో 2,050 గాను 2,393, ఎలగందులలో 1,301 గాను 1,036, కమాన్‌పూర్‌లో 520 గాను 869, ఖాజీపూర్‌లో 393 గాను 499, మల్కాపూర్‌లో 1,479 గాను 1,210, నాగులమల్యాలలో 690 ఇళ్లదారులకు గాను 862 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఎస్.రాజేశ్, ఎంపీడీవో కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కొత్తపల్లి పట్టణంలోని 5, 6 వార్డుల్లో 641 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ చెప్పారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, స్థానిక కౌన్సిలర్ గున్నాల విజయ, కోఆప్షన్ ఫక్రుద్దీన్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మేయర్, కమిషనర్

కరీంనగర్ కార్పొరేషన్: నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతిని మేయర్ సునీల్‌రావు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పూలమొక్క అందజేశారు. కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ అనాథ పిల్లలకు అందించేందుకు బ్లాంకెట్లు, పుస్తకాలు, డిక్షనరీలు అందించారు. స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మేయర్‌ను కలిసిన ఇంజనీరింగ్ అధికారులు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్‌కు పూల మొక్క అందిస్తున్న మేయర్

ఉచితంగా కంటి శస్త్రచికిత్స

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌కు చెందిన గంగిపల్లి శంకరయ్యకు హంగర్ రిలీఫ్ లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జీ చైర్‌పర్సన్ చింతల కిషన్ ఆధ్వర్యంలో మంగళవారం రేకుర్తిలోని కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి శస్త్రచికిత్స చేయించారు. ఆస్పత్రి వైస్ చైర్మన్ చిదుర సురేశ్, ట్రస్టు బోర్డు మెంబర్ కోల అన్నారెడ్డి సహకారంతో శంకరయ్యకు ఉచితంగా 81వ కంటి శస్త్రచికిత్స చేయించినట్లు చింతల కిషన్ తెలిపారు. రోగికి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



బ్రెడ్ ప్యాకెట్ అందిస్తున్న దృశ్యం

మద్యం అమ్మిన వ్యక్తులపై కేసు

కరీంనగర్‌క్రైం: నగరంలోని ఒక పర్మిట్ రూములో ఎలాంటి అనుమతి లేకుండా మద్యం అమ్మిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ వెంకటేష్ తెలిపారు. రాంనగర్‌లో ఒక వైన్స్‌కు చెందిన పర్మిట్ రూములో వల్లకొండ బాపు, బోగ రాజేందర్ అనే వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు దాడి చేసి పట్టుకొని వారి వద్ద రూ.6,130 విలువ గల మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



కరీంనగర్: నూతన సంవత్సరం సందర్భంగా 22వ డివిజన్ కార్పొరేటర్ గంట కళ్యాణిశ్రీనివాస్ మంగళవారం మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, నగర మేయర్ వై.సునీల్‌రావును కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై సమన్వయ సమావేశం

కరీంనగర్: మహిళ సాధికారత, వారి ఆర్థిక బలోపేతం కోసం వ్యాపార ప్రోత్సాహం వంటి అంశాలపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. సప్తగిరికాలనీలోని సఖి కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి విహబ్, సఖి, డీహెచ్ఈఎల్ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక బలోపేతానికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాల్సిన అవసరం మహిళా శిశు సంక్షేమ శాఖపై ఉందన్నారు. డీహెచ్ఈఎల్, సఖి సిబ్బంది ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాపార రంగంపై ఆసక్తి కలిగిన మహిళలకు విహబ్ నుంచి ఏవిధమైన సహాయం అందుతుందో సంబంధిత సిబ్బంది వివరించారు. జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ శ్రీలత, సఖి అడ్మిన్ లక్ష్మి, స్కిల్ కోఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సరస్వతి



చెక్కు అందిస్తున్న కలెక్టర్

చెక్కు అందజేత

సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రమాదవశాత్తు మరణించిన గాయత్రి బ్యాంకు ఖాతాదారులైన ఊర సంపత్ కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కును మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా అందించారు. ది గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులోని గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాపై గల ప్రమాద బీమా సౌకర్యం ద్వారా అతడి భార్య అయిన ఊర దేవకి రూ.లక్ష చెక్కును అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఖాతాదారులకు కనీస డిపాజిట్‌లోనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ పేద, మధ్యతరగతి వినియోగదారులకు ప్రమాద బీమా కల్పిస్తూ వారికి అండగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ వి.కృష్ణ, సీనియర్ ఆఫీసర్ వి.విష్ణుదర్, జూనియర్ ఆఫీసర్ వి.విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిరాక్సులే దిక్కు..

- అభయహస్తం ఫారాల కోసం లబ్ధిదారుల పరుగులు
- జిరాక్స్ కేంద్రాల్లో విక్రయాలు



ఇరుకుల్లలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన అభయహస్తం దరఖాస్తుల కోసం లబ్ధిదారులు పరుగులు పెడుతున్నారు. అధికారులు నివాస గృహాల ఆధారంగా ఇంటింటికి దరఖాస్తులను పంపిణీ చేయగా.. ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురు వేర్వేరుగా దరఖాస్తు చేస్తున్నారు. ఇంటికి ఒక దరఖాస్తు మాత్రమే ఇస్తుండటంతో.. మిగతా లబ్ధిదారులు మీసేవ, జిరాక్స్ కేంద్రాల్లో దరఖాస్తు ఫారాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం గత నెల 28 నుంచి ప్రజాపాలన గ్రామసభలను నిర్వహిస్తోంది. గ్రామాలు, పట్టణాల్లోని జనాభా ఆధారంగా గ్రామసభల్లో కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా గ్రామసభల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రింట్ చేయించిన అభయహస్తం దరఖాస్తు ఫారాలను కుటుంబాల ఆధారంగానే ఇంటింటికి ఉచితంగా అందిస్తున్నారు. ఫారాలను సమగ్రంగా నింపి మళ్లీ అధికారులకు అప్పగించాల్సి ఉంటుంది. అయితే తీసుకున్న దరఖాస్తులు కొందరు మళ్లీ అధికారులకు ఇవ్వకపోవడంతో కొరత ఏర్పడుతోంది. అంతే కాకుండా కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారుల నుంచి దరఖాస్తులను తీసుకొని తమ వద్దే ఉంచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల్లో పలువురు లబ్ధిదారులు జిరాక్స్ దరఖాస్తు ఫారాలతోనే అధికారులకు దరఖాస్తు చేసుకోవడం కన్పించింది. వివిధ పత్రాల జిరాక్సుల కోసం మీసేవ, జిరాక్స్ సెంటర్లకు వెళ్లిన కొందరు అక్కడే దరఖాస్తు ఫారాలను తీసుకుంటున్నారు. ఒక్కో జిరాక్స్ దరఖాస్తును రూ.20కి కొనుగోలు చేశారు.

దోపిడీ..

జిరాక్సుల పేరిట మీసేవ, జిరాక్స్ సెంటర్ల యజమానులు లబ్ధిదారులను దోచుకుంటున్నారు. అభయహస్తం దరఖాస్తుకు కేవలం ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ మాత్రమే జత చేయాల్సి ఉంది. అయితే జిరాక్స్, మీసేవ, ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకులు ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు. కుటుంబంలోని అందరి ఆధార్ కార్డులతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా, గ్యాస్ పుస్తకం, ఉపాధిహామీ జాబ్‌కార్డు తదితర పత్రాల జిరాక్సులను జత చేయాలని సూచిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు అవసరం లేని సర్టిఫికెట్లను జిరాక్స్ తీసుకొని దరఖాస్తుతో జత చేసి అధికారులకందిస్తున్నారు. అయితే గ్రామసభలు నిర్వహించే గ్రామాల్లో ముందుగానే దరఖాస్తు ఫారాలను పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు. లబ్ధిదారులు ఆందోళన చెందొద్దని, ఈనెల 6 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముందని పేర్కొన్నారు.

స్వచ్ఛంద సంస్థకు అండగా ఉంటాం

– ఎమ్మెల్యే కవ్వంపల్లి

కరీంనగర్ కార్పొరేషన్: ఖాదిమానె మిల్లత్ స్వచ్ఛంద సేవాసంస్థకు అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సంస్థ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం నగరంలోని సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, ఖాదిమానె మిల్లత్ సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ అంతదుల్లా బేగ్, కార్యదర్శి సమద్ నవాబ్, వంగల పవన్‌కుమార్, మక్బూల్ హుస్సేన సయ్యద్ ఫసియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగాలి

కరీంనగర్: కాంగ్రెస్, బీజేపీ విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని, పదేళ్లలో జరిగిన ప్రగతిని క్షేత్రస్థాయిలో వివరించేలా కార్యకర్తలను సన్నద్ధం చేయాల్సిన అవసరముందని నగర మేయర్ వై.సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం మీసేవ కార్యాలయంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 4న కరీంనగర్ పార్లమెంట్ స్థాయి సమావేశం హైదరాబాద్‌లో జరగనుందని, సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో పాటు ముఖ్య నాయకులు హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కోఆప్షన్ సభ్యులు జమీల్, ఎంపీపీ లక్ష్మయ్య, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, సుంకిశాల సంపత్‌రావు, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సునీల్‌రావు, హరిశంకర్, నాయకులు

ప్రైవేటు విద్యాసంస్థ గుర్తింపు రద్దు చేయాలి: పీడీఎస్‌యూ

కరీంనగర్: జిల్లావ్యాప్తంగా ఉన్న ఓ ప్రయివేటు విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధిక ఫీజులతో దోపిడీ చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడంలో విఫలమైన కరీంనగర్ జిల్లా డీఈవోపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. విద్యాహక్కు చట్టాలు అమలు కావడం లేదని, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలు.. అపార్ట్‌మెంట్లు, సెల్లర్లలో పాఠశాల తరగతులు బోధిస్తున్నారని మండిపడ్డారు. సీబీఐ విచారణ చేయాలని కోరారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి తదితరులు పాల్గొన్నారు.

జన బలమే గీటురాయి

24 అసెంబ్లీ, 3 ఎంపీ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమించిన ఏపీ సీఎం జగన్

సాక్షి, అమరావతి: నిరంతరం ప్రజాక్షేత్రంలో గడుపుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సమర్థంగా ముందుకు తీసుకెళ్లి ప్రజల మనసులకు మరింత చేరువైన నేతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. సామాజిక న్యాయంలో మరో అడుగు ముందుకేశారు. బీసీలు, మహిళలకు ప్రాధాన్యమిస్తూ సామాజిక సాధికార ఛాంపియన్ అని మరోసారి రుజువు చేసుకున్నారు. మహిళలు, యువతకు మరింత ప్రాధాన్యం ఇస్తూ 24 శాసనసభ స్థానాలు, 3 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో జాబితాను ఖరారు చేశారు. గతంలో అగ్రవర్ణాలకు అవకాశం కల్పించిన ఏడు అసెంబ్లీ స్థానాల్లో తాజాగా ఐదు చోట్ల బీసీలను సమన్వయకర్తలుగా నియమించడం గమనార్హం. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి మంగళవారం రాత్రి ఈ వివరాలను ప్రకటించారు. గత నెల 11వతేదీన 11 శాసనసభ స్థానాలకు నూతన సమన్వయకర్తలను ప్రకటిస్తూ వైఎస్సార్ సీపీ మొదటి జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. రెండు జాబితాల్లో కలిపి మొత్తం 35 శాసనసభ, 3 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీ నూతన సమన్వయకర్తలు వీరే..	
లోక్‌సభ స్థానం పేరు	సమన్వయకర్త
అనంతపురం	మాలగుండ్ల శంకరనారాయణ(బీసీ-కురుబ)
హిందూపురం	జోలదరాశి శాంత(బీసీ-బోయ)
అరకు(ఎస్టీ)	కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి(ఎస్టీ)
శాసనసభ స్థానం పేరు	సమన్వయకర్త
రాజాం(ఎస్సీ)	డాక్టర్ తాలె రాజేష్
అనకాపల్లి	మలసాల భరత్ కుమార్(ఓసీ-కాపు)
పాయకరావు పేట(ఎస్సీ)	కంబాల జోగులు
రామచంద్రాపురం	పిల్లి సూర్యప్రకాశ్(బీసీ-శెట్టిబలిజ)
పి. గన్నవరం(ఎస్సీ)	విప్పర్తి వేణుగోపాల్
పిఠాపురం	వంగ గీత(ఓసీ-కాపు)
జగ్గంపేట	తోట నరసింహం(ఓసీ-కాపు)
పత్తిపాడు	వరుపుల సుబ్బారావు(ఓసీ-కాపు)
రాజమంత్రి సిటీ	మార్గాని భరత్(బీసీ-గౌడ)
రాజమండ్రి రూరల్	చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ(బీసీ-శెట్టిబలిజ)
పోలవరం(ఎస్టీ)	తెల్లం రాజ్యలక్ష్మి
కదిరి	బీఎస్ మక్బూల్ అహ్మద్
ఎర్రగొండపాలెం(ఎస్సీ)	చంద్రశేఖర్
ఎమ్మిగనూర్	మాచాని వెంకటేశ్(బీసీ-పద్మశాలి)
తిరుపతి	భూమన అభినయ్ రెడ్డి
గుంటూరు ఈస్ట్	షేక్ నూరి ఫాతిమా
మచిలీపట్నం పేర్ని	కృష్ణమూర్తి(కిట్టు)
చంద్రగిరి	చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
పెనుకొండ	కేవీ ఉషా శ్రీచరణ్(బీసీ-కురుబ)
కళ్యాణదుర్గం	తలారి రంగయ్య(బీసీ-బోయ)
అరకు(ఎస్టీ)	గొడ్డేటి మాధవి
పాడేరు(ఎస్టీ)	మత్స్యరాస విశ్వేశ్వర రాజు
విజయవాడ సెంట్రల్	వెలంపల్లి శ్రీనివాస రావు(ఓసీ- వైశ్య)
విజయవాడ వెస్ట్	షేక్ ఆసిఫ్

కురుబ (బీసీ) సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను అనంతపురం లోక్‌సభ సమన్వయకర్తగా నియమించారు. బోయ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ జోలదరాశి శాంత హిందూపురం లోక్‌సభ సమన్వయకర్తగా నియమితులయ్యారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిని అరకు లోక్‌సభ స్థానం సమన్వయకర్తగా నియమించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించగా, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌ను రాజమండ్రి సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని అరకు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి,, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే కేవీ ఉషాశ్రీచరణ్‌ను పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి, రామచంద్రాపురం ఎమ్మెల్యే చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు.

బీసీలు, మైనార్టీలకు పెద్దపీట..

రెండు దఫాల్లో ప్రకటించిన 35 శాసనసభ స్థానాల సమన్వయకర్తల జాబితాను పరిశీలిస్తే సామాజిక న్యాయానికి సీఎం జగన్ పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది. గతంలో అగ్రవర్ణాలకు చెందిన అభ్యర్థులను పోటీకి పెట్టిన ఏడు శాసనసభ స్థానాల్లో ఇప్పుడు ఐదు స్థానాల్లో బీసీలకు, రెండు స్థానాల్లో మైనార్టీ వర్గానికి చెందిన వారిని సమన్వయకర్తలుగా నియమించడం గమనార్హం. ఇక ఐదు శాసనసభ స్థానాలకు మహిళలను సమన్వయకర్తలుగా నియమించారు. పది స్థానాల్లో యువతీ యువకులకు సమన్వయకర్తలుగా అవకాశం కల్పించారు. మొత్తమ్మీద 35 శాసనసభ స్థానాలకు ప్రకటించిన సమన్వయకర్తల్లో ఎస్సీలు 9 మంది, ఎస్టీలు ముగ్గురు, బీసీలు 11 మంది, మైనార్టీలు ముగ్గురు, అగ్రవర్ణాలు 9 మంది (రెడ్డి, కాపు, వైశ్య) చొప్పున ఉన్నారు.

175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా

గత 55 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, చరిత్ర ఎరుగని విప్లవాత్మక సంస్కరణలతో సీఎం వైఎస్ జగన్ జనరంజక పరిపాలన అందిస్తున్నారు. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ(ప్రత్యక్ష నగదు బదిలీ)తో రూ.2.45 లక్షల కోట్లు, నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.67 లక్షల కోట్లు వెరసి మొత్తం రూ.4.12 లక్షల కోట్ల మేర ప్రజలకు ప్రయోజనం చేకూర్చారు. రాష్ట్రంలో సగటున 87 శాతం కుటుంబాలకు సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా ప్రయోజనం అందగా అందులో 75 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉండటం గమనార్హం. ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం, ప్రతి నియోజకవర్గంలో తీసుకొచ్చిన మార్పులు కళ్లెదుట కనిపిస్తున్నప్పుడు 175కు 175 స్థానాల్లోనూ విజయం సాధించడం సాధ్యమేనని పార్టీ శ్రేణులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేస్తూ వస్తున్నారు. చేసిన మంచిని ప్రజలకు చెప్పి వారితో మమేకమై మరింత మేలు చేయడానికి ఆశీస్సులు కోరాలని ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు మార్గనిర్దేశం చేశారు. ప్రజలతో మమేకం కాకుండా వారి మనసులు చూరగొనలేని వారికి టికెట్లు ఇవ్వలేనని ఆది నుంచి సీఎం జగన్ తేల్చి చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలో 175 స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా అవసరమైన చోట్ల నూతన సమన్వయకర్తలను నియమిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ ఎంపీ శాంత

సాక్షి, అమరావతి: మాజీ ఎంపీ జె. శాంత మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆమె పార్టీ కండువా కప్పుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన ఆమె వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారు. ఆమె 2009లో లోక్‌సభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. పార్టీలో చేరిన అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద జె.శాంత మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చూసి ప్రజలకు ఆయనపై నమ్మకం ఏర్పడిందని, అందుకే వైఎస్సార్‌సీపీలో చేరానని చెప్పారు. పార్టీలో సామాన్య కార్యకర్తలా పనిచేస్తానని తెలిపారు.



ఎల్బీనగర్‌లో ఓ పెట్రోల్ బంకు వద్ద రద్దీ



లక్డీకపూల్‌లో వాటర్ క్యాన్లతో పెట్రోల్ పట్టుకెళుతున్న దృశ్యం

పెట్రోల్ కటకట!

▶ మొదటి పేజీ తరువాయి

వర్ణనాతీతంగా మారింది. రాత్రి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది.

సామాజిక మాధ్యమాల్లో ప్రచారంతో..

వాస్తవానికి రెండురోజుల క్రితమే వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మెకు దిగారు. ఫలితంగా ప్రెటోల్ బంకులకు సరఫరా నిలిచిపోయింది. ఇక బుధవారం నుంచి దేశవ్యాప్తంగా ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు పూర్తి స్థాయిలో సమ్మెకు దిగనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగడంతో వాహనదారులు ఒక్కసారిగా పెట్రోల్ బంకులకు పోటెత్తారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కోసం వేలాదిగా వాహనాలు బారులు తీరాయి. సమ్మె ఎన్ని రోజులు కొనసాగుతుందో అన్న ఆందోళనతో ఎక్కువమంది ట్యాంకులు ఫుల్ చేయించడం కన్పించింది. కొందరు నిబంధనలకు విరుద్ధంగా పెద్దపెద్ద క్యాన్లలో ఆయిల్ నింపుకొని తీసుకెళ్లారు. దీంతో మధ్యాహ్నానికల్లా చాలా వరకు బంకుల్లో నిల్వలు ఖాళీ అయ్యాయి. ఆయా బంకుల యాజమానులు బంకులు మూసేసి నో స్టాక్ బోర్డులు పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3,500 పెట్రోల్ బంకులు ఉండగా 3 వేల వరకు బంకులు మూతపడటంతో సాయంత్రానికి పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రమయ్యింది. హైదరాబాద్ నగరంలోని పెట్రోల్ బంకులన్నింటిలో నిల్వలు ఖాళీ అయ్యాయి.

తాత్కాలికంగా సమ్మె విరమణ

రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో నిల్వలు ఖాళీ కావడంతో డీలర్ల సొంత ట్యాంకర్లను రంగంలోకి దింపారు. వారు ఆందోళన విరమించి ఇంధన సరఫరాకు సిద్ధమయ్యారు. మరోవైపు సమ్మె తాత్కాలికంగా విరమిస్తున్నట్లు రాష్ట్ర పెట్రోల్ డీజిల్ ట్యాంకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ప్రకటించారు. కేంద్రం తీసుకొచ్చిన మోటార్ వాహనాల చట్ట సవరణ బిల్లుకు నిరసనగా డ్రైవర్లు సోమవారం నుంచి ఆయిల్ టాంకర్స్ నిలిపివేసి ఆకస్మిక సమ్మెలోకి వెళ్లారని తెలిపారు. దేశవ్యాప్తంగా కూడా ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ల అసోసియేషన్లు కూడా సమ్మె విరమించే అవకాశాలు ఉండటం, చమురు సంస్థల డిపోల వద్దకు డీలర్ల ట్యాంకర్లు లోడింగ్‌కు చేరుకోవడంతో బుధవారం ఆయిల్ సరఫరాకు అంతరాయం ఉండబోదని డీలర్ల వర్గాలు ప్రకటించాయి.

ఇంధన సరఫరాలో కొరత ఉండదు: పౌరసరఫరాల శాఖ కమిషనర్

ఇంధన ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మెకు పిలుపునివ్వడంతో పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ మంగళవారం పౌరసరఫరాల భవన్‌లో బీపీసీఎల్, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్ ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. సమ్మె చేస్తున్న ట్యాంకర్ల డ్రైవర్లతో చర్చించాలని, రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురు కాకుండా చూడాలన్నారు. ఆయిల్ కంపెనీలకు, డ్రైవర్లకు తాము పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తక్షణమే విధుల్లో చేరాలని ట్యాంకర్ల డ్రైవర్లకు విజ్ఞప్తి చేశారు. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి కొరత ఉండదని, ప్రజలు ఆందోళనకు గురికావద్దని కమిషనర్ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అప్పా జంక్షన్ వద్ద ఎస్‌ఐకి గాయాలు!

రాజేంద్రనగర్: బండ్లగూడ అప్పా జంక్షన్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం రాత్రి సిబ్బందికి వాహనదారులకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పెట్రోల్ కోసం వచ్చిన సందర్భంగా వాగ్వివాదం జరగడంతో పరస్పరం దాడి చేసుకున్నట్లు సమాచారం. ఈ పెట్రోల్ బంకును పోలీస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా.. విధుల్లో ఉన్న ఒక ఎస్‌ఐ ర్యాంకు అధికారితో పాటు సిబ్బందికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. అయితే దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు చెప్పారు.

సీఎం జగన్‌ను ఎదుర్కోలేక దుష్ప్రచారం చేస్తారా?

- చంద్రబాబు, ఎల్లో మీడియాపై వైవీ సుబ్బారెడ్డి ఫైర్

సాక్షి, అమరావతి: ఏపీలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రోజు రోజుకూ ప్రజల్లో ఆదరణ మరింతగా పెరుగుతోందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. అత్యంత ప్రజాదరణ ఉన్న సీఎం వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేకే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియాతో కలిసి కట్టుకథలు అల్లుతూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సుబ్బారెడ్డి మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. షర్మిల కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తనకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. ఎప్పుడు హైదరాబాద్ వెళ్లినా వైఎస్ విజయమ్మను, కుటుంబ సభ్యులను కలుస్తానని తెలిపారు. ఇటీవల అమెరికాకు వెళ్లి వచ్చిన విజయమ్మను ఆదివారం కలిసి కుటుంబ విషయాలు మాట్లాడుకున్నట్లు చెప్పారు. ఆ తర్వాత షిరిడి వెళ్లి, సోమవారం రాత్రి విజయవాడ వచ్చాక ఎల్లో మీడియాలో వార్తలు చూశానని తెలిపారు. షర్మిలతో తాను మధ్యవర్తిత్వం చేసినట్లు కట్టుకథలు అల్లారని మండిపడ్డారు. కుటుంబ సభ్యులను కలవడానికి వెళ్తే రాయబారానికి వెళ్లినట్లా అని ప్రశ్నించారు. చంద్రబాబును సీఎం పీఠంపై కూర్చోబెట్టడం కోసమే ఎల్లో మీడియా తమపై బురద జల్లుతోందని, వారి దుష్ప్రచారం పరాకాష్టకు చేరిందని అన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా.. 2024 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌దే విజయమని స్పష్టం చేశారు.

సూత్రధారిపై వేటు!

- కలెక్టర్ సీసీగా సీనియర్ అసిస్టెంట్
- అదనపు కలెక్టర్ల సీసీల కూడా తొలగింపు
- ట్రెజరీ ఉద్యోగికి ఉన్నతాధికారి అక్షింతలు
- 'సాక్షి' వరుస కథనాలకు స్పందన



జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌లోని కలెక్టరేట్

సాక్షి, ఆసిఫాబాద్: కుమురంభీం జిల్లా కేంద్రం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో అక్రమ పద్ధతిలో కొనసాగుతున్న ముగ్గురు సీసీలను తొలగించినట్లు తెలిసింది. అలాగే వీరి నియామకాల్లో చక్రం తిప్పిన కలెక్టరేట్ అధికారిపైనా బదిలీ వేటు పడినట్లు సమాచారం. 'అర్హత లేకున్నా అందలం'... 'రూ.50 లక్షలు భోంచేశారు' అనే శీర్షికలతో ఇటీవల 'సాక్షి' దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై స్పందించిన కలెక్టర్ హేమంత్ బోర్కడే చర్యలు చేపట్టినట్లు తెలిసింది. ఈ మేరకు తనకు సీసీగా పనిచేస్తున్న రాజశేఖర్ స్థానంలో సీనియర్ అసిస్టెంట్ రమేశ్‌ను నియమించాలని నిర్ణయించినట్లు తెలిసింది. రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు రానున్నాయి. హ్యాండ్ హోల్డిగ్ పర్సన్(హెచ్‌హెచ్‌పీ)గా పనిచేస్తూ ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే సీసీగా ఇప్పటి వరకు కొనసాగుతున్న రాజశేఖర్, ఆపరేటర్లుగా పనిచేస్తూ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) వద్ద సీసీగా పనిచేస్తున్న కార్తీక్, మరో అదనపు కలెక్టర్(రెవెన్యూ) వద్ద సీసీగా పనిచేస్తున్న షఫీలను కూడా తప్పించినట్లు తెలుస్తోంది. తమ వద్ద పనిచేస్తున్న ఇద్దరు సీసీలను అదనపు కలెక్టర్లు రావొద్దని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇక డీఆర్వో వద్ద సీసీగా పనిచేస్తున్న జావీద్‌తోపాటు కార్తీక్, షఫీలు ఆపరేటర్లుగా విధుల్లో చేరారు. వీరి వేతనాలు సైతం మీసేవ కమీషన్ ఫండ్ నుంచి ఇస్తున్నట్లు సమాచారం. జావీద్ మాత్రం విధులకు హాజరవుతుండడం గమనార్హం.

ముఖ్య అధికారి బదిలీ?

కలెక్టరేట్‌లో పదేళ్లుగా పాతుకుపోయిన ముఖ్య అధికారి ఎట్టకేలకు బదిలీ అయినట్లు సమాచారం. కలెక్టరేట్‌లో పనిచేస్తూ అవినీతి, అక్రమాలకు అండగా నిలుస్తున్నారనే కారణాలతో ఆ అధికారిని బదిలీ చేయాలని కలెక్టర్ నిర్ణయించినట్లు తెలిసింది. తహసీల్దార్ల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేశారని, అదేవిధంగా తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీల్లోనూ చేతివాటం ప్రదర్శించారని, ఎన్నికల సమయంలోనూ తన అనుచరులను అడ్డు పెట్టుకొని రూ.లక్షలు ఆర్జించారని ఆరోపణలున్నాయి. ఆ అధికారి అక్రమాలపై 'సాక్షి'లో వరుస కథనాలు వచ్చిన తర్వాత శాఖాపరమైన విచారణకు ఆదేశించగా పైఅంశాలు వెలుగు చూసినట్లు తెలిసింది. అధికారిక ఉత్తర్వులు వెలువడనప్పటికీ ఆయనను తిర్యాణి తహసీల్దార్‌గా బదిలీ చేసినట్లు తెలుస్తోంది.

ఉన్నతాధికారులకు నివేదిక

'సాక్షి'లో వచ్చిన కథనాలపై ఇంటిలిజెన్స్ అధికారులు సైతం సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేసిన సంగతి తెలిసిందే. అధికారికంగా ఎలాంటి నియామక ఉత్తర్వులు లేకుండానే అక్రమ పద్ధతిన సీసీల నియామకం చేపట్టారని వారు తమ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. అదేవిధంగా పదేళ్లుగా ఒకే సీటులో పాతుకుపోయి అక్రమాలకు పాల్పడుతున్న కలెక్టరేట్ అధికారి పనితీరుపైనా ఇంటిలిజెన్స్ ఉన్నతాధికారులకు సమగ్ర సమాచారం అందజేసినట్లు తెలుస్తోంది. జిల్లా ఖజానా విభాగంలో పనిచేస్తూ కాంట్రాక్టర్ అవతారమెత్తి అక్రమ మార్గంలో పనులు చేస్తున్న ఉద్యోగిపైనా శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. తన బంధువు పేరిట కలెక్టరేట్‌లో చేపట్టిన సీసీ కెమెరాల ఏర్పాటు అంశంపై ఆ శాఖ ఉన్నతాధికారి మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అతనిపై వచ్చిన ఆరోపణలపై నివేదిక రూపొందించి చర్యలు సిఫార్సు చేయనున్నట్లు సమాచారం.

సీసీఐ కొనుగోళ్లకు 'ఆధార్' తప్పనిసరి

- పత్తి రైతులు ముందురోజే అధికారులకు వివరాలివ్వాలి
- కరీంనగర్ డీఎంవో పద్మావతి
- జమ్మికుంట మార్కెట్ సందర్శన



పత్తి వేలం పాటను పరిశీలిస్తున్న డీఎంవో పద్మావతి

జమ్మికుంట(హుజూరాబాద్): పత్తి రైతులకు మద్దతు ధర చెల్లించేందుకు సీసీఐ ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయని, జిల్లా మార్కెటింగ్ అధికారి(డీఎంవో) పద్మావతి అన్నారు. వీటికి ఆధార్ తప్పనిసరని పేర్కొన్నారు. మంగళవారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి, కొనుగోళ్లను పరిశీలించారు. ఆధార్‌కు ఫోన్ నంబర్, భూమి పట్టా, బ్యాంకు పాస్ పుస్తకాల అనుసంధాన వివరాలను రైతులు ఒకరోజు ముందుగా మార్కెట్ అధికారులకు ఫోన్‌లో తెలిపితే ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మకాలు చేసుకోవచ్చని అన్నారు. గ్రేడ్-2 కార్యదర్శి రాజా (99485 08301), సూపరింటెండెంట్లు లక్ష్మణ్ (94407 63270), యాకయ్య (99894 18139), ఏఎస్ఎం బాబా (99494 38140), అరుణ్ (80745 74473), శంకర్‌రెడ్డి (89784 82069)లు అందుబాటులో ఉంటారన్నారు. పంట ఉత్పత్తులను సీసీఐకి అమ్ముకునే రైతులు నిబంధనలు పాటించాలని, తేమ శాతం 8 నుంచి 12లోపు ఉండాలని, క్వింటాల్ పత్తికి మద్దతు ధర రూ.7,020 పొందాలని సూచించారు.

కౌలు రైతులకు 12 మిల్లులు..

కరీంనగర్ జిల్లాలోని కౌలు రైతులు మార్కెట్ నోటిపై చేసిన మిల్లుల్లో పత్తి విక్రయించాలని డీఎంఈ తెలిపారు. భూ యజమానితో అగ్రిమెంట్, వ్యవసాయ అధికారులతో రిజిస్ట్రేషన్ చేసుకొని, సదరు ధ్రువపత్రాలతో సీసీఐకి విక్రయించుకోవాలన్నారు. కరీంనగర్, జమ్మికుంట, చొప్పదండి, గోపాల్‌రావుపేట మార్కెట్ల పరిధిలోని 12 మిల్లుల్లో ఈ సంస్థ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇప్పటివరకు సీసీఐ ద్వారా 70,204 క్వింటాళ్లు కొన్నారని, జిల్లాలోని ప్రైవేటు ట్రేడర్లు నేరుగా 96,110, మార్కెట్ యార్డుల్లో 57,832 క్వింటాళ్లు కొనుగోలు చేశారని తెలిపారు. క్రయవిక్రయాల్లో రైతులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రేడ్-2 కార్యదర్శి రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి చేరిన అవ్వ

జ్యోతినగర్(రామగుండం): 'అవ్వకు దిక్కెవరు'.. శీర్షికన ఎస్‌రెడ్డి లస్మక్క అనే అంధురాలు రోడ్డుపై పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' దినపత్రికలో మంగళవారం వార్త ప్రచురితమైంది. దీనికి రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, అధికారులు స్పందించారు. జిల్లా సంక్షేమ శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి స్వర్ణలత ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్ రింగ్ రోడ్డు వద్ద ఉన్న లస్మక్క వద్దకు చేరుకొని, టిఫిన్ పెట్టించారు. అనంతరం ఆమె వివరాలు సేకరించారు. ఎన్టీపీసీ ఎస్సై జీవన్‌కు, ఈశ్వర కృప అనాథ ఆశ్రమ నిర్వాహకుడు పీటీ.స్వామికి సమాచారం ఇచ్చారు. వారు కూడా వచ్చి, బాధితురాలితో మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కాంగ్రెస్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ధూళికట్ట సతీశ్, కాంట్రాక్టర్ విశ్వతేజ లస్మక్కను కలిశారు. ఆమెకు పండ్లు అందించారు. పోలీసులు ఆమె సమీప బంధువులను పిలిపించి, కౌన్సెలింగ్ చేశారు. వారు తాము తీసుకెళ్లలేమని చెప్పడంతో వీర్లపల్లిలోని ఈశ్వర కృప అనాథ ఆశ్రమంలో చేర్పించారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యేకు, అధికారులకు, 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. బాధితురాలికి ఐదో డివిజన్‌కు చెందిన గాండ్ల స్వరూప దుప్పటి అందజేశారు. 25వ డివిజన్ అధ్యక్షుడు మిట్టపెల్లి మహేందర్, యువజన కాంగ్రెస్ నాయకుడు ముచ్చకుర్తి రమేశ్, ఎన్టీపీసీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా, నాయకులు పాల్గొన్నారు.



లస్మక్కను అనాథ ఆశ్రమంలో చేర్పించిన అధికారులు

ఆక్సిజన్ ప్లాంటు నిరుపయోగం

- 2021లో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు
- వంద పడకలకు ఆక్సిజన్ సరఫరా

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంటు నిరుపయోగంగా మారింది. కోవిడ్ మొదటి, రెండో దశల్లో జిల్లాకు చెందిన వేలాది మంది కరోనా బారిన పడడం, ఆస్పత్రుల్లో ఆక్సిజన్ అందక కొందరు మృత్యువాత పడడం తెలిసిందే. దీంతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, డీఆర్డీవోల సంయుక్త ఆధ్వర్యంలో 500 ఎల్‌పీఎం(లీటర్ పర్ మినట్) సామర్థ్యంతో ఆక్సిజన్ ప్లాంటును 2021లో అక్టోబర్ 7న ప్రారంభించారు. ఈ ప్లాంటు కోవిడ్ బాధితులకు ఊపిరి అందించింది. కోవిడ్ కేసులు తగ్గుముఖం పట్టడంతో వినియోగించడం లేదు. పనిచేస్తుందో లేదో కూడా తెలియని పరిస్థితుల్లో జిల్లా ఆసుపత్రిని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అప్పగించగా, దానిని ఇప్పటివరకు ఉపయోగించలేదు. ఇందులోని పరికరాల వినియోగానికి ప్రత్యేకంగా టెక్నీషియన్లను నియమించకపోవడం, ప్లాంటును సద్వినియోగం చేసుకోకపోవడం వల్ల నిరుపయోగంగా మారి పనిచేయడం లేదు.

ఉత్పత్తి నిలిపివేత వల్లనే..!

ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సరఫరాకు సిలిండర్లలో ద్రవ రూపంలోని ఆక్సిజన్‌ను వినియోగించిన అనంతరం అది ఖాళీగా మారనుండగా, అదే సిలిండర్లలో మళ్లీ రీఫిల్ చేసి వాడుకునే విధానం అమలులో ఉంది. ఆస్పత్రిలోని ప్లాంటు గాలిలోని ఆక్సిజన్‌ను సేకరించి గంటకు 500 లీటర్ల ఆక్సిజన్‌ను సహజసిద్ధంగా తయారు చేసి 100 పడకలకు సరఫరా చేస్తుంది. కోవిడ్ కొత్త వేరియంట్ జేఎన్ 1 దేశవ్యాప్తంగా పాజిటివ్ కేసులు నమోదు అవుతుండడంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టెస్టులు, చికిత్సకు ఏర్పాట్లు చేసింది. కానీ కోవిడ్ పాజిటివ్ వచ్చిన వారికి అవసరమైన ఆక్సిజన్‌ను అందించేందుకు నిర్మించిన ప్లాంటు వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయడం లేదు. వినియోగంలోకి తీసుకొస్తే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆక్సిజన్‌తో వైద్యం అందించే రోగులతోపాటు కోవిడ్ బారిన పడిన వారికి 100 పడకల వరకు ఆక్సిజన్ నిరంతరం అందించే అవకాశం ఉంది.



ఆసుపత్రిలోని ఆక్సిజన్ ప్లాంటు

మరమ్మతుల కోసం నివేదించాం




ఆక్సిజన్ ప్లాంటు ప్రస్తుతం పనిచేయడం లేదు. బెల్ట్ తెగిపోవడంతో ఇండెంట్ పెట్టి వర్క్ ఆర్డర్ ఇచ్చాం. బెల్ట్ రాగానే ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు అవకాశం ఉంది.

– డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

ఆసియా స్థాయి

పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



వెండి పతకం సాధించిన స్వప్నిక

ధర్మపురి: గత నెల 27, 28, 29 తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కప్ పోటీల్లో ధర్మపురికి చెందిన విరంచి స్వప్నిక తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించింది. 84 కిలోల విభాగంలో మొత్తం 515 కిలోల బరువులెత్తి, వెండి పతకం సాధించి, రాష్ట్రంలోనే ఈ ఘనత పొందిన రెండో క్రీడాకారిణిగా నిలిచింది. సోమవారం నిర్వాహకుల నుంచి పతకం అందుకుంది. ఆమె మే నెలలో హాంకాంగ్‌లో జరిగే ఆసియా స్థాయి పోటీలకు ఎంపికైంది. స్వప్నిక మగ్గిడి మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్, కరీంనగర్‌లో డిగ్రీ చదివింది. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు వెంకటరమణ-శ్రీలత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బుచ్చన్న, పీడీ రాజేందర్, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రామానుజమ్మకు గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న రామానుజమ్మ


సిరిసిల్ల: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ 2023–24 పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన టమటం రామానుజమ్మ గోల్డ్ మెడల్ సాధించారు. 70 ఏళ్ల విభాగంలో షార్ట్‌పుట్‌లో గోల్డ్ మెడల్, పరుగు పందెంలోనూ రెండు పతకాలు గెలిచారు. ఫిబ్రవరి 8, 9, 10, 11వ తేదీల్లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.



రాముణ్ణి చెక్కిన చేతులు



● అమ్మవారిని కొలువుదీరుస్తూ...



● జగద్గురు ఆదిశంకరాచార్యులు

ఎంబిఏ చేసిన అరుణ్ యోగిరాజ్ కొన్నాళ్లు కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం చేశాడు. కాని అనువంశికంగా వస్తున్న కళ అతనిలో ఉంది. నా చేతులున్నది శిల్పాలు చెక్కడానికిగాని కీబోర్డు నొక్కడానికి కాదని ఉద్యోగం మానేశాడు. 2008 నుంచి అతను చేస్తున్న సాధన ఇవాళ దేశంలోనే గొప్ప శిల్పిగా మార్చింది. అంతే కాదు 'బాల రాముడి' విగ్రహాన్ని చెక్కి అయోధ్య ప్రతిష్ఠాపన వరకూ తీసుకెళ్లింది. తమలో ఏ ప్రతిభ ఉందో యువతా, తమ పిల్లల్లో ఏ నైపుణ్యం ఉందో తల్లిదండ్రులు తెలుసుకోవాలనడానికి ఉదాహరణ అరుణ్.

జనవరి 22న అయోధ్యలో అంగరంగ వైభవంగా జరగనున్న రామమందిర ప్రారంభోత్సవంలో ఒక్కో విశేషం తెలుస్తూ వస్తోంది. ప్రాణప్రతిష్ఠ జరగనున్న విగ్రహాల్లో 'బాల రాముడి' విగ్రహం సమర్పించే గొప్ప అవకాశం మైసూరుకు చెందిన 40 ఏళ్ల శిల్పి అరుణ్ యోగిరాజ్‌కు దక్కింది. కర్ణాటకకు చెందిన బీజేపీ పెద్దలు ఈ విషయాన్ని తెలియచేసి హర్షం వ్యక్తం చేశారు. అయితే ఇంకా అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

అయోధ్య రామమందిరంలో 'బాల రాముడి' విగ్రహం ప్రతిష్ఠ కోసం శిల్పం తయారు చేయమని దేశంలో ముగ్గురు శిల్పులకు శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ బాధ్యత అప్పజెప్పింది. వారిలో ఒకరు అరుణ్ యోగిరాజ్. ఇతని కుటుంబం ఐదు తరాలుగా శిల్ప కళలో పేరు గడించింది. అరుణ్ తండ్రి యోగిరాజ్, తాత బసవణ్ణ శిల్పులుగా కర్ణాటకలో పేరు గడించారు. అయితే అరుణ్ ఈ కళను నేర్చుకున్నా అందరిలాగే కార్పొరేట్ ఉద్యోగం వైపు దృష్టి నిలిపాడు. కాని రక్తంలో ఉన్న శిల్పకళే మళ్లీ అతణ్ణి తనవైపు లాక్కుంది. 2008 నుంచి శిల్పాలు తయారు చేస్తున్న అరుణ్ ఇప్పటికే అనేక కోట్ల శిల్పాలు స్థాపించి తన ప్రతిభ నిరూపించుకున్నాడు. అరుణ్ తయారు చేసిన శిల్పాల్లో కేదార్‌నాథ్‌లోని ఆది శంకరాచార్య విగ్రహంతో మొదలు మైసూరులోని ఆర్.కె.లక్ష్మణ్ విగ్రహం వరకూ ఉన్నాయి. మైసూర్ రైల్వే స్టేషన్‌లో 'లైఫ్ ఈజ్ ఏ జర్నీ' పేరుతో ఒక కుటుంబం లగేజ్‌తో ఉన్న శిల్పాలు ప్రతిష్ఠించి అందరి దృష్టినీ ఆకర్షించాడు అరుణ్. అలా రాముడి విగ్రహం చెక్కే అవకాశం పొందే వరకూ ఎదిగాడు.

51 అంగుళాల విగ్రహం

అరుణ్ చెక్కిన బాల రాముడి విగ్రహం శిరస్సు నుంచి పాదాల వరకు 51 అంగుళాల ఎత్తు ఉంటుంది. అరుణ్ భార్య విజేత వివరాలు తెలియచేస్తూ 'అరుణ్‌కి ఈ బాధ్యత అప్పజెప్పాక శిల్ప ఆకృతి గురించి అతడు ఎంతో పరిశోధించాల్సి వచ్చింది. దానికి కారణం బాల రాముడి విగ్రహం ఇలా ఉంటుందనడానికి ఎలాంటి రిఫరెన్స్ లేకపోవడమే. అందుకని అరుణ్ పురాణాల అధ్యయనంతో పాటు రాముడి వేషం కట్టిన దాదాపు 2000 మంది బాలల ఫొటోలు పరిశీలించాడు' అని తెలిపింది. ఈ విగ్రహం కోసం ట్రస్ట్ శిలను అందించింది అరుణ్‌కు. 'మామూలు గ్రానైట్ కంటే ఈ శిల దృఢంగా ఉంది. చెక్కడం సవాలుగా మారింది. అయినప్పటికీ తనకు వచ్చిన అవకాశం ఎంత విలువైనదో గ్రహించిన అరుణ్ రేయింబవళ్లు శిల్పాన్ని చెక్కి తన బాధ్యత నిర్వర్తించాడు' అని తెలిపింది విజేత.

తల్లి ఆనందం

కుమారుడు చెక్కిన శిల్పం రామ మందిరంలో ప్రాణప్రతిష్ఠ చేసుకోనుందన్న వార్త విన్న అరుణ్ తల్లి ఆనందంతో తబ్బిబ్బవుతోంది. మరణించిన భర్తను తలచుకొని ఉద్వేగపడుతోంది. 'అరుణ్ వాళ్ల నాన్న దగ్గరే శిల్పం చెక్కడం నేర్చుకున్నాడు. వాళ్ల నాన్న పేరు నిలబెడుతున్నాడు' అంది.

తల్లిదండ్రులు తెలుసుకోవాలి

తల్లిదండ్రులు పిల్లల బాగు కోరుతారు. అయితే అన్నీ తాము ఆదేశించినట్టుగా పిల్లలు నడుచుకోవాలన్న ధోరణి కూడా సరి కాదు. పిల్లలు తమకు ఇష్టమైన చదువులు చదవాలనుకుంటే ఎందుకు ఆ కోరిక కోరుతున్నారో పరిశీలించాలి. కళాత్మక నైపుణ్యాలుండి ఆ వైపు శిక్షణ తీసుకుంటామంటే వాటి బాగోగుల గురించి కనీసం ఆలోచించాలి. కఠినమైన చదువులకు అందరు పిల్లలూ పనికి రారు. రాని చదువును తప్పక చదవాల్సిందేనని హాస్టళ్లలో వేసి బాధించి ఇవాళ చూస్తున్న కొన్ని దుర్ఘటనలకు కారణం కారాదు. ఐశ్వర్యంతో జీవించడానికి కొన్నే మార్గాలు ఉండొచ్చు. కాని ఆనందంగా జీవించడానికి లక్షమార్గాలు. పిల్లల ఆనందమయ జీవితం కోసం చిన్నారుల ఆలోచనలను కూడా వినక తప్పదు.



సైగల చికిత్స

ట్రీట్‌మెంట్ కోసం పది రోజుల్లో సైన్ లాంగ్వేజ్ నేర్చుకున్న డాక్టర్లు, నర్సులు

మూగ, వినికిడి సమస్య ఉన్న ఆ దంపతులకు లేకలేక సంతానం కలిగింది. అదీ పూర్తి ప్రసవ సమయానికి రెండు నెలల ముందుగానే. కవలల్లో పేగు సమస్యతో అబ్బాయి చనిపోయాడు. ఇక ఇప్పుడు పాప ఒక్కత్తే ఆశాజ్యోతి. కేవలం 450 గ్రాముల బరువుతో మనుగడ అవకాశాలు తక్కువ. పాపను ఎలాగైనా దక్కించుకునేందుకు ఏ విధంగానైనా ఆమెను బతికించుకునేందుకు పేరెంట్స్‌తో కమ్యూనికేట్ చేయడం తప్పనిసరి అయ్యింది. కనీస సంభాషణల కోసం కష్టపడి పదిరోజుల్లోనే సైగల భాషనూ, సంజ్ఞాశాస్త్ర పరిజ్ఞానాన్ని నేర్చుకోవడంలో విజయ సాధించారు అక్కడి కొందరు డాక్టర్లూ, నర్సులు. ఆ పాప ఇప్పుడు బతుకు బ్యారియర్స్‌ను బద్దలు కొట్టింది. నాలుగు నెలల వయసుకే అనేక అడ్డంకుల్ని అధిగమించింది. జీవన సమరంలో తొలి విజయం సాధించింది. విజయవంతంగా మనుగడ పోరాటం సాగిస్తోంది.

హైదరాబాద్‌కు చెందిన దంపతులు రాజ్‌కుమార్ వయసు 55 ఏళ్లు. భాగ్యమ్మకు 47. ఇద్దరూ మూగవారు. వినికిడి, మాట సమస్యలున్నాయి. అప్పటికే ఓ చిన్నారిని కోల్పోయారు. ఎలాగైనా తమకు సంతానం కావాలని కోరిక. ఎట్టకేలకు భాగ్యమ్మ గర్భవతి అయ్యింది. తన 47వ ఏట ప్రసవించింది. కానీ 28 వారాలకే ప్రీమెచ్యూర్‌గా పుట్టిన పిల్లలు. అంటే ఏడునెలలకే జరిగిన ప్రసవం. రెండు నెలలు ముందుగానే ప్రసవం కావడంతో కవలలు బాగా తక్కువ బరువుతో పుట్టారు. బాబు కేవలం 900 గ్రాములు. పాప బరువు మరీ తక్కువ. కేవలం 450 గ్రాములు!!

మరో ఆసుపత్రిలో ప్రసవం తర్వాత... పుట్టీ పుట్టగానే ఆ బిడ్డలకు కొన్ని సమస్యాత్మకమైన రుగ్మతలు ఉండటంతో తల్లినీ, బిడ్డను కొండాపూర్‌లోని కిమ్స్–కడల్స్ నియోనేటాలజీ విభాగంలో చేర్చారు. ఆ విభాగం డైరెక్టర్ డాక్టర్ అపర్ణ నేతృత్వంలో చికిత్స మొదలుపెట్టారు. బాబుకు నెక్రొటైజింగ్ ఎంటరోకొలైటిస్ అనే పేగుల సమస్య ఉండటంతో శస్త్రచికిత్స తప్పలేదు. కానీ బాబు దక్కలేదు.

ఎన్నో వైద్య ప్రక్రియల తర్వాత, మరెన్నో నోముల తర్వాత పండిన పంట అది. ఒడి నిండినట్టే నిండిందిగానీ... ఒడిబియ్యంలో సగం జారిపోయింది. పాప తల్లిదండ్రుల వయసుపరంగా, లేదా మరేరకంగా చూసినా ఆ బంగారు తల్లిని కాపాడుకోక తప్పని పరిస్థితి. కొంగున మిగిలింది సగం బంగారమే కావడంతో ఇప్పుడా కొంగుబంగారం మరీ మరీ అపురూపం. కానీ పాప బరువు అరకిలో కంటే మరో 50 గ్రాములు తక్కువే. వైద్యసిబ్బందికి ఇదో సవాల్‌గా మారింది.

తొలినాళ్లలో కుటుంబ స్నేహితుడి సాయంతో సంభాషణలు...

పాప తల్లిదండ్రులిద్దరూ మూగ, వినికిడి సమస్య ఉన్నవారైనప్పటికీ వైద్యులకు వారితో సంభాషించడం తప్పదు. తొలి నాళ్లలో రాజ్‌కుమార్‌కు తెలిసిన ఓ అబ్బాయే ఆ దంపతులకూ, వైద్య సిబ్బందికి మధ్య సంజ్ఞావారధిగా నిలబడ్డాడు. అతడో కాలేజీ విద్యార్థి. సంజ్ఞల భాష (సైన్ లాంగ్వేజ్)తో సంభాషణలు జరిపేవాడు. కొన్నాళ్ల సెలవు తర్వాత రాజ్‌కుమార్ తన విధులకు హాజరవ్వక తప్పనిస్థితి. తండ్రి ఆఫీసులో, తల్లి ఆసుపత్రిలో. సంజ్ఞల వారధి తన చదువుల్లో, తన పనుల్లో మరో చోట. అయినప్పటికీ ఎలాగోలా పేపర్ల మీద రాసిచూపుతూనో, వీడియో కాల్స్ ద్వారానో సంభాషణలు కొనసాగుతున్నాయి.

ఇంతలో ఇంటర్‌ప్రెటర్‌గా ఉన్న వ్యక్తికి పరీక్షలు వచ్చాయి. ఎప్పుడు పడితే అప్పుడు మాట్లాడేందుకు అవకాశం లేకపోయింది. ఆసుపత్రిలో చేర్చిన తొలినాళ్లలో రాజ్‌కుమార్ కొందరు వైద్యసిబ్బందికి సంకేతభాష (సైన్ లాంగ్వేజీ) నేర్పించేందుకు కొంత ప్రయత్నించారు. అప్పుడెవ్వరికీ దాని అవసరం అంతగా ఉన్నట్లు తోచలేదు. కానీ ఇప్పుడు తప్పని స్థితి!



● తల్లి, చిన్నారితో వైద్య సిబ్బంది

మేము, మా సిబ్బంది అవసరమైన మేరకు సైన్‌లాంగ్వేజీలో పరిజ్ఞానం సంపాదించాం...



పాపను రక్షించుకునేందుకు సైన్ లాంగ్వేజ్ నేర్చుకోక తప్పలేదు. కొందరిలో కొత్తభాషను నేర్చుకునే పరిజ్ఞానం ఎక్కువగా ఉంటుంది కదా. అలాంటి వారు ఇతరులకు నేర్పారు. ఇలా ఆ టీమ్‌లోని పదిమంది డాక్టర్లలో ఐదారుగురు, నర్సుల్లో నలుగురైదుగురు, ఇతర సిబ్బందిలో మరికొందరు... తల్లిదండ్రులకు అవసరమైన మేరకు వివరాలను సూచించేంతగా సైన్‌లాంగ్వేజీలో ప్రాక్టీస్ సాగించారూ. నైపుణ్యం సాధించారు. చిన్నారిని బతికించుకున్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ సమయంలో కంటి పరీక్షలూ, న్యూరో... ఇలా అన్ని రకాల పరీక్షలూ నిర్వహించాం. మరీ ముఖ్యంగా వినికిడి పరీక్షలు. ఆ చిన్నారిలో ఎలాంటిలోపాలూ లేవు. అన్నీ నార్మల్.

– డాక్టర్ అపర్ణ, క్లినికల్ డైరెక్టర్–నియోనేటాలజీ

ఇక డాక్టర్లూ, వైద్యసిబ్బందీ సంభాషించక తప్పలేదు...

పాపకు జరిగే వైద్య పరీక్షల గురించి తల్లిదండ్రులకు చెప్పాలి. చిన్నారి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలనూ, చేపట్టాల్సిన విధానాల్ని తల్లికి వివరించాలి. పాలు పట్టాల్సినప్పటి ప్రక్రియలను, ఆహారమివ్వాల్సిన తీరుతెన్నులను, బిడ్డను తల్లిగుండెలకు దగ్గరగా ఉంచేందుకు అనుసరించాల్సిన 'కంగారూ కేర్' ప్రక్రియల్ని విపులీకరించాలి. ఇందుకు ఇరువురికీ అర్థమ్యే భాష కావాలి. కానీ ఎలా?

పది రోజుల్లో అవసరమైనమేరకు శిక్షణ...

తొలినాళ్లలో రాజ్‌కుమార్ తమకు కొన్ని బేసిక్స్ నేర్పడానికి ప్రయత్నించడం గుర్తొచ్చింది. అంతే... చిన్నారిని కాపాడుకునేందుకు అవసరమైన మేరకు సైన్ లాంగ్వేజ్‌ను ఆయననుంచే నేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు మెడికల్ టీమ్‌లోని కొందరు.

మొత్తం పది మంది వైద్యబృందంలో కొందరు డాక్టర్లు, మరి కొందరు నర్సులూ, ఇంకొందరు సహాయక వైద్య సిబ్బంది సంజ్ఞా భాష నేర్చుకోవడం మొదలుపెట్టారు. దాదాపు పదిరోజుల్లో సైగల భాషలోని అల్ఫాబెట్స్, సంఖ్యలూ, రోజులూ, వారాల పేర్లు, ఇతర వివరాలను కష్టపడి నేర్చుకున్నారు. కమ్యూనికేట్ చేస్తున్నారు.

తొలి విజయం ఆ మృత్యుంజయురాలిదే...

గత ఏడాది ఆగస్టులో ఆసుపత్రిలో చేరిన ఆ తల్లి దాదాపు మూడు నెలల పాటు (సరిగ్గా చెప్పాలంటే 79 రోజులు) ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చింది. కేవలం 450 గ్రాములున్న ఆ చిన్నారి క్రమంగా 1200 గ్రాములకు చేరింది. నవంబరులో డిశ్చార్జ్ నాటికి ఆ పాప బరువు 1800 గ్రాములు. మనుగడ పోరాటంలో తొలి అవరోధాలన్నింటినీ అధిగమించింది... బతుకుకు అడ్డంకి లేని బరువు సాధించింది. ప్రస్తుతం తనకు 4 నెలల వయసు. డాక్టర్ల అంచనాల ప్రకారం... అందరిలాగే మరో మూడు–నాలుగు నెలల్లో ముద్దు మాటలు (బ్యాబ్లింగ్స్) మొదలుపెట్టాలి. అందుకు వైద్యపరంగా ఎలాంటి అవరోధాలూ, అడ్డంకులూ లేవు. ప్రస్తుతానికి... ముందు ముద్దులు మూటగడుతోంది. ముందుముందు మాటలు దండగట్టాల్సి ఉంది.

– యాసీన్

● ముగ్గు–ముచ్చట

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్–34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com





బి. రామలక్ష్మి
కల్లూరు,
ఖమ్మం జిల్లా

22 చుక్కలు
సరి చుక్క
2 వచ్చేవరకు





కాసర లక్ష్మి
సరోజారెడ్డి
జంగారెడ్డి గూడెం

21 చుక్కలు
మధ్యచుక్క
11 వచ్చేవరకు



50 అనివార్య ఖర్చులు 30 సరదా ఖర్చులు 20 పొదుపు

యూత్ ప్లస్

ట్రెండ్స్ స్థిరంగా ఉండనట్లే ఆలోచనలు, అభిప్రాయాలు కూడా స్థిరంగా ఉండవు. జెన్ జెడ్, మిలీనియల్స్ కొత్త ప్రయాణం కొత్త సంవత్సరంలో ఎలా ఉండబోతుంది? యోలో(వైవోఎల్‌వో–యూ వోన్లీ లివ్ వన్స్) సెగ్మెంట్‌లో ఉన్న యువతరం అవసరానికి మించి ఖర్చు చేయడానికి తప్ప 'ఆర్థిక భద్రత'కు పెద్దగా ప్రాధాన్యత ఇచ్చేది కాదు. అయితే ఈ ధోరణిలో ఇప్పుడిప్పుడే మార్పు వస్తోంది. 'యోలో' నుంచి 50–30–20 కాన్సెప్ట్ వైపు ప్రయాణించడానికి యువతరం ఆసక్తి చూపుతున్నారు...

సినిమాల గురించి తప్ప మరో లోకంతో సంబంధం లేనట్లుగా ఉండే మిలీనియల్స్, జెన్ జెడ్ ఇప్పుడు సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ నుంచి పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ వరకు ఎన్నో విషయాలపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(ఎస్ఐపీ) అనేది మ్యూచువల్ ఫండ్స్‌లో నిర్ణీత మొత్తాన్ని నెలవారీ లేదా త్రైమాసికం చొప్పున పెట్టుబడిగా పెట్టే ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(పిపిఎఫ్) అనేది ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు, ట్యాక్స్ బెనిఫిట్స్‌ను అందించే దీర్ఘకాలిక పొదుపు పథకం. పదిహేను సంవత్సరాల లాక్–ఇన్ వ్యవధిని కలిగి ఉన్న ప్రభుత్వ పథకం ఇది.

'హెల్త్ ఇన్సూరెన్స్' అనే మాట వినబడగానే 'ఇది నాకు సంబంధించిన విషయం కాదు' అన్నట్లుగా పట్టించుకునే వారు కాదు చాలా మంది. 'హెల్త్ ఇన్సూరెన్స్' అనేది వయసు మళ్లిన వారికి సంబంధించిన విషయం అన్నట్లుగా ఉండేవారు. అయితే ఇప్పుడు సీన్ మారింది. ఎర్లీ ఏజ్‌లోనే హెల్త్ ఇన్సూరెన్స్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తగిన అవగాహనతో ఉన్నారు. అన్ ఎక్స్‌పెక్టెడ్ మెడికల్ సిచ్యువేషన్స్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక బడ్జెట్ కేటాయించుకుంటున్నారు. యాన్యువల్ హెల్త్‌బడ్జెట్‌ను ప్లాన్ చేసుకుంటున్నారు. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న 'పర్సనల్ యాక్సిడెంట్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్స్'పై ఆసక్తి చూపుతున్నారు. 'సరైన ఆరోగ్య బీమా పథకాన్ని ఎంపిక చేసుకోవడం అనేది జీవన ప్రయాణానికి దిక్సూచి లాంటిది' అనే మాటను దృష్టిలో పెట్టుకొని హడావిడిగా కాకుండా ఆచితూచి సరియైన హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను ఎంచుకుంటున్నారు.

'ఫైనాన్షియల్ ప్లాన్' అనే మాట వినబడగానే ఒకప్పుడు యువతరం నోటి నుంచే వచ్చే మాటలు...

'అబ్బే! అంత టైమ్ లేదు'

'ఫైనాన్షియల్ విషయాలు నాకు బొత్తిగా తెలియవు'

ఇప్పుడు మాత్రం 'బొత్తిగా తెలియదు' అనుకునే విషయాలపై టైమ్ చేసుకొని మరీ ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో మిలీనియల్స్, జెన్ జెడ్‌ను బాగా ఆకట్టుకున్న కాన్సెప్ట్ 50–30–20

'50–30–20' కాన్సెప్ట్ ప్రకారం సంపాదించే జీతంలో అనివార్య ఖర్చులకు 50 శాతం ఖర్చుచేయాలి. ఇంటి అద్దె నుంచి భోజన ఖర్చు వరకు ఇందులో ఉంటాయి. వ్యక్తిగత అవసరాలు, సరదాల కోసం 30 శాతం ఖర్చు చేయాలి. ట్రెండీ దుస్తులు కొనుక్కోవడం నుంచి సినిమాలు చూడడం వరకు ఇందులో వస్తాయి. 20 శాతం మాత్రం తప్పనిసరిగా పొదుపు చేయాలి.

'మిలీనియల్స్‌లో చాలా మంది ఇన్సూరెన్స్‌ల గురించి పట్టించుకోవడం లేదు. అనారోగ్యం లేదా ప్రమాదం జరిగిన సందర్భాల్లో మన ఖజానా అంతా ఖాళీ అవుతుంది. దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే లైఫ్, హెల్త్, ఆటో ఇన్సూరెన్స్‌పై మిలీనియల్స్ తప్పనిసరిగా దృష్టి పెట్టాలి' అంటున్నాడు ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్ శరద్ కోహ్లీ. శరద్ సలహా చదివి మారిన వారిలో తేజస్విని ఒకరు. ఢిల్లీకి చెందిన తేజస్వినికి ఇన్సూరెన్స్ పాలసీల గురించి ఆసక్తి, అవగాహన లేదు. ఇప్పుడు మాత్రం రకరకాల పాలసీల గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తోంది.

ఉద్యోగాలు చేస్తున్న మిలీనియల్స్, జెన్ జెడ్ దగ్గర 'ఇన్వెస్ట్‌మెంట్ ఫర్ రిటైర్‌మెంట్' ప్రస్తావన తెస్తే పెద్దగా నవ్వుతారు లేదా 'రిటైర్‌మెంట్ గురించి ఇప్పటి నుంచే ఆలోచించడం ఎందుకు!' అన్నట్లుగా మాట్లాడుతారు. అయితే ఈ ధోరణిలో కూడా మెల్లగా మార్పు వస్తుంది.

'రిటైర్‌మెంట్ లేదా భవిష్యత్ కోసం దాచుకున్న డబ్బు అత్యవసర సమయాల్లోనే కాదు విదేశీ ప్రయాణం చేయాలి లాంటి చిరకాల కలలను నిజం చేసుకోవడానికి ఉపయోగపడవచ్చు. ప్రతి ఉద్యోగి ఏదో ఒకరోజు రిటైర్ కావాల్సిందే. కొన్ని సమయాల్లో ముందస్తు పదవీ విరమణ తప్పనిసరి కావచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇన్వెస్ట్ ఫర్ రిటైర్‌మెంట్‌ను తప్పనిసరిగా దృష్టిలో పెట్టుకోవాలి' అంటున్నాడు శరద్ కోహ్లీ.

స్టాక్ మార్కెట్ నుంచి మనీ మేనేజ్‌మెంట్ వరకు

సోషల్ మీడియాలో ఎంటర్‌టైన్‌మెంట్‌కు మాత్రమే యువత ప్రాధాన్యత ఇస్తుంది. స్టాక్‌మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌లాంటి మాటలు వినబడితే దూరంగా పారిపోయే వారిని కూడా తన మాటలతో, రాతలతో ఆకట్టుకొని నాలుగు మంచి విషయాలు చెబుతుంది నేహా నగార్. ఎంబీయే చేసిన నేహా స్టార్ ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా యువతలో ఎంతోమంది ఆలోచనల్లో మార్పు తీసుకువచ్చింది. స్టాక్‌మార్కెట్, క్రిప్టో కరెన్సీ, ట్యాక్సియేషన్, ట్రేడింగ్ నుంచి మనీ మేనేజ్‌మెంట్ వరకు ఎన్నో విషయాలను సులభంగా అర్థం అయ్యేలా చెబుతుంది. 'మనం ఎలా చెబుతున్నాం అనేదానిపై అవతలి వారి ఆసక్తి ఆధారపడి ఉంటుంది. ఆకట్టుకునేలా, సులభంగా అర్థమయ్యేలా చెప్పగలితే వారు మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతారు' అంటుంది నేహా నాగర్.





నేహా నాగర్
ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్



నాదల్ ఖాతాలో తొలి విజయం

తుంటి గాయం నుంచి కోలుకున్న స్పెయిన్ టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదల్ కొత్త ఏడాదిలో తొలి విజయం అందుకున్నాడు. బ్రిస్బేన్ ఓపెన్ టోర్నీ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో నాదల్ 7-5, 6-1తో ప్రపంచ మాజీ మూడో ర్యాంకర్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు. గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌లో ఓడిపోయాక నాదల్ తుంటి గాయంతో మరే టోర్నీలోనూ ఆడలేదు. బ్రిస్బేన్ ఓపెన్‌తో పునరాగమనం చేసిన నాదల్ ఇదే టోర్నీ డబుల్స్‌లోనూ బరిలోకి దిగి తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు. సింగిల్స్‌లో మాత్రం శుభారంభంతో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు.

రిత్విక్ జోడీ శుభారంభం



థాయ్‌లాండ్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరి డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. బ్యాంకాక్‌లో మంగళవారం జరిగిన డబుల్స్ తొలి రౌండ్‌లో రిత్విక్ చౌదరి-నిక్కీ పునాచా (భారత్) ద్వయం 6-3, 6-1తో సెబినాటో-ఫోనియో (ఇటలీ) జోడీని ఓడించింది. ఇదే టోర్నీలో ఆడుతున్న సాకేత్ మైనేని-రామ్‌కుమార్ జంట తొలి రౌండ్‌లో 5-7, 6-3, 8-10తో రే హో (చైనీస్ తైపీ)-యున్ సెంగ్ చుంగ్ (కొరియా) ద్వయం చేతిలో ఓడిపోయింది.

సమం చేస్తారా... అప్పగిస్తారా!



రోహిత్ శర్మ

దక్షిణాఫ్రికాలో గతంలో ఎనిమిదిసార్లు పర్యటించినా... భారత జట్టు ఒక్కసారి కూడా సిరీస్ గెలవలేకపోయింది... ఈసారీ ఆ అవకాశం ఇప్పటికే చేజారింది. అయితే గత రెండు పర్యటనల్లో కనీసం ఒక్క టెస్టు మ్యాచ్ అయినా విజయం సాధించగలిగింది. 2013లో మాత్రమే విజయం లేకుండా రిక్తహస్తాలతో తిరిగొచ్చింది. తొలి టెస్టు ఓడినా... ఇప్పుడు తమ స్థాయికి తగ్గ ఆటతో చెలరేగి టీమిండియా సిరీస్‌ను సమం చేస్తుందా లేక విజయం లేకుండా వెనుదిరుగుతుందా అనేది చూడాలి. మ్యాచ్ జరిగే న్యూలాండ్స్ మైదానంలో ఆరు ప్రయత్నాల్లో ఒక్కసారి గెలవలేకపోవడం రికార్డుపరంగా భారత్‌కు ప్రతికూలాంశం కూడా.

నేటి నుంచి దక్షిణాఫ్రికాతో భారత్ రెండో టెస్టు	సిరీస్ కాపాడుకునే ప్రయత్నంలో టీమిండియా	జోరు మీదున్న సఫారీ టీమ్	మధ్యాహ్నం గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కేప్‌టౌన్: తొలిసారి సఫారీ గడ్డపై సిరీస్ గెలిచే సంకల్పంతో బరిలోకి దిగిన భారత జట్టు పేలవ ప్రదర్శనతో తొలి టెస్టులో ఇన్నింగ్స్ తేడాతో ఓడింది. ఇప్పుడు దానిని మరచి ప్రత్యర్థిపై పైచేయి సాధించేందుకు మరో అవకాశం వచ్చింది. మరోవైపు సొంతగడ్డపై జోరు మీదున్న సఫారీ టీమ్ క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో నేటినుంచి జరిగే రెండో టెస్టులో భారత్, దక్షిణాఫ్రికా తలపడనున్నాయి. భారత్ మ్యాచ్ ఓడినా, 'డ్రా' అయినా సిరీస్ కోల్పోతుంది. కాబట్టి సమం చేయాలంటే టెస్టులో గెలవడం తప్పనిసరి.

జట్టులోకి జడేజా...

తొలి టెస్టులో ఒక్కో ఇన్నింగ్స్‌లో రాహుల్, కోహ్లి ప్రదర్శన మినహా చెప్పుకోవడానికేమీ లేదు. మన జట్టు రెండు ఇన్నింగ్స్‌లు కలిపి కూడా దక్షిణాఫ్రికా ఒక ఇన్నింగ్స్‌లో ఆడినన్ని ఓవర్లు ఆడలేకపోయింది. యశస్వి, గిల్, శ్రేయస్‌ల బ్యాటింగ్ వైఫల్యం భారత్ పరాజయంలో ఒక కారణంగా నిలిచింది. కెప్టెన్ రోహిత్ కూడా విఫలం కావడం జట్టుపై ప్రభావం చూపించింది. దక్షిణాఫ్రికా గడ్డపై రోహిత్ రికార్డు చాలా పేలవం. 10 ఇన్నింగ్స్‌లలో కలిపి అతను 128 పరుగులే చేశాడు. ఇక్కడ చివరి సిరీస్ ఆడబోతున్న రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లోనైనా ఘనంగా ముగింపు ఇవ్వాలని పట్టుదలగా ఆడితే భారత్‌కు శుభారంభం లభిస్తుంది. తొలి టెస్టులో చక్కటి షాట్లతో ఆకట్టుకున్న కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లి తమ ఫామ్‌ను కొనసాగించడం కీలకం. గాయంతో గత మ్యాచ్‌కు దూరమైన జడేజా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగనుండటం జట్టుకు సానుకూలాంశం. జడేజా కోసం అశ్విన్‌ను పక్కన పెట్టవచ్చు. అయితే ఆల్‌రౌండర్‌గా శార్దుల్ ఠాకూర్ స్థానంపై గత మ్యాచ్ ప్రదర్శన సందేహాలు రేకెత్తించింది. బౌలింగ్‌లో పూర్తిగా విఫలమైన అతని స్థానంలో రెగ్యులర్ పేస్ బౌలర్‌ను తీసుకోవాలా లేక అశ్విన్‌ను రెండో స్పిన్నర్‌గా కొనసాగించాలా అనే దానిపై టీమ్ మేనేజ్‌మెంట్ తేల్చుకోలేకపోతోంది. టాపార్డర్ విఫలమైతే చివర్లో కొన్ని పరుగులు కావాలంటే శార్దుల్ సరైన ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాడు. పేసర్ ప్రసిధ్ కృష్ణ ఘోరంగా విఫలమైనా... ఒక్క మ్యాచ్‌కే అతనిపై వేటు వేయడం సరైన ఆలోచన కాదు. కెప్టెన్ రోహిత్ శర్మ మాటలను బట్టి చూసినా ప్రసిధ్‌కు మరో అవకాశం దక్కవచ్చు. ఓవరాల్‌గా బ్యాటింగ్‌పరంగా భారత్ సరైన స్థితిలోనే కనిపిస్తున్నా...బౌలింగ్‌లో మెరుగైతేనే విజయావకాశాలు ఉంటాయి.

కొయెట్జీ స్థానంలో ఎన్‌గిడి

'నాకు సంబంధించి ఇదే వరల్డ్ కప్. అందుకే విజయంతో ఘనంగా ముగిద్దామనుకుంటున్నా'... తన చివరి టెస్టులో కెప్టెన్‌గా వ్యవహరించున్న డీన్ ఎల్గర్ వ్యాఖ్య ఇది. గత మ్యాచ్‌లోనూ సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఎల్గర్ సిరీస్‌ను 2-0తో గెలుచుకోవాలని పట్టుదలగా ఉన్నాడు. కేప్‌టౌన్‌లో తమ రికార్డు కూడా ఆ జట్టులో ఉత్సాహం పెంచుతోంది. ఎల్గర్‌తో పాటు జోర్జి ఫామ్‌లో ఉండగా బెడింగామ్ తనను తాను నిరూపించుకున్నాడు. సీనియర్ మార్క్‌రమ్‌తో పాటు పీటర్సన్ కూడా రాణిస్తే భారీ స్కోరు ఖాయం. గాయపడి మ్యాచ్‌కు దూరమైన బవుమా స్థానంలో హమ్జాకు చోటు దక్కింది. బౌలింగ్‌లో సఫారీ మరింత పదునుగా కనిపిస్తోంది. ఈ మైదానంలో 20.95 సగటుతో 42 వికెట్లు తీసిన ఘనమైన రికార్డు రబడ సొంతం. బర్గర్ తొలి టెస్టులోనే సత్తా చాటాడు. గాయపడిన కొయెట్జీ స్థానంలో ఎన్‌గిడి వస్తాడు. భారత్‌ను ఈ పేస్ బలగం తీవ్రంగా ఇబ్బంది పెట్టవచ్చు. స్పిన్నర్ లేకుండా టీమ్ బరిలోకి దిగే చాన్స్ ఉంది.



దక్షిణాఫ్రికా కెప్టెన్ ఎల్గర్

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి, గిల్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, జడేజా, శార్దుల్, బుమ్రా, సిరాజ్, ప్రసిధ్.

దక్షిణాఫ్రికా: ఎల్గర్ (కెప్టెన్), మార్క్‌రమ్, జోర్జి, పీటర్సన్, హమ్జా, బెడింగామ్, వెరీన్, జాన్సెన్, ఎన్‌గిడి, రబడ, బర్గర్.

పిచ్, వాతావరణం

మ్యాచ్‌కు ముందు రోజు పిచ్‌పై పచ్చిక కనిపిస్తోంది. తొలి రోజు వాతావరణాన్ని బట్టి చూస్తే సీమర్లు ప్రభావం చూపించగలరు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. టెస్టుకు వర్ష సూచన లేదు.

భారత్ 0... ఆసీస్ 3

- చివరి వన్డేలోనూ ఓడిన భారత మహిళల జట్టు
- సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన ఆస్ట్రేలియా



లిచ్‌ఫీల్డ్



హర్మన్

ముంబై: భారత మహిళల జట్టు కొత్త ఏడాదిని భారీ పరాజయంతో ప్రారంభించింది. ఆస్ట్రేలియాతో మంగళవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో టీమిండియా ఏకంగా 190 పరుగుల తేడాతో ఓడిపోయింది. వరుసగా మూడో విజయంతో ఆస్ట్రేలియా సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 338 పరుగుల భారీస్కోరు చేసింది. భారత జట్టుపై ఆస్ట్రేలియాకిదే అత్యధిక స్కోరు కావడం విశేషం. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' ఫోబీ లిచ్‌ఫీల్డ్ (125 బంతుల్లో 119; 16 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ అలీసా హీలీ (85 బంతుల్లో 82; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగి తొలి వికెట్‌కు 189 పరుగులు జోడించారు. వన్డేల్లో భారత జట్టుపై ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం గమనార్హం. భారత బౌలర్లలో శ్రేయాంక 3, అమన్‌జోత్ 2 వికెట్లు తీశారు. 339 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 32.4 ఓవర్లలోనే 148 పరుగులకే కుప్పకూలింది. బ్యాటర్లు మూకుమ్మడిగా చేతులెత్తేశారు. స్మృతి మంధాన (29; 5 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా, జెమీమా రోడ్రిగ్స్ (25; 3 ఫోర్లు), దీప్తి శర్మ (25 నాటౌట్; 2 ఫోర్లు)లు 20 పైచిలుకు స్కోర్లు చేశారంతే! కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (3) వరుసగా మూడో మ్యాచ్‌లోనూ విఫలమైంది. వేర్‌హమ్ 3, మేగన్ షుట్, అలానా కింగ్, అనాబెల్ సదర్లాండ్ తలా 2 వికెట్లు తీశారు.

దబంగ్ ఢిల్లీ పైచేయి

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో దబంగ్ ఢిల్లీ జట్టు ఐదో విజయం నమోదు చేసింది. గుజరాత్ జెయింట్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 35-28తో గెలిచింది. ఢిల్లీ తరఫున అశు మలిక్ 11 పాయింట్లు, మంజీత్ 9 పాయింట్లు స్కోరు చేశారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో హరియాణా స్టీలర్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్; పుణేరి పల్టన్‌తో యూపీ యోధాస్ తలపడతాయి.

పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	8	7	1	0	36
గుజరాత్ జెయింట్స్	10	6	4	0	34
దబంగ్ ఢిల్లీ	9	5	3	1	30
జైపూర్ పింక్ పాంథర్స్	8	4	2	2	28
పట్నా పైరేట్స్	9	5	4	0	27
యు ముంబా	7	5	2	0	26
హరియాణా స్టీలర్స్	8	5	3	0	26
బెంగళూరు బుల్స్	10	4	6	0	25
బెంగాల్ వారియర్స్	9	3	4	2	22
యూపీ యోధాస్	10	3	6	1	21
తమిళ్ తలైవాస్	9	2	7	0	13
తెలుగు టైటాన్స్	9	1	8	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

ప్లీజ్... నా క్యాప్ ఇవ్వండి

చోరీకి గురైన బ్యాగీ గ్రీన్ టోపీ కోసం ఆసీస్ స్టార్ డేవిడ్ వార్నర్ వినతి



సిడ్నీ: ఆస్ట్రేలియా డాషింగ్ బ్యాటర్ డేవిడ్ వార్నర్ కెరీర్‌లో ఆఖరి టెస్టు కోసం బరిలోకి దిగాల్సిన సమయంలో చేదు అనుభవాన్ని ఎదుర్కొంటున్నాడు. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) టెస్టు క్రికెట్ కోసం క్రికెటర్లకు 'బ్యాగీ గ్రీన్' టోపీలు ఇస్తుంది. ఇవి ఎందుకంత ప్రత్యేకమంటే వీటిని అరంగేట్రం చేసే మ్యాచ్‌లో మాత్రమే ఇస్తారు. ఆసీస్ క్రికెటర్లకు అదెంతో అమూల్యమైంది. ఇది వరకే రిటైర్మెంట్ ప్రకటించిన 37 ఏళ్ల వార్నర్ బుధవారం నుంచి పాకిస్తాన్‌తో ఆఖరి టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. అయితే అతని బ్యాక్‌ప్యాక్ నుంచి రెండు బ్యాగీ గ్రీన్ క్యాపుల్ని ఎవరో దొంగిలించారు. 2017లోనూ చోరీకి గురవడంతో బోర్డు మరో క్యాప్ ఇచ్చింది. పాత టోపీ మళ్లీ దొరకడంతో అతని వద్ద రెండు క్యాపులున్నాయి. తాజాగా ఆ టోపీలు చోరీకి గురవడంతో వార్నర్ వీడ్కోలు టెస్టుకు ముందు సోషల్ మీడియాలో వేడుకోలు చేసుకున్నాడు. 'క్రికెట్ కిట్‌లో కాకుండా నా బ్యాక్‌ప్యాక్ బ్యాగులో పెట్టుకున్న రెండు క్యాపులు చోరీకి గురయ్యాయి. ఎవరైనా వాటిని తీసుకొని ఉంటే దయచేసి నాకు ఇవ్వండి' అని వార్నర్ వీడియో పోస్ట్ చేశాడు.

సినిమా

టీజర్ రెడీ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో వచ్చిన చిత్రం 'యాత్ర'. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'యాత్ర 2' ఫిబ్రవరి 8న రిలీజ్ కానుంది. వైఎస్సార్ తనయుడు, ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజానాయకుడిగా ఎదిగిన తీరు, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో 'యాత్ర 2' ఉంటుంది. ఈ చిత్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మమ్ముట్టి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో జీవా నటిస్తున్నారు. మహి వి. రాఘవ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 5న రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించి, ఓ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసింది చిత్రబృందం. ''ఒక మనిషి, లక్షల సమస్యలు.. అయినా ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి'' అంటూ 'యాత్ర 2' టీజర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను షేర్ చేసింది యూనిట్. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్‌తో కలిసి శివ మేక ఈ సినిమాను నిర్మిస్తున్నారు.



● జీవా, మమ్ముట్టి

అలాంటి జీవితం అంటే ఇష్టం

''నాకు నచ్చింది చేయడం ఇష్టం. మనకు నచ్చింది చేయాలనుకున్నప్పుడు జీవితంలో ఎన్ని సమస్యలు ఉన్నా వాటిని బ్యాలెన్స్ చేసుకోగలుగుతామని నా నమ్మకం. నాపై నాకు ఆ భరోసా ఉంది'' అని అంటున్నారు హాలీవుడ్ నటి, సింగర్ ఎల్నాజ్ నోరౌజీ. హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో వెబ్ సిరీస్‌లు, సినిమాలు చేసిన ఈ హాలీవుడ్ బ్యూటీ ఇటీవల 'డెవిల్' సినిమాతో తెలుగు తెరపై మెరిశారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో నోరౌజీ మాట్లాడుతూ– ''ఇరాన్‌లో పుట్టిన నేను, జర్మనీలో పెరిగాను. నా చిన్నప్పట్నుంచి హాలీవుడ్, బాలీవుడ్ సినిమాలు చూస్తూ పెరిగాను. బాలీవుడ్ సినిమాల్లో నటించాలన్న నా కలను నేరవేర్చుకున్నాను. టెలివిజన్‌లో కొన్ని షోలు చేశాను. ఎనిమిదేళ్లుగా ఇండియాలోనే ఉంటున్న నేను ఇప్పుడు సౌత్ సినిమాలు చేయాలనుకుంటున్నాను. 'డెవిల్' సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్‌తో తెలుగు ప్రేక్షకులకు దగ్గర కావడం హ్యాపీగా ఉంది. తెలుగు ప్రేక్షకుల ఆదరణ నాకు దక్కిందనే భావిస్తున్నాను. హిందీలో నవాజుద్దీన్ సిద్ధిఖీతో నేను చేసిన 'సంగీన్' అనే ఓ థ్రిల్లర్ ఫిల్మ్ రిలీజ్‌కు సిద్ధం అవుతోంది. 'రాణీతి' అనే వెబ్ సిరీస్ ఉంది. 'వోహ్' అనే సాంగ్ చేస్తున్నాను. మరికొన్ని ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అన్నారు.



● ఎల్నాజ్ నోరౌజీ

థ్రిల్లర్ షురూ



● వరుణ్ సందేశ్

వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం మంగళవారం ప్రారంభమైంది. అద్యాంత్ హర్ష దర్శకత్వంలో మహర్షి కూండ్ల సమర్పణలో మహేంద్రనాథ్ కూండ్ల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తొలి సన్నివేశానికి వరుణ్ సందేశ్ క్లాప్ ఇవ్వగా, సినిమాటోగ్రాఫర్ అజయ్‌కుమార్ చిత్రీకరించారు. వరుణ్ సందేశ్ మాట్లాడుతూ– ''సరికొత్త కథాంశంతో తీస్తున్న సినిమా ఇది. నా గత చిత్రాలకు ఈ సినిమా పూర్తి భిన్నంగా ఉంటుంది'' అన్నారు. ''విభిన్నమైన థ్రిల్లర్ ఫిల్మ్ ఇది'' అన్నారు అద్యాంత్ హర్ష. ''ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చే చిత్రమిది'' అన్నారు మహేంద్రనాథ్.

బాలరాజు వస్తున్నాడు



● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో ఎండీ పాషా నిర్మించారు. ఫిబ్రవరి 2న ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నట్లుగా మంగళవారం ప్రకటించారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ''ఇప్పటికే విడుదలైన మా సినిమా టీజర్, పాటలకు మంచి స్పందన లభిస్తోంది. సినిమా కూడా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని యూనిట్ పేర్కొంది.

మా ఊరు సిత్రాన్ని సూద్దాం



● సుహాస్

సుహాస్ హీరోగా దుశ్యంత్ కటికినేని దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేశ్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మిస్తున్నాయి. ఈ సినిమా ఫిబ్రవరి 2న విడుదల కానుంది. శేఖర్ చంద్ర సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'మా ఊరు..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను హీరో తేజ సజ్జా విడుదల చేశారు. 'రారో మా ఊరు సిత్రాన్ని సూద్దాం...' అంటూ ఈ పాట సాగుతుంది. ఈ పాటకు రెహ్మాన్ లిరిక్స్ అందించగా, కాలభైరవ పాడారు.

సందేశంతో...




● ప్రణయనాథ, మధుబాల

ప్రణయనాథ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'ల్యాండ్ మాఫియా'. మధుబాల హీరోయిన్, బాబు వీఎస్ దర్శకత్వం వహించారు. శ్రీ లక్ష్మీ పిక్చర్స్‌పై విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శక-నిర్మాత సునీల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ– ''నా మిత్రుడు ఎక్కలి రవీంద్ర బాబు వల్ల ఈ టీమ్‌ను కలిశాను. ఈ సినిమా విజయం సాధించి, యూనిట్‌కు పెద్ద పేరు తీసుకురావాలి'' అన్నారు. ''ఓ మంచి చిత్రం చేశాం'' అన్నారు ప్రణయనాథ. ''కమర్షియల్ అంశాలున్న సందేశాత్మక చిత్రం ఇది'' అన్నారు మధుబాల. ''ఫిబ్రవరి 14న సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు.

పండగకు పుంజుకొస్తున్నాయి



● మహేశ్‌బాబు



● రవితేజ



● వెంకటేశ్, బేబీ సారా



● 'అల్లరి' నరేశ్, నాగార్జున, రాజ్ తరుణ్

సంక్రాంతికి కోడి పందేల హవా ఉంటుంది. వెండితెరపై సినిమా పందేల హవా ఉంటుంది. పండగకి రావడానికి చాలా సినిమాలు రెడీ అయ్యాయి. అన్నింటికీ థియేటర్లంటే కష్టం. అందుకే కొన్ని పండగ పుంజులు (సినిమాలు) వెనక్కి తగ్గాయి. పాంచ్ పటాకా అంటూ జోరుగా వెండితెర మీదకు పుంజుకొస్తున్న ఐదు చిత్రాల గురించి తెలుసుకుందాం.

● ఈ ఏడాది సంక్రాంతి బరిలో జనవరి 12న రెండు సినిమాలు విడుదలవుతున్నాయి. వాటిలో ఒకటి స్టార్ హీరో మహేశ్‌బాబు 'గుంటూరు కారం' కాగా మరొకటి యువహీరో తేజా సజ్జా 'హను-మాన్'. 'అతడు, ఖలేజా' వంటి సినిమాల తర్వాత హీరో మహేశ్ బాబు–దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన మూడో చిత్రం 'గుంటూరు కారం'. ఇందులో శ్రీలీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లు. ఎస్. రాధాకృష్ణ నిర్మించిన ఈ సినిమా ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది. ఈ మూవీలో మహేశ్‌బాబు పక్కా మాస్ లుక్‌లో కనిపించనున్నారని ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, గ్లింప్స్, పాటలు స్పష్టం చేశాయి. అమ్మ సెంటిమెంట్ నేపథ్యంలో పొలిటికల్ టచ్‌తో ఈ సినిమా ఉంటుందని సమాచారం. ఇక అదే రోజు యువ హీరో తేజ సజ్జా 'హను–మాన్' సినిమాతో తొలిసారి సంక్రాంతికి వస్తున్నారు. 'జాంబీ రెడ్డి' తర్వాత తేజ సజ్జా, డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో రూపొందిన పాన్ ఇండియా చిత్రమిది. కె. నిరంజన్ రెడ్డి నిర్మించారు. అమృతా అయ్యర్ హీరోయిన్. మామూలు కుర్రాడికి హనుమంతుని ఆశీస్సులతో సూపర్ పవర్స్ వస్తే అతను చేసే అసాధారణ పనులు ఏంటి? అనే నేపథ్యంలో 'హను–మాన్' తెరకెక్కింది. ఒకే రోజు అమ్మ సెంటిమెంట్, భక్తి సెంటిమెంట్... ఇలా రెండు విభిన్న చిత్రాలతో 12వ తేదీ ప్రేక్షకులకు ఎమోషనల్‌గా దగ్గర కావడానికి రెడీ అవుతోంది.

అనువాదం ఉందా?

తమిళంలోనూ సంక్రాంతికి పోటీ నెలకొంది. ధనుష్ 'కెప్టెన్ మిల్లర్', శివ కార్తికేయన్ 'అయలాన్', తమిళ్, హిందీలో రూపొందిన విజయ్ సేతుపతి 'మెర్రీ క్రిస్మస్' సినిమాలు జనవరి 12న, అరుణ్ విజయ్ 'మాఫియా' పండగకి విడుదలకు సిద్ధమయ్యాయి. ధనుష్, ప్రియాంకా అరుళ్ మోహన్ జంటగా అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. శివ కార్తికేయన్, రకుల్ ప్రీత్‌సింగ్ జంటగా ఆర్. రవికుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'అయలాన్'. విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్ జంటగా శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వం వహించిన మూవీ 'మెర్రీ క్రిస్మస్'. ఈ మూడు సినిమాలూ తమిళంలో ఒకేరోజు విడుదలవుతున్నాయి. తెలుగులోనూ అనువాదం అవుతున్నాయి. అయితే తెలుగు విడుదలపై సందిగ్ధం నెలకొంది. ఈ సంక్రాంతికి స్ట్రయిట్ తెలుగు సినిమాలకే పోటీ ఉండటంతో థియేటర్ల సమస్య ఎదురైంది. ఆల్రెడీ విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ స్టార్' వంటి స్ట్రయిట్ చిత్రాల రిలీజ్ వాయిదా పడింది. అలాంటిది డబ్బింగ్ సినిమాలకు థియేటర్లు దొరుకుతాయా? అన్నది ఆసక్తిగా మారింది. ఇక అనువాద చిత్రాల్లో రజనీకాంత్ 'లాల్ సలాం' వంటివి పోటీ నుంచి తప్పుకున్నాయి.

● సీనియర్ హీరోలు వెంకటేశ్, రవితేజ సంక్రాంతికి ఒకే రోజు బరిలో దిగుతున్నారు. వెంకటేశ్ నటించిన 'సైంధవ్', రవితేజ నటించిన 'ఈగల్' జనవరి 13నే రిలీజ్ కానున్నాయి. వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సైంధవ్'. శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్‌గా, బేబీ సారా కీలక పాత్రలో నటించారు. వెంకట్ బోయనపల్లి నిర్మించారు. ఫ్యామిలీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'సైంధవ్' వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రం కావడంతో అటు ఇండస్ట్రీ వర్గాల్లో ఇటు ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. పైగా ఆయన నటించిన తొలి పాన్ ఇండియన్ సినిమా ఇదే కావడం విశేషం. తండ్రీ–కూతురి అనుబంధం నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. ఈ చిత్రానికి భిన్నంగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రవితేజ 'ఈగల్' వస్తోంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ మూవీలో కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సినిమాలో మల్టిపుల్ షేడ్స్ ఉన్న పాత్ర చేశారు రవితేజ. ఒకటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, మరొకటి యాక్షన్ ఎంటర్‌టైనర్ కావడంతో ఈ రెండు వర్గాల ప్రేక్షకులకు మంచి చాయిస్ దక్కినట్లే.



● తేజ సజ్జా

● హీరో నాగార్జున కూడా 'నా సామిరంగ' సినిమాతో సంక్రాంతి బరిలో నిలిచారు. 'సోగ్గాడే చిన్ని నాయనా' (2016), 'బంగార్రాజు' (2022) వంటి చిత్రాలతో సంక్రాంతి రేసులో నిలిచి, విజయం అందుకున్న ఆయన ఈ సంక్రాంతికి 'నా సామిరంగ' చిత్రంతో జనవరి 14న సోలోగా వస్తున్నారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ హీరోయిన్. 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటించారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమాలో నాగార్జున ఫుల్ మాస్ లుక్‌లో కనిపించనున్నారు. ప్రేమ, స్నేహం, భావోద్వేగాలు, మాస్, యాక్షన్.. ఇలా అన్ని అంశాలతో ఈ సినిమా రూపొందింది. ఈ మధ్య రెండు సంక్రాంతి పండగలకు హిట్ సాధించిన హీరో కాబట్టి.. ఈసారి నాగార్జున 'నా సామిరంగ'పై అంచనాలు ఉన్నాయి.

సాక్షి బిజినెస్

బుధవారం
3-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
379	76
71,892	21,666

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,822	▽ 190
డోజోన్స్	37,785	△ 95
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,722	▽ 12
డాక్స్	16,769	△ 18
షాంఘై	2,962	△ 12
నిక్కాయ్	33,644	△ 75

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	
63,602	△ 250
బంగారం (99.5 స్వచ్ఛత)	
63,347	△ 249
వెండి (కిలో)	
74,133	△ 248

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.68	83.88
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.73	107.29
€	యూరో	ఎస్‌బీఐ	90.71	93.09
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.65	59.05
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.80	57.75
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.69	63.49
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.75	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.58	12.61

బీఓఐ ప్రత్యేక డిపాజిట్ స్కీం

ముంబై: ప్రభుత్వరంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని పరిమిత కాలానికి ప్రకటించింది. రూ.2 కోట్లు, అంతకుపైన రూ.50 కోట్ల వరకు డిపాజిట్లపై 7.50 శాతం వడ్డీని ఆఫర్ చేస్తోంది. ఈ డిపాజిట్ కాల వ్యవధి 175 రోజులు. జనవరి 1 నుంచి ఇది అందుబాటులోకి వచ్చింది.

బీఓబీ కామన్ మొబిలిటీ కార్డ్



హైదరాబాద్: బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఎన్‌సీఎంసీ)ను విడుదల చేసింది. తిరిగి బ్యాలెన్స్ లోడ్ చేసుకోవడానికి వీలైన ఎన్‌సీఎంసీ రూపే ప్లాటినం ఈఎంవీ చిప్ ఎనేబుల్డ్ కాంటాక్ట్‌లెస్ ప్రీపెయిడ్ కార్డ్ ఇది. బహుళ ప్రయోజనాలతో కూడిన రవాణా కార్డ్. ఆన్‌లైన్ కోసం అయితే వ్యాలెట్‌లో గరిష్టంగా రూ.1,00,000ను లోడ్ చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ వ్యాలెట్‌లో రూ.2,000 వరకు కలిగి ఉండొచ్చు.

ధోతీలపై రామ్‌రాజ్ కాటన్ ఆఫర్



హైదరాబాద్: ధోతీ వారోత్సవాల్లో భాగంగా రామ్‌రాజ్ కాటన్ ధోతీలపై ఆఫర్‌ను ప్రకటించింది. మూడు ధోతీలుండే కాంబో ప్యాక్‌ను రూ.500లకే అందిస్తుంది. ప్రతి ఏటా జనవరి 1 నుంచి 7 వరకు రామ్‌రాజ్ కాటన్ ధోతీ వారోత్సవాలు నిర్వహిస్తుంది. తమిళనాడులోని అన్ని రామ్‌రాజ్ షోరూంలు, టెక్స్‌టైల్స్ అవుట్‌లెట్‌లలో ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-1-2024	
విశాఖ	625-00
చిత్తూరు	608-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585-00
విజయవాడ	585-00
రిటైల్ ధర (డజను)	72.00
2-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	582-00
వరంగల్	584-00
రిటైల్ ధర	6.40

కొత్త కార్ల పరుగు



ఈ ఏడాది 100 నూతన మోడళ్లు, వేరియంట్లు! ● గతేడాది దూకుడుకు కొనసాగింపు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశ వ్యాప్తంగా 2023లో ప్యాసింజర్ వాహన విక్రయాలు 41.08 లక్షల యూనిట్లు నమోదయ్యాయి. 2022తో పోలిస్తే ఇది 8.3 శాతం అధికం. గతేడాది నమోదైన రికార్డుతో 2024లోనూ అదే ఊపును కొనసాగించాలని ప్యాసింజర్ వాహన తయారీ సంస్థలు ఉవ్విళ్లూరుతున్నాయి. ఈ ఏడాది 100కుపైగా కొత్త మోడళ్లు, వేరియంట్లు రోడ్డెక్కనున్నట్టు మార్కెట్ వర్గాల సమాచారం. వీటిలో అత్యధికంగా ఎస్‌యూవీలు ఉండనున్నాయి. దీనికి కారణం ఏమంటే 2023లో అమ్ముడైన మొత్తం ప్యాసింజర్ వాహనాల్లో ఎస్‌యూవీల వాటా ఏకంగా 49 శాతం ఉండడమే. అంతకుముందు ఏడాది వీటి వాటా 42 శాతం నమోదు కావడం గమనార్హం. 2024 కోసం తయారీ కంపెనీలు పోటాపోటీగా కొత్త మోడళ్ల రూపకల్పనలో ఇప్పటికే నిమగ్నమయ్యాయి. మరోవైపు దేశీయ మార్కెట్లో విజయవంతం అయిన మోడళ్లకు మరిన్ని హంగులు జోడించి ఫేస్‌లిఫ్ట్ వేరియంట్ల విడుదలకు సన్నాహాలు చేస్తున్నాయి.

అయిదు డోర్ల ఎస్‌యూవీ..

భారత మార్కెట్లో ఎస్‌యూవీ ప్రియులు ఎంతగానో ఎదురు చూస్తున్న అయిదు డోర్ల థార్ ఈ ఏడాది ఆగస్ట్‌లో ఇక్కడి రోడ్లపై దూసుకుపోనుంది. మహీంద్రా అండ్ మహీంద్రా ఈ మేరకు సిద్ధం అయింది. మహీంద్రా తయారీ ఆధునీకరించిన ఎక్స్‌యూవీ 300, ఎక్స్‌యూవీ 500 సైతం ఈ ఏడాదే కస్టమర్ల చేతుల్లోకి రానున్నాయి.

మెర్సిడెస్‌తో బోణీ..

ఈ ఏడాది మెర్సిడెస్ బెంజ్ తొలుత బోణీ చేయబోతోంది. జనవరి 8న ఈ కంపెనీ జీఎల్ఎస్ లగ్జరీ ఎస్‌యూవీని ప్రవేశపెడుతోంది. కియా ఇండియా నుంచి నూతన సోనెట్ కాంపాక్ట్ ఎస్‌యూవీ జనవరి 15న రాబోతోంది. ఆధునీకరించిన క్రెటా వేరియంట్‌ను జనవరి 16న విడుదలకు హ్యుందాయ్ రెడీ అయింది. మారుతీ సుజుకీ నుంచి కొత్త తరం స్విఫ్ట్ ఫిబ్రవరిలో అడుగుపెడుతోంది. మార్చిలో స్విఫ్ట్ డిజైర్ రోడ్డెక్కనుంది. మారుతీ సుజుకీ ఫ్రాంక్స్ కాంపాక్ట్ ఎస్‌యూవీ ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఏడు సీట్ల ఎస్‌యూవీ టైసర్ మోడల్‌ను ప్రవేశపెట్టేందుకు టయోటా కసరత్తు ప్రారంభించింది. కొత్త ఫార్చూనర్ సైతం దూసుకుపోనుంది. హ్యుందాయ్ నుంచి క్రెటా ఎన్ లైన్, ఫేస్‌లిఫ్ట్ టక్సన్, అల్కజార్ సైతం రానున్నాయి. కొత్తతరం అమేజ్ విడుదలకు హోండా కార్స్ సన్నద్ధం అయింది. ఫోక్స్‌వేగన్, స్కోడా, నిస్సాన్, రెనో, సిట్రోయెన్ ఫేస్‌లిఫ్ట్ మోడళ్లను తేనున్నాయి.

ఈవీలు సైతం మార్కెట్లోకి..

ఎలక్ట్రిక్ కార్లకు క్రమంగా ఆదరణ పెరుగుతుండడంతో కొన్ని కంపెనీలు ఈ విభాగంలో నూతన మోడళ్లను తెచ్చే పనిలో ఉన్నాయి. హ్యారియర్ ఈవీని ఏప్రిల్‌లో తీసుకొచ్చేందుకు టాటా మోటార్స్ ప్రణాళిక చేస్తోంది. 2024 చివరికల్లా టాటా కర్వ్ ఈవీ రానుంది. అలాగే టాటా పంచ్ ఈవీ సైతం పరుగుతీయనుంది. మారుతీ సుజుకీ నుంచి తొలి ఈవీ ఈ ఏడాది భారత రోడ్లపై అడుగు పెట్టేందుకు సిద్ధం అవుతోంది. కియా ఈవీ9 పండుగల సీజన్‌లో రానుందని సమాచారం.

కియా ఇండియా ఎండీగా గ్వాంగూ లీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ కియా ఇండియా నూతన ఎండీ, సీఈవోగా గ్వాంగూ లీ నియమితులయ్యారు. టీ జిన్ పార్క్ స్థానంలో లీ చేరారు. కియా కార్పొరేషన్‌లో 36 ఏళ్లపాటు సుదీర్ఘ ప్రయాణం చేసి పదవీ విరమణ పొందిన టీ జిన్ పార్క్ కియా ఇండియా ఎండీగా నాలుగేళ్లు బాధ్యతలు నిర్వర్తించారు. యూఎస్, కెనడా, ఇటలీ, మెక్సికోతోపాటు సెంట్రల్, సౌత్ అమెరికాలో కియా హెడ్‌క్వార్టర్స్, జర్మనీలో ఉన్న కియా యూరప్ కేంద్ర కార్యాలయంలోనూ వివిధ కీలక హోదాల్లో గ్వాంగూ లీ పనిచేశారు. ఇటీవలి వరకు ఆయన కియా మెక్సికో ప్రెసిడెంట్‌గా ఉన్నారు. కంపెనీ గణనీయ వృద్ధి, ఉత్పత్తి, ఎగుమతి కేంద్రంగా కియా మెక్సికోను మలచడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కియా తెలిపింది. రెండు సెగ్మెంట్-బ్రేకింగ్ ఫీచర్లతో కొత్త సెల్టోస్, కొత్త సోనెట్‌తోపాటు మరిన్ని వినూత్న ఉత్పత్తులతో కియా ఇండియా ఖచ్చితంగా స్థిర వ్యాపార వృద్ధికి సరైన మార్గంలో ఉందని ఈ సందర్భంగా గ్వాంగూ లీ తెలిపారు.

హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ 24 కొత్త శాఖలు



ముంబై: దేశవ్యాప్తంగా హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ మంగళవారం 24 కొత్త శాఖలు ప్రారంభించింది. భారత్‌లోని మ్యూచువల్ ఫండ్ల ప్రాధాన్యతను పెంచే చర్యలో భాగంగా ఇది ఒక వ్యూహాత్మక చొరవగా సంస్థ తెలిపింది. ''ప్రతి భారతీయుడు సంపద సృష్టికర్తగా ఎదగాలనేదే మా లక్ష్యం. అందులో భాగంగా అందరికి మ్యూచువల్ ఫండ్లను అందుబాటులోకి తెచ్చేందుకు మా విస్తృతిని పెంచుకుంటున్నాము'' అని సంస్థ ఎండీ, సీఈవో నవనీత్ మునోత్ తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ 200కు పైగా శాఖలు ద్వారా కార్యకలాపాలు సాగిస్తోంది.

రూ.70 వేలకు పుత్తడి!

2024పై జీజేసీ అంచనా



ముంబై: బంగారం ధర ఈ ఏడాది 10 గ్రాములకు రూ.70,000 వద్ద కొత్త గరిష్ట స్థాయిని తాకే అవకాశం ఉందని ఆల్ ఇండియా జెమ్, జువెల్లరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) అంచనా వేస్తోంది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇందుకు కారణమని వెల్లడించింది. 'బంగారం సురక్షితమైన పెట్టుబడి. వస్తువుల ధరలు అధికంగా ఉండడం, ప్రపంచవ్యాప్తంగా పెరిగిన వడ్డీ రేట్లను వినియోగదారులు ఎదుర్కొంటున్నారు. ద్రవ్యోల్బణం నుంచి రక్షణకు బంగారం ఒక సురక్షిత సాధనం'' అని విశ్లేషించింది.

సమయపాలనలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు బెస్ట్

- టాప్ 10 గ్లోబల్ విమానాశ్రయాల్లో రెండో స్థానం
- మూడో స్థానంలో బెంగళూరు ఎయిర్‌పోర్టు



న్యూఢిల్లీ: నిర్వహణ పనితీరు, సమయపాలనలో హైదరాబాద్, బెంగళూరు విమానాశ్రయాలు అంతర్జాతీయంగా టాప్ 10 ఎయిర్‌పోర్టుల జాబితాలో చోటు దక్కించుకున్నాయి. హైదరాబాద్ రెండో స్థానంలో, బెంగళూరు మూడో స్థానంలో నిల్చాయి. 2023 సంవత్సరానికి గాను సమయ పాలన పనితీరుకు (ఓటీపీ) సంబంధించి ఏవియేషన్ అనలిటిక్స్ సంస్థ సిరియమ్ రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అమెరికాలోని మినియాపోలిస్-సెయింట్ పాల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఈ జాబితాలో నంబర్‌వన్‌గా ఉంది. మధ్య స్థాయి ఎయిర్‌పోర్ట్స్ కేటగిరీలో కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విమానాశ్రయానికి తొమ్మిదో స్థానం లభించింది.

72 వేల దిగువకు సెన్సెక్స్

బ్యాంకులు, ఆటో, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ ● ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు

ముంబై: బ్యాంకులు, ఐటీ, ఆటో షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు మంగళవారం అరశాతం నష్టపోయాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడి పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 379 పాయింట్లు పతనమై 72 వేల స్థాయి దిగువన 71,892 వద్ద ముగిసింది. నిఫ్టీ 76 పాయింట్లు నష్టపోయి 21,666 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. ప్రథమార్థంలో నెలకొన్న అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ 658 పాయింట్లు పతనమై 71,614 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు క్షీణించి 21,556 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. భారీ పతనం తర్వాత ద్వితీయార్థంలో కనిష్ట స్థాయిల్లో ఇంధన, ఫార్మా, సర్వీసులు, మెటల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించాయి. ఫలితంగా సూచీలు దాదాపు సగానికి పైగా నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు ఫ్లాటుగా ముగిశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,602 కోట్ల షేర్లు కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,959 కోట్ల షేర్లు అమ్మారు.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- ప్రముఖ ఇన్వెస్టర్ రాధాకిషన్ ధమాని, ఎస్‌బీఐ ఫండ్‌లు వేరువేరుగా వీఎస్‌టీ ఇండస్ట్రీస్‌కి చెందిన 1.4% వాటాకు సమానమైన షేర్లను బల్క్ డీల్స్‌లో కొనుగోలు చేశారు. దీంతో వీఎస్‌టీ ఇండస్ట్రీస్ షేరు 20% ఎగసి రూ.4065.30 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.
- అమెరికా జనరిక్ మార్కెట్ పుంజుకోవడం, ముడి సరుకు ధర తగ్గడం, కోవిడ్ కేసులు పెరుగుతుండటంతో ఫార్మా షేర్లు రాణించాయి.
- దేశీయ ఐటీ రంగ డిసెంబర్ త్రైమాసిక ఫలితాలు అంతంత మాత్రంగా ఉండొచ్చని బ్రోకరేజ్ సంస్థ జెఫ్రీస్ అవుట్‌లుక్ తెలపడంతో ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.
- స్టార్‌లింక్‌తో చేతులు కలపబోతున్నామన్న వార్తలను వొడాఫోన్ ఐడియా ఖండించడంతో కంపెనీ షేరు బీఎస్ఈలో మంగళవారం దాదాపు 6% క్షీణించి రూ. 16 వద్ద క్లోజయ్యింది.

రూపాయి 11 పైసలు పతనం



డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు బలహీనపడి 83.32 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ పతనం, దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరగడం రూపాయి కోతకు కారణం.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఆర్మీ పబ్లిక్ స్కూల్ ఆర్కేపురం, సికింద్రాబాద్‌లో 48 టీచింగ్ పోస్టులు

గోల్కొండలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ 2024-25 అకడమిక్ సెషన్‌కు సంబంధించి టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 48
» పోస్టుల వివరాలు: పీజీటీ-07, టీజీటీ-13, పీఆర్‌టీ-17, హెడ్మాస్టర్-01, ప్రీ ప్రైమరీ టీచర్-10.
» సబ్జెక్టులు: ఇంగ్లిష్, హిందీ, సైన్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, సోషల్ సైన్స్, కంప్యూటర్స్.
» అర్హత: సంబంధిత విభాగంలో ఇంటర్, డీఈడీ, డిగ్రీ, బీఈడీ, పీజీ, సీటీఈటీ/టెట్ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 55 ఏళ్లు మించకూడదు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్, ఆర్మీ పబ్లిక్ స్కూల్, గోల్కొండ, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 20.01.2024.
» వెబ్‌సైట్: apsrkpuram.edu.in

ఏపీలో 240 డిగ్రీ లెక్చరర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ కాలేజియేట్ ఎడ్యుకేషన్ సర్వీస్‌కు సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 240
» సబ్జెక్టుల వారీగా ఖాళీలు: బోటనీ-19, కెమిస్ట్రీ-26, కామర్స్-35, కంప్యూటర్ అప్లికేషన్స్-26, కంప్యూటర్ సైన్స్-31, ఎకనామిక్స్-16, హిస్టరీ-19, మ్యాథమేటిక్స్-17, ఫిజిక్స్-11, పొలిటికల్ సైన్స్-21, జువాలజీ-19.
» అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, నెట్/స్లెట్/సెట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 24.01.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 13.02.2024.
» రాతపరీక్ష తేది: ఏప్రిల్/మే, 2024.
» వెబ్‌సైట్: https://psc.ap.gov.in

ఏపీలో 47 జూనియర్ లెక్చరర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ సర్వీస్‌కు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 47
» సబ్జెక్టుల వారీగా ఖాళీలు: ఇంగ్లిష్-09, తెలుగు-02, ఉర్దూ-02, సంస్కృతం-02, ఒడియా-01, మ్యాథమేటిక్స్-01, ఫిజిక్స్-05, కెమిస్ట్రీ-03, బోటనీ-02, జువాలజీ-01, ఎకనామిక్స్-12, సివిక్స్-02, హిస్టరీ-05.
» అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 31.01.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 20.02.2024.
» రాతపరీక్ష తేది: ఏప్రిల్/మే 2024.
» వెబ్‌సైట్: https://psc.ap.gov.in

ఇంటెలిజెన్స్ బ్యూరోలో 226 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇంటెలిజెన్స్ బ్యూరో.. దేశవ్యాప్తంగా ఐబీ పరిధిలోని సబ్సిడియరీ ఇంటెలిజెన్స్ బ్యూరోల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 226
» విభాగాల వారీగా ఖాళీలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-79, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్-147.
» అర్హత: బీఈ, బీటెక్(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్) లేదా ఎంఎస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్-ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్‌కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్) లేదా పీజీ(కంప్యూటర్ అప్లికేషన్స్). గేట్ 2021/2022/2023 స్కోరు తప్పనిసరి.
» వయసు: 12.01.2024 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.44,900 నుంచి రూ.1,42,400.
» ఎంపిక విధానం: గేట్ స్కోరు/ఇంటర్వ్యూ, సైకోమెట్రిక్/ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 12.01.2024.
» దరఖాస్తు ఫీజు చెల్లింపు చివరితేది: 16.01.2024
» వెబ్‌సైట్: www.mha.gov.in

ఇంటర్‌లో.. టాప్ స్కోర్ ఇలా!

ఇంటర్మీడియెట్.. కెరీర్ క్రాస్ రోడ్స్‌లో.. కీలకమైన దశ! ఇంటర్‌లో సాధించిన మార్కులు భవిష్యత్‌లో ఉన్నత విద్య, ఉద్యోగ సాధనలో కీలకంగా మారుతున్నాయి. అందుకే విద్యార్థులు ఇంటర్‌లో టాప్ స్కోర్ సొంతం చేసుకునేందుకు పుస్తకాలతో కుస్తీ పడుతుంటారు. తాజాగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు పరీక్షల్లో టాప్ మార్కులు సాధించేందుకు నిపుణుల సలహాలు..

» ఏపీ, తెలంగాణలో 2024 ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల
» ఏపీలో మార్చి 1 నుంచి, తెలంగాణలో ఫిబ్రవరి 28 నుంచి పరీక్షలు
» భవిష్యత్తులో కీలకంగా మారుతున్న ఇంటర్ మార్కులు

ఇంటర్మీడియెట్ సబ్జెక్టులు భవిష్యత్తులో ఉన్నత విద్య కోర్సుల్లో చేరడానికి, అదే విధంగా ఆయా కోర్సుల్లో రాణించడానికి కూడా కీలకంగా నిలుస్తున్నాయి. కాబట్టి విద్యార్థులు తాము చదువుతున్న గ్రూప్ సబ్జెక్టులపై పూర్తి స్థాయి పట్టు సాధించాలి అంటున్నారు నిపుణులు. తద్వారా ఇంటర్ వార్షిక పరీక్షల్లో బెస్ట్ స్కోర్ సొంతం చేసుకోవచ్చని పేర్కొంటున్నారు.

ఏపీలో మార్చి 1 నుంచి

2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు 2024, మార్చి 1 నుంచి ప్రారంభం కానున్నాయి. మరోవైపు తెలంగాణలో ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు మొదలు కానున్నాయి. దీంతో.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయం విద్యార్థులకు ఎంతో అమూల్యమైంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే.. మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది.

ఇంటర్ ఎంపీసీ

ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థులు ఇప్పటికే సిలబస్ పూర్తి చేసి ఉంటారు. ప్రస్తుతమున్న సమయంలో మ్యాథమెటిక్స్ షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్‌పై బాగా దృష్టి పెట్టాలి. వీటిని కొశ్చన్ అండ్ ఆన్సర్ మాదిరిగా కాకుండా.. డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో సాధించాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడే జేఈఈ మెయిన్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకోవాలి. ఆయా సిలబస్ అంశాలకు అనుగుణంగా ఆబ్జెక్టివ్ ప్రశ్నలు -సమాధానాల రూపంలో ప్రిపరేషన్ సాగించాలి. జేఈఈ రాసే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇప్పటి నుంచి ఎక్కువ సమయాన్ని గ్రూప్ సబ్జెక్టుల ప్రిపరేషన్‌కు కేటాయించాలి. ఫిబ్రవరి మధ్య నుంచి పూర్తిగా ఇంటర్మీడియెట్ ప్రిపరేషన్‌పై దృష్టిపెట్టాలి. అకాడమీ పుస్తకాల్లోని అన్ని ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేస్తూ ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. వీక్లీ, మంత్లీ టెస్ట్‌లు రాయడం మేలు చేస్తుంది. అదే విధంగా కనీసం రెండు ప్రీ-ఫైనల్ ఎగ్జామ్స్‌కు హాజరవ్వాలి.

మ్యాథమెటిక్స్

ద్వితీయ సంవత్సరం మ్యాథమెటిక్స్‌కు సంబంధించి ద్విపద సిద్ధాంతం; ప్రస్తారాలు-సంయోగాలు, సంభావ్యత; వృత్తాలు; సమాకలనులు; నిశ్చిత సమాకలనులు; అవకలన సమీకరణాలు; డిమూవర్స్ సిద్ధాంతం, వర్గ సమీకరణాలు, పరావలయం వంటి అంశాలను బాగా పునశ్చరణ చేయాలి. మొదటి సంవత్సరం విద్యార్థులు.. వెక్టార్ ఆల్జీబ్రా; మాత్రికలు, సరళరేఖలు, సరళరేఖ యుగ్మాలు, అవకలనాలు, అప్లికేషన్స్ అండ్ డెరివేషన్స్‌పై ఎక్కువ సమయం కేటాయించాలి.

ఫిజిక్స్

✦ ఫిజిక్స్‌కు సంబంధించి విద్యార్థులు జనవరిలో స్వల్ప, అతి స్వల్ప సమాధాన ప్రశ్నల సాధనకు ఎక్కువ కృషి చేయాలి. ఫిజిక్స్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి.. మూవింగ్ ఛార్జెస్ అండ్ మ్యాగ్నటిజం; కరెంట్ ఎలక్ట్రిసిటీ; ఆప్టికల్ ఇన్‌స్ట్రుమెంట్స్; పరమాణువు, వేవ్స్; సెమీ కండక్టర్ ఎలిమెంట్స్ వంటి అంశాల్లో పట్టు సాధించే విధంగా రివిజన్‌కు సమయం కేటాయించాలి.

✦ ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. రొటేటరీ మోషన్; యూనివర్సల్ గ్రావిటేషన్ లా; ఎస్కేప్ వెలాసిటీ; సింపుల్ హార్మోనిక్ మోషన్; సర్ఫేస్ టెన్షన్, థర్మో డైనమిక్స్ వంటి అంశాలకు ఎక్కువ సమయం కేటాయించాలి. ఫిజిక్స్‌లో లాంగ్ ఆన్సర్ కొశ్చన్స్‌ను సాధన చేసేటప్పుడు అంచెలవారీ పరిష్కార విధానాన్ని అనుసరించాలి. ఫలితంగా సదరు సమస్యకు సంబంధించి ప్రాథమిక భావనలపైనా పట్టు సాధించేందుకు ఆస్కారం లభిస్తుంది.

కెమిస్ట్రీ

కెమిస్ట్రీకి సంబంధించి ముఖ్యాంశాలను నోట్ చేసుకుంటూ చదవాలి. ప్రస్తుత సమయంలో దీర్ఘ సమాధాన ప్రశ్నలు, నాలుగు మార్కుల ప్రశ్నలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. వీటికి సంబంధించి గతంలో అడిగిన ప్రశ్నలను సాధన చేయాలి. దీంతోపాటు మోడల్ టెస్ట్‌లకు హాజరవడం ఉపయుక్తంగా ఉంటుంది. విద్యార్థులు జనవరి చివరి నాటికి సబ్జెక్ట్ ప్రిపరేషన్‌ను పూర్తిచేసుకుని.. ఫిబ్రవరి నెలలో అధిక సమయం రివిజన్‌కు కేటాయించేలా ప్లాన్ చేసుకోవాలి. ద్వితీయ సంవత్సరంలో.. విద్యుత్ రసాయన శాస్త్రం; పి-బ్లాక్ మూలకాలు, డి, ఎఫ్-బ్లాక్ మూలకాలు, లోహ శాస్త్రం; సాలిడ్ స్టేట్ వంటి అంశాలకు ఎక్కువ సమయం కేటాయించాలి. ఆర్గానిక్ కెమిస్ట్రీలోని అన్ని ముఖ్యాంశాలతో నోట్స్ రాసుకోవడం మేలు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. కర్బన రసాయన శాస్త్రం; ఆవర్తన పట్టిక; పరమాణు నిర్మాణం; రసాయన బంధం అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.



ఇంటర్ బైపీసీ

బోటనీ

బైపీసీ విద్యార్థులు బోటనీ సబ్జెక్ట్‌లో రాణించేందుకు అనలిటికల్ అప్రోచ్‌ను అనుసరించాలి. ఒక ప్రశ్నకు సమాధానం సాధించే క్రమంలో ఇమిడి ఉన్న అనువర్తిత అంశాలను నిజ జీవితంలోని పరిస్థితులతో బేరీజు వేస్తూ సాగాలి. ఫ్లో చార్ట్‌లు, డయాగ్రమ్స్ వేయడం ప్రాక్టీస్ చేయాలి. మొదటి సంవత్సరం విద్యార్థులు.. మొక్కల నిర్మాణాత్మక సంవిధానం-స్వరూప శాస్త్రం; జీవ ప్రపంచంలో వైవిధ్యం; కణ నిర్మాణం, విధులు; మొక్కల అంతర్ నిర్మాణ సంవిధానం, మొక్కల్లో ప్రత్యుత్పత్తి యూనిట్లపై ఎక్కువ దృష్టి పెట్టాలి. దీనికి సంబంధించి డయాగ్రమ్స్ వేయడం బాగా ప్రాక్టీస్ చేయాలి. డైవర్సిటీ ఇన్ ది లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్స్ ఇన్ ప్లాంట్స్ (మార్ఫాలజీ), రీ ప్రొడక్షన్ ఇన్ ప్లాంట్స్, ప్లాంట్ సిస్టమాటిక్స్, సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, ఇంటర్నల్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ప్లాంట్స్, ప్లాంట్ ఎకాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, మైక్రో బయాలజీ(బ్యాక్టీరియా, వైరస్), జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీ, బయోటెక్నాలజీ, ప్లాంట్స్, మైక్రోబ్స్ అండ్ హ్యూమన్ వెల్ఫేర్ టాపిక్స్‌పైనా పట్టు సాధించేలా ప్రిపరేషన్ సాగించాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొక్కల శరీర ధర్మశాస్త్రం; బయో టెక్నాలజీ; మైక్రోబ్స్, అణు జీవశాస్త్రం యూనిట్లకు ప్రాధాన్యం ఇవ్వాలి.

జువాలజీ

జనవరి చివరి నాటికి జువాలజీ సిలబస్ పూర్తి చేసుకోవాలి. ఈ సబ్జెక్ట్‌లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.. మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థ, ప్రత్యుత్పత్తి సంబంధిత ఆరోగ్యం; అంతస్రావక వ్యవస్థ, నాడీ నియంత్రణ-సమన్వయం; శరీర ద్రవాలు, ప్రసరణ, విసర్జక పదార్థాలు; జన్యు శాస్త్రాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. జంతుదేహ నిర్మాణం; గమనం, ప్రత్యుత్పత్తి; జీవావరణం; పర్యావరణం; బొద్దింక జీవ వ్యవస్థ వంటి అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలి. ఈ సబ్జెక్ట్‌లో కూడా గ్రాఫికల్ ప్రజెంటేషన్ మార్కుల సాధనలో కీలకంగా మారుతుంది. కాబట్టి డయాగ్రమ్స్ ప్రాక్టీస్ చేయాలి. ఈ సబ్జెక్ట్‌లో రెండు సంవత్సరాలకు సంబంధించి డైవర్సిటీ ఆఫ్ లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ యానిమల్స్, యానిమల్ డైవర్సిటీ, లోకోమోషన్ అండ్ రీప్రొడక్షన్ ఇన్ ప్రొటొజోవా, బయాలజీ అండ్ హ్యూమన్ వెల్ఫేర్, స్టడీ ఆఫ్ పెరిప్లెనెటా అమెరికానా, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, హ్యూమన్ రీప్రొడక్షన్, జెనిటిక్స్, ఆర్గానిక్ ఎవల్యూషన్, అప్లయిడ్ బయాలజీలపై ప్రత్యేక దృష్టితో చదవాలి.

ఫిజిక్స్

బైపీసీ-ఫిజిక్స్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. లిక్విడ్, గ్యాస్, కైనటిక్ గ్యాస్ థియరీ, రొటేటరీ మోషన్, యాంగులర్ మూమెంట్, యూనివర్సల్ గ్రావిటేషన్ లా, ఆర్బిటాల్ వెలాసిటీ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వేవ్ మోషన్; సెమీ కండక్టర్ ఎలిమెంట్స్; మూవింగ్ ఛార్జెస్-మ్యాగ్నటిజం;విద్యుదయస్కాంత ప్రేరణ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి.

కెమిస్ట్రీ

బైపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. కెమిస్ట్రీకి సంబంధించి ఆవర్తన పట్టిక; కర్బన రసాయన శాస్త్రం; రసాయన బంధం; పరమాణు నిర్మాణం అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వీటిలోని సమస్యలను సాధన చేయాలి. సినాప్సిస్ రూపొందించుకుంటే రివిజన్‌కు ఉపయుక్తంగా ఉంటుంది. ద్వితీయ సంవత్సరంలో పి-బ్లాక్ ఎలిమెంట్స్; ఆర్గానిక్ కెమిస్ట్రీ; విద్యుత్ రసాయన శాస్త్రం; కెమికల్ కైనటిక్స్‌లోని దీర్ఘ సమాధాన ప్రశ్నలు, నాలుగు మార్కుల ప్రశ్నల ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

ఇంటర్మీడియెట్ ఎగ్జామ్స్.. జనరల్ టిప్స్

✦ జనవరి చివరి వారానికి సిలబస్ పూర్తి చేసుకోవాలి. ✦ ఫిబ్రవరి నుంచి పూర్తిగా రివిజన్‌కు కేటాయించాలి. ✦ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు జనవరి మూడో వారానికి సిలబస్ పూర్తి చేసుకుని తర్వాత సమయాన్ని ప్రాక్టీస్‌పై దృష్టి పెట్టడం మంచిది. ✦ షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ అన్నింటికీ సమాధానం ఇచ్చేలా సంసిద్ధత పొందాలి. ✦ లాంగ్ ఆన్సర్ కొశ్చన్స్‌ను ప్రాక్టీస్ చేస్తున్నప్పుడే వాటి నుంచి అడిగే అవకాశం ఉన్న షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్‌కు సంబంధించిన అంశాలు నోట్స్ రూపంలో రాసుకోవాలి. ✦ విద్యార్థులు క్లాస్‌రూం లెక్చర్‌కు అదనంగా ప్రతి రోజు కనీసం ఆరు నుంచి ఏడు గంటల స్వీయ ప్రిపరేషన్‌కు కేటాయించాలి. ✦ మెమొరీ టిప్స్ (విజువల్ ఇమాజినేషన్; షార్ట్ నోట్స్)ను పాటించడం మేలు.

31 వరకు 'ఆపరేషన్ స్మైల్'

తప్పిపోయిన, అదృశ్యమైన చిన్నారుల జాడ కోసం పోలీసుల గాలింపు

సాక్షి, హైదరాబాద్: తప్పిపోయిన, అదృశ్యమైన, బాలకార్మికులుగా మారిన చిన్నారుల జాడ కనిపెట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 31 వరకు ఆపరేషన్ స్మైల్–10 స్పెషల్ డ్రైవ్‌ను పోలీసులు చేపట్టారు. జనవరి 1వ తేదీన ప్రారంభమైన ఈ స్పెషల్ డ్రైవ్‌లో పోలీసులు చైల్డ్ వెల్ఫేర్, చైల్డ్ ప్రొటెక్షన్, రెవెన్యూ, విద్య, వైద్య, లేబర్, పరిశ్రమల శాఖల అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాయి. చిన్నారుల సంరక్షణ అంశంలో పనిచేసే పలు ఎన్జీవో సంస్థలు సైతం ఇందులో భాగస్వాములవుతున్నాయి. తప్పిపోయిన, వదిలేసిన, భిక్షాటన చేస్తున్న, బాలకార్మికులుగా పనిచేస్తున్న పిల్లలను పోలీసులు గుర్తించనున్నారు. పరిశ్రమలు, కర్మాగారాల్లో బాలకార్మికులుగా పనిచేస్తున్నవారిని గుర్తించి తిరిగి తల్లిదండ్రులకు అప్పగించనున్నారు. సంరక్షకులు గుర్తించనివారిని పునరావాస కేంద్రాలకు తరలించనున్నారు. నెల రోజులపాటు కొనసాగనున్న ఈ స్పెషల్ డ్రైవ్‌ను మహిళాభద్రత విభాగం పర్యవేక్షిస్తుంది.

13 నుంచి 15 వరకు 'కైట్ ఫెస్టివల్'

పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కైట్ ఫెస్టివల్ నిర్వహిస్తామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం బేగంపేట్ హరిత ప్లాజాలో ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ కైట్–స్వీట్ ఫెస్టివల్‌ను నిర్వహించేందుకు పర్యాటక శాఖ ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఈ ఉత్సవాలలో 16 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్స్, 60 మంది దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. వీటితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్వీట్ స్టాళ్లను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. కైట్ ఫెస్టివల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు హస్తకళలు, చేనేత వస్త్రాల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. సందర్శకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని, వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జీహెచ్‌ఎంసీ, పోలీసు, ఇతర శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యాటక శాఖ డైరెక్టర్ కె.నిఖిల తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న 'రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్'

సేవాభారతి అధ్యక్షుడు దుర్గారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఉషా అయ్యర్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఫిబ్రవరి 11న 'రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్' 8వ ఎడిషన్‌ను నిర్వహించనున్నట్లు సేవా భారతి అధ్యక్షుడు డి.దుర్గారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఉషా అయ్యర్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో వారు మాట్లాడుతూ నిరుపేద ఆడపిల్లల భవిష్యత్‌ను మార్చే లక్ష్యానికి సేవాభారతి కట్టుబడి ఉందని, తమ లక్ష్యానికి రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్ కార్యక్రమం నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చే ఆదాయం ద్వారా మురికివాడల్లోని ఆడపిల్లల అభ్యున్నతికి కృషి చేస్తామని చెప్పారు. కిశోరి వికాస్ యోజన ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు 10,236 మంది బాలికలకు సాధికారత కల్పించినట్లు చెప్పారు. 2030 నాటికి లక్ష మంది ఆడపిల్లల భవిష్యత్ ప్రణాళికల ద్వారా సాధికారత లభించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. ఈ రన్‌కు ఫ్రీడమ్ ఆయిల్, గ్లోబల్ డేటా, ఇన్ఫోసిస్, జీఈపీ, హెల్త్ ఎడ్జ్, యశోద హాస్పిటల్స్, సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్, బీడీఎల్, మిథాని వంటి సంస్థలు సహకరిస్తున్నాయని వెల్లడించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) కార్యక్రమాల ద్వారా రాబోయే రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో పాల్గొనాలని దాతలను కోరారు. దాతలు, రన్నర్లు అధికారిక వెబ్‌సైట్ www.runforagirlchild.org: ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సేవాభారతి సభ్యులు సూచించారు. మరిన్ని వివరాలకు శ్రీనివాస్‌ను 96180 36965 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.


హైదరాబాద్ చుట్టూ 'మెట్రో'

5 కారిడార్‌లలో మెట్రోరైల్ రెండో దశ విస్తరణకు సమగ్ర ప్రణాళికలు

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరం నలువైపులా మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఐదు కారిడార్‌లలో మెట్రో విస్తరణకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆదేశించారు. హెచ్‌ఎంఆర్‌ఎల్, హెచ్‌ఎండీఏలు సమన్వయంతో హైదరాబాద్‌లో మెట్రో రైల్ రెండో దశ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మెట్రో రైల్‌పై సమీక్షా సమావేశంలో సీఎం దిశానిర్దేశం చేశారు. నగరంలోని అన్ని ప్రధాన ప్రాంతాలకు, అత్యధిక జనాభాకు మెట్రో సేవలు అందుబాటులో ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పాతబస్తీలో మెట్రో నిర్మాణం కోసం దారుల్‌షిఫా నుంచి షాలిబండ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉందని అధికారులు తెలపగా షాలిబండ వరకే కాకుండా ఫలక్‌నుమా వరకు 100 అడుగుల మేర రోడ్డు విస్తరణకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సీఎం సూచించారు. ఇందుకోసం స్థానిక ప్రజాప్రతినిధులను, వివిధ వర్గాలను సంప్రదించాలన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు దీటుగా పాతబస్తీని అభివృద్ధి చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం రోడ్డు విస్తరణ, మెట్రోరైల్ నిర్మాణం అవసరమన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే మెట్రోరైల్ పొడిగింపు కోసం 103 చోట్ల మతపరమైన కట్టడాలు, సాంస్కృతిక కేంద్రాలు ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో అవసరమైతే ప్రజాప్రతినిధులు, స్థానికులతో సంప్రదింపులు జరిపేందుకు తాను సైతం వస్తానని సీఎం పేర్కొన్నారు.

పాతబస్తీ మీదుగా ఎయిర్‌పోర్టు మెట్రో...

పాతబస్తీ మీదుగానే ఎయిర్‌పోర్టు మెట్రో చేపట్టాలని సీఎం రేవంత్ పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వం సుమారు రూ.6,250 కోట్లతో ప్రతిపాదించిన 31 కి.మీ. రాయదుర్గం–శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గాన్ని నిలిపేయాలన్నారు. ఈ మార్గంలో రాయదుర్గం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మీదుగా అమెరికన్ కాన్సులేట్ వరకు మెట్రో మూడో దశ విస్తరణ చేపట్టాలన్నారు. రాయదుర్గం–శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ప్రత్యామ్నాయంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, ఎల్బీనగర్ నుంచి పాతబస్తీ మీదుగా ఎయిర్‌పోర్టుకు మెట్రో మార్గాన్ని నిర్మించాలని సూచించారు. ఇందులో భాగంగా ఎల్బీనగర్–నాగోల్ మధ్య 5కి.మీ. మేర మెట్రో చేపట్టాలని సీఎం చెప్పారు. ఎయిర్‌పోర్టు మెట్రోపై తక్షణమే ట్రాఫిక్ స్టడీస్‌ను పూర్తి చేసి డీపీఆర్‌ను సిద్ధం చేయాలని మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆదేశించారు. మెట్రోరైల్ నిర్మాణంలో అనవసరమైన ఖర్చులను తగ్గించుకోవాలని చెప్పారు. కొత్త అలైన్‌మెంట్‌లో భాగంగా లక్ష్మీగూడ–జల్‌పల్లి–మామిడిపల్లి రూట్ ను పరిశీలించాలన్నారు. ఈ మార్గంలో 40 అడుగుల సెంట్రల్ మీడియన్ ఉందని, మెట్రో నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని రేవంత్ చెప్పారు. ఈ రూట్‌ను ఎంపిక చేయడం వల్ల ఖర్చు తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా ఈ రూట్‌లో రవాణా ఆధారిత అభివృద్ధి కోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలని హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిషోర్, సీఎంఓ పర్సనల్ సెక్రటరీ శేషాద్రిని ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎస్ శాంతికుమారి, ఇంటెలిజెన్స్ ఐజీ బి.శివధర్‌రెడ్డి, సీఎంఓ సెక్రటరీ షానవాజ్ ఖాసిం, హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం ప్రతిపాదించిన 5 కారిడార్‌లు ఇలా...

- మియాపూర్–చందానగర్–బీహెచ్‌ఈఎల్–పటాన్‌చెరు (14 కి.మీ.)
- ఎంజీబీఎస్–ఫలక్‌నుమా–చాంద్రాయణగుట్ట–మైలార్‌దేవ్‌పల్లి–పీ7 రోడ్డు–ఎయిర్‌పోర్టు (23 కి.మీ.)
- నాగోల్–ఎల్బీనగర్–ఒవైసీ హాస్పిటల్–చాంద్రాయణగుట్ట–మైలార్‌దేవ్‌పల్లి–ఆరాంఘర్–న్యూ హైకోర్టు ప్రతిపాదిత ప్రాంతం రాజేంద్రనగర్ (19 కి.మీ.)
- కారిడార్ 3లో భాగంగా రాయదుర్గం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు (విప్రో జంక్షన్ నుంచి/అమెరికన్ కాన్సులేట్) వయా బయోడైవర్సిటీ జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్, ఐఎస్‌బీ రోడ్డు (12 కి.మీ.)
- ఎల్బీనగర్–వనస్థలిపురం–హయత్‌నగర్ (8 కి.మీ.)

హైదరాబాద్ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్....

నగర అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేయాలని, ఓఆర్‌ఆర్ చుట్టూ ఉన్న ప్రాంతాలను గ్రోత్ హబ్‌గా మార్చడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. శ్రీశైలం హైవేపై ఎయిర్‌పోర్టు ప్రాంతం నుంచి కందుకూరు వరకు మెట్రో కనెక్టివిటీకి కూడా ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఫార్మాసిటీ కోసం ఈ ప్రాంతంలో భూములను సేకరించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అందువల్లే మెట్రో కనెక్టివిటీ అవసరమన్నారు. జేబీఎస్ మెట్రోస్టేషన్ నుంచి శామీర్‌పేట్ వరకు, కండ్లకోయ/మేడ్చల్ వరకు మెట్రోరైలు మూడో దశ విస్తరణ చేపట్టాలని సూచించారు. రెండో దశ మెట్రో విస్తరణకు ప్రతిపాదించిన 5 కారిడార్‌లపై వెంటనే ప్రణాళికలను సిద్ధం చేసి కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరికి ముసాయిదా లేఖ పంపాలని అధికారులను సీఎం ఆదేశించారు. 40 కి.మీ. మేర మూసీ రివర్‌ఫ్రంట్ ఈస్ట్–వెస్ట్ కారిడార్‌ను మెట్రో రైలు ప్రాజెక్టులో చేర్చాలని సూచించారు. తారామతి నుంచి నార్సింగి వరకు నాగోల్, ఎంజీబీఎస్ మీదుగా మూసీ మెట్రో చేపట్టాలన్నారు.

సింగరేణికి కొత్త బాస్

ఇన్‌చార్జి సీఎండీగా ఎస్. బలరామ్ నియామకం


సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి బొగ్గు గనుల సంస్థ సీఎండీగా తొమ్మిదేళ్లపాటు పనిచేసిన ఎస్. శ్రీధర్ పదవీకాలం గతేడాది డిసెంబర్ 31తో ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో సింగరేణి ఫైనాన్స్ విభాగం డైరెక్టర్ ఎస్.బలరామ్‌కు సీఎండీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. శ్రీధర్‌ను తదుపరి పోస్టింగ్ కోసం రాష్ట్ర సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ఇన్‌చార్జి సీఎండీగా బాధ్యతలు స్వీకరించాక ఎస్.బలరామ్ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించగా తగిన చర్యలు చేపడతానని ఎస్.బలరామ్ తెలియజేశారు.

తొలిసారి ఐఆర్‌ఎస్ అధికారికి...: సింగరేణి 37వ సీఎండీగా నియమితులైన నూనావత్ బలరామ్ నాయక్ స్వస్థలం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలానగర్ మండలం తిరుమలగిరి పంచాయతీ పరిధిలోని బాల్యానాయక్ తండా. 1997 బ్యాచ్‌కు చెందిన ఆయన సివిల్స్‌లో ఇండియన్ రెవెన్యూ సర్వీస్‌కు ఎంపికయ్యారు. తొలి పోస్టింగ్ ఆదాయపు పన్ను శాఖలో చేశారు. అక్కడి నుంచి డిప్యుటేషన్‌పై 2018లో సింగరేణికి వచ్చారు. సివిల్స్‌కి ఎంపిక కాకముందు వ్యవసాయ కూలీగా, ఆటో డ్రైవర్‌గా, గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్‌గా పనిచేశారు. ఇప్పటివరకు సింగరేణికి 36 మంది సీఎండీలు పనిచేయగా తొలిసారిగా ఐఆర్‌ఎస్ కేడర్‌కు చెందిన అధికారి ఆ పదవిలో నియమితులవడం గమనార్హం.

వరుసగా తొమ్మిదేళ్లు..: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2015 జనవరి 1న సింగరేణి సీఎండీగా 1997 బ్యాచ్‌కు చెందిన ఎస్.శ్రీధర్‌ను అప్పటి ప్రభుత్వం నియమించింది. అయితే ఆయనను తొమ్మిదేళ్లు ఈ హోదాలో కొనసాగించడం విమర్శలకు దారితీసింది. దీనిపై కేంద్రం అభ్యంతరం తెలిపింది. శ్రీధర్‌ను ఎన్‌ఎండీసీకి పంపాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించింది. సంస్థ వార్షిక సర్వసభ్య సమావేశంలో శ్రీధర్ పదవీకాలం పొడిగింపును వ్యతిరేకిస్తూ అప్పట్లో కేంద్రం ఓటు వేసినా కానీ సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం ఉండటంతో మెజారిటీ ఓట్ల మద్దతుతో అప్పట్లో శ్రీధర్ పదవీకాలం పొడిగింపు ప్రతిపాదనల తీర్మానం నెగ్గింది. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో ఆయనకు ఈసారి పొడిగింపు లభించలేదు.

సిలిండర్ ఈకేవైసీ @ రూ.150

సిరిసిల్లలో బలవంతపు వసూళ్లు



ఏజెన్సీలో డబ్బు వసూలు చేస్తున్న దృశ్యం



ఈకేవైసీకి డబ్బు చెల్లించాలని ఏర్పాటు చేసిన బోర్డు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గృహజ్యోతి' పథకంలో రూ.500కే గ్యాస్ సిలిండర్ ప్రారంభానికి ముందే అక్రమార్కులకు కాసులపంట కురిపిస్తోంది. ఈకేవైసీ పేరుతో అందినకాడికి దోచుకుంటున్న విషయం మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై మహిళలు మీడియా ముందు గోడు వెళ్లబోసుకున్నారు. స్థానిక శివనగర్ ప్రాంతంలోని ఓ గ్యాస్ ఏజెన్సీలో ఈకేవైసీకి రూ.150 చెల్లించాలని ఏజెన్సీ నిర్వాహకులు ముక్కుపిండి వసూలు చేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించినవారిని బెదిరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. మరోవైపు ఈకేవైసీతో పాటుగా కచ్చితంగా పైపు తీసుకోవాలనే నిబంధన ఉందని నిర్వాహకులు చెప్పడం గమనార్హం. ఈ విషయమై జిల్లా పౌర సరఫరాల అధికారిని వివరణ కోరగా.. ఈకేవైసీకి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు




సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రైళ్ల వివరాలిలా..

- సికింద్రాబాద్–బ్రాహ్మణ్‌పూర్–వికారాబాద్ (07089/07090) స్పెషల్ ట్రైన్ ఈ నెల 7, 8, 14, 15 తేదీల్లో రాత్రి 7.45 కు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.15కు బ్రాహ్మణ్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 12.30గంటలకు బ్రాహ్మణ్‌పూర్ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు వికారాబాద్ చేరుకుంటుంది.
- వికారాబాద్–బ్రాహ్మణ్‌పూర్–సికింద్రాబాద్ (07091/07092) స్పెషల్ ట్రైన్ ఈ నెల 9, 10, 16, 17 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు వికారాబాద్ నుంచి బయలుదేరి మరుసటి రోజుఉదయం 11.15 గంటలకు బ్రాహ్మణ్‌పూర్ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో మధ్యాహ్నం 12.30కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30 కు సికింద్రాబాద్ చేరుకుంటుంది.
- విశాఖపట్టణం–కర్నూల్ (08541/08542) ప్రత్యేక రైలు ఈ నెల 10,11, 17, 18, 24, 25 తేదీల్లో సాయంత్రం 5.35 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.35కు కర్నూల్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు విశాఖకు చేరుకుంటుంది.
- శ్రీకాకుళం–వికారాబాద్ (08547/08548) స్పెషల్ ట్రైన్ ఈ నెల 12, 13, 19, 20, 26, 27 తేదీల్లో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో రాత్రి 8.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 కు వికారాబాద్‌కు చేరుకుంటుంది.
- సికింద్రాబాద్–తిరుపతి (02764/02763) స్పెషల్ ట్రైన్ ఈ నెల 10, 11, 17,18 తేదీల్లో సాయంత్రం 6.40 కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.45కు చేరుకుంటుంది.తిరుగు ప్రయాణంలో సాయంత్రం 5.15కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.55 గం.కు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది.
- సికింద్రాబాద్–కాకినాడ (07271/07272) ప్రత్యేక రైలు ఈనెల 12న రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రాత్రి 8.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 కు సికింద్రాబాద్ చేరుకుంటుంది.



ఆకాశం వైపు పెద్ద టార్చిలైట్ వేసినట్లు కనిపిస్తోంది కదూ.. చిలీలోని విలారికా అగ్నిపర్వతం రగులుతున్నప్పుడు ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ చిత్రాన్ని క్రిస్టోబార్ అనే ఫొటోగ్రాఫర్ తీశారు..

—టుడేస్ గ్రాఫిక్—





కొమ్మకొమ్మకో కాకమ్మ!

తెలతెలవారుతున్న వేళ.. కమ్ముకుంటున్న పొగమంచు.. చుట్టూ పరుచుకున్న వరిపైరు పచ్చదనం.. ఆ పక్కనే నీటితో కళకళలాడుతున్న కుంట.. వాటి చెంతనే ఉన్న చెట్టు.. దాని కొమ్మకొమ్మకు వాలిపోయిన కాకులు కనువిందు చేశాయి. ప్రకృతి పంచిన ఈ ఆహ్లాదానికి చూపరులు పరవశించారు. పెద్దపల్లి పట్టణ శివారులో మంగళవారం ఉదయం కనిపించిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది. – ఎం.సతీశ్‌రెడ్డి, సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

174 మంది విద్యార్థులు.. రూ. 61.27 లక్షలు

- గ్రామీణ పేద విద్యార్థుల కోసం 'చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్' విద్యార్థుల విరాళం
- క్లౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫాం 'ఫ్యూయల్ ఎ డ్రీమ్' ద్వారా సేకరణ



మహారాష్ట్ర గ్రామీణ ప్రాంతంలోని ఓ పాఠశాలలో బ్యాక్ టు స్కూల్ కిట్లను అందుకున్న విద్యార్థులు

రాయదుర్గం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే గ్రామీణ విద్యార్థులకు చేయూత ఇచ్చేందుకు కొండాపూర్‌లోని చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు నడుంబిగించారు. అందుకోసం 'క్లౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫాం ఫ్యూయల్ ఎ డ్రీమ్ డాట్ కామ్'ద్వారా నిధులను సేకరించారు. పాఠశాలకు చెందిన 174 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మూడు వారాల్లోనే రూ.61.27 లక్షలు సేకరించడం విశేషం. తెలంగాణ, మహారాష్ట్రలోని అన్ని ప్రాంతాలలో చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్యాక్–టు–స్కూల్ కిట్‌ను అందించడమే లక్ష్యంగా వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కిట్‌కోసం సంవత్సరానికి రూ.900 ఖర్చవుతుంది. గ్రీన్‌సోల్ అనే ఎన్‌జీఓ సహకారంతో ఈ కిట్‌ను తయారు చేయించారు. చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రతి విద్యార్థి రూ.27వేలు సేకరించడం లక్ష్యం. దీంతో 30 మంది గ్రామీణ విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. అయితే 174 మంది విద్యార్థులు రూ.61.27 లక్షలను సేకరించడంతో 6,800 మంది విద్యార్థులకు మేలు జరగనుంది.

150 మందికి ఒకటే బాత్రూం

విద్యార్థినులకు తప్పని అవస్థలు



బాత్రూం ముందు క్యూకట్టిన విద్యార్థినులు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెంలో ఒకే ప్రాంగణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఒక ప్రాథమిక పాఠశాల, రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 150 మంది విద్యార్థినులు, ఆరుగురు మహిళా టీచర్లు, ఇద్దరు అంగన్‌వాడీలు ఉన్నారు. ఆ ప్రాంగణంలో ఇంతమందికి ఉన్నది ఒక బాత్రూమే. పైగా డోరుకు గొళ్లెం కూడా లేదు. తాడు కట్టి కాపలా ఉంటూ లోపలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. అదీ పెద్ద క్యూ. లైన్‌లో నిలబడలేక విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. పాఠశాల ఆవరణలో గతంలో ఉన్న మూత్రశాలలను తొలగించి కొత్తవాటిని నిర్మించే పనులు మొదలుపెట్టినా ఆ పనులు పూర్తి కాలేదు. దీనివల్ల విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

అన్నా...లే అన్నా... ఆడుకుందాం..

అన్న మృతదేహం వద్ద తమ్ముడి వేదన



ఆడుకుందామని పిలుస్తున్న తమ్ముడు జ్ఞానప్రకాశ్

మహబూబాబాద్ రూరల్: 'అన్నా ఆడుకుందాం లే అన్నా.. ఏమైందన్నా..' అంటూ విగతజీవుడైన అన్న చేయి పట్టి తమ్ముడు ఏడుస్తున్న దృశ్యం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన చింత సుధాకర్, వినోద దంపతులకు ఇద్దరు కుమారులు విజయప్రకాశ్ (8), జ్ఞానప్రకాశ్. బతుకుదెరువు కోసం వారి కుటుంబం హైదరాబాద్‌కు వలసవెళ్లింది. స్వగ్రామంలో సొంత పని ఉండటంతో సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి రైలులో మహబూబాబాద్ వచ్చారు. రాత్రి పొద్దుపోయేసరికి ముత్యాలమ్మగూడెం గ్రామంలో తమ బంధువుల ఇంట్లో బస చేశారు. మంగళవారం ఉదయం మచ్చర్ల గ్రామానికి వెళ్లేందుకు సుధాకర్, వినోదలు పిల్లలతో కలిసి ముత్యాలమ్మగూడెం క్రాస్‌రోడ్డు వద్ద బస్సు కోసం నిలుచున్నారు. బస్సు వస్తున్న విషయాన్ని గమనించి వారు రోడ్డు దాటుతుండగా గూడూరు వైపునుంచి మహబూబాబాద్ వైపునకు వస్తున్న ఓ కారు విజయప్రకాశ్‌ను ఢీ కొట్టింది. దీంతో బాలుడికి తీవ్ర గాయాల య్యాయి. ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడు. ఆస్పత్రి నుంచి తన అన్న ఇంకా బయటకు రావటంలేదని భావించిన తమ్ముడు జ్ఞానప్రకాశ్ ఆ బాలుడికి చికిత్స అందించిన గది లోకి వెళ్లిచూశాడు. అప్పటికే విజయ ప్రకాశ్‌ను అక్కడ పడుకోబెట్టి ఉంచగా తమ్ముడు అన్న దగ్గరికి వెళ్లి చూస్తూ 'అన్నా...ఆడుకుందాం లే అన్నా' అంటూ పిలిచాడు. ఎంత పిలిచినా అన్న లేవకపోవడంతో 'అన్న నిద్రపోతున్నాడు' అంటూ ఏడుస్తూ అక్కడినుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటనను చూసిన అక్కడివారంతా కంటతడి పెట్టారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.